www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 50 | బుధవారం | 9 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పెట్టుబడి సాయం రైతులందరికీ

దరఖాస్తులు అక్కర్లేకుండానే ఎకరానికి రూ.8వేలు నేరుగా ఖాతాల్లోకి

పంట సాగుకు 15 రోజుల ముందే అందజేస్తాం

రాష్ట్రం మూడేళ్ల బిడ్డ అయినా.. ఆదాయంలో దేశంలోనే దొడ్డ

మూడుచింతలపల్లి గ్రామసభలో ముఖ్యమంత్రి కెసిఆర్



మన తెలంగాణ/ మేడ్చల్: వ్యవసాయ పెట్టుబడి కోసం రాష్ట్రంలోని రైతులందరికీ వచ్చే ఏడాది నుంచి ఎకరానికి రూ.8వేలు అందజేస్తామని సిఎం కెసిఆర్ మరోసారి స్పష్టం చేశారు. దరఖాస్తులతో అవసరం లేకుండా పంట సాగుకు 15 రోజుల ముందుగానే పెట్టుబడి నగదును నేరుగా రైతు ఖాతాలో జమచేస్తామని చెప్పారు. ఇక గ్రామానికి రైతే కథానాయకుడు కావాలన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మూడుచింతలపల్లి గ్రామసభలో మాట్లాడారు. భూ సర్వేలో వ్యవసాయ అధికారులు చూపుతున్న లెక్కలకు, రెవెన్యూ రికార్డులకు చాలా వ్యత్యాసం ఉందని, భూ రికార్డులు సరిచేసేందుకు మూడు మాసాల ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రతి గుంట భూమి లెక్క తేలుస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొత్త పద్ధతిలో రైతులకు పాస్‌బుక్‌లు అందజేస్తామని చెప్పారు. దేశంలోని ఐదు సర్వే ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. మ్యుటేషన్లపై తహశీల్దార్‌లకే అధికారాలు ఇస్తామని ప్రకటించారు. తెలంగాణ తరువాయి 6లో

15 టిఎంసిలు వదలండి

- కర్ణాటకకు మంత్రి హరీశ్‌రావు లేఖ



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆల్మట్టి, నారాయణ్‌పూర్ రిజర్వాయర్ నుంచి 15 టిఎంసిల నీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకను కోరింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్ రావు కర్ణాటక భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖమంత్రి ఎం.బి. పాటిల్‌కు మంగళవారం లేఖ రాశారు. తెలంగాణలో తాగునీటికి తీవ్ర ఎద్దడి ఉందని, ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలు, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు తరువాయి 6లో

మరి రెండేళ్లు

ఉద్యోగాలకు 44 ఏళ్ల వయో పరిమితి వర్తింపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి సడలింపును మరో రెండేళ్లపాటు ప్రభుత్వం పొడిగించింది. గరిష్ఠ వయో పరిమితిని 34 నుంచి 44 ఏళ్లకు పెంచుతూ గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సడలింపు జులై 26తో ముగిసింది. ఈ నేపథ్యంలో పదేళ్ల సడలింపును 2019, జులై 26 వరకు మరోసారి పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, అటవీశాఖల్లోని కొన్ని పోస్టులకు ఈ సడలింపు వర్తించదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీలకు మార్గదర్శకాలు

- తెలంగాణ, ఎపి సంయుక్త ఉత్తర్వులు, భార్యాభర్తలైన ఉద్యోగులకు ఊరట

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర బదిలీలపై మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మంగళవారం ఉత్తర్వులు ఇచ్చాయి. స్థానిక, జిల్లా, జోనల్, మల్టీ జోనల్‌లో ఉద్యోగుల హోదాల వారీగా బదిలీలకు అవకాశమిచ్చారు. స్థానికత ఆధారంగా భార్యాభర్తలు తరువాయి 6లో

గురుకుల పరీక్షల తేదీలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో వివిధ గురుకులాల్లో పిఇటి, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు, లైబ్రేరియన్, స్టాఫ్ నర్స్ పోస్టులకు సవరించిన రాత పరీక్ష తేదీలను టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. ఈనెల 31న ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ పోస్టులకు, సెప్టెంబర్ 1న మ్యూజిక్ టీచర్లు, 17న ఉదయం, మధ్యాహ్నం లైబ్రేరియన్ (స్కూల్స్) పరీక్షలు నిర్వహించనున్నట్లు కమిషన్ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ పేర్కొన్నారు. ఈ పరీక్షలకు ఈనెల 26 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 17,18 తేదీలలో స్టాఫ్ నర్స్, పిఇటి పోస్టులకు రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురుకులాల్లో డిగ్రీ కళాశాల లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు, జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్, ఫిజికల్ తరువాయి 6లో

దద్దరిల్లిన పార్లమెంట్

రాహుల్ మీద రాళ్లదాడిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఆగ్రహం

రెండు సైజుల రూ.500, 2000 నోట్లపై రాజ్యసభలో విపక్షం అభ్యంతరం, గొంతు కలిపిన శరద్ యాదవ్



న్యూఢిల్లీ : విపక్ష సభ్యులు లేవనెత్తిన వివిధ అంశాలతో పార్లమెంటు ఉభయసభలు మంగళవారం అట్టుడికిపోయాయి. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌పై జరిగిన దాడి ఘటన లోక్‌సభను కుదిపేసింది. దాంతో ప్రజా సమస్యలపై ఫలవంతమైన చర్చలు జరగకుండానే సభ నేటికి వాయిదా పడింది. మరోవైపు రాజ్యసభలోనూ రూ.500, తరువాయి 6లో

నేరెళ్ల బాధాకరం: కెటిఆర్

బాధితులను పరామర్శించిన మంత్రి, విచారణ అనంతరం బాధ్యులపై చర్యలకు హామీ



మన తెలంగాణ/ వేములవాడ : నేరెళ్ల బాధితులపై జరిగిన ఘటన దురదృష్టకరమని ఐటి శాఖమంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మనోహర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎంఎల్‌ఎలు రమేశ్ బాబు, పుట్ట మధులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం ఎంఎల్‌ఎ రమేశ్ బాబు నివాసంలో మంత్రి కెటిఆర్ విలేకరులతో మాట్లాడారు. నేరెళ్ల లారీల దగ్ధం కేసులో 8 మందిని అరెస్టు చేసి కొట్టడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులు చనిపోయారనే బాధతో క్షణికావేశంలో లారీలు తగలబెట్టారే తప్ప ఉద్దేశపూర్వకంగా చేసింది కాదన్నారు. టిఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు అధికారాన్ని ఇచ్చారని, దాన్ని తాము కాపాడుకుంటామని చెప్పారు. ఇక ముందు ఇలాంటి చర్యలు జరగకుండా చూస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో తరువాయి 6లో



పొన్నం ప్రభాకర్ దీక్ష భగ్నం

- మంగళవారం తెల్లవారుజామున బలవంతంగా ఆసుపత్రిలో చేర్పించిన పోలీసులు 3

చైనాలో భారీ భూకంపం

- వంద మందికిపైగా మృతి
- రిక్టర్‌స్కేలుపై తీవ్రత 7.0 11

సిజెఐగా దీపక్ మిశ్రా



- 27తో ముగియనున్న ఖేహర్ పదవీ కాలం 10

కుంచెపోటు



ఎందుకీ అసహనం?

ప్రతిపక్షాల మీద సిఎం ఒంటికాలుపై లేవడమెందుకు

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడం వాటి హక్కు

- సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రభుత్వ వైఫల్యాలను రాజకీయంగా ఎత్తి చూపడం ప్రతిపక్షాల హక్కు అని, దానికే ముఖ్యమంత్రి కెసిఆర్ ఒంటికాలితో ప్రతిపక్షాలపై లేస్తున్నారని, ఆయనకు ఎందుకింత అసహనమని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ సాధనలో రాజకీయ పార్టీలతో పాటు, సబ్బండ వర్గాల ఉమ్మడి పాత్ర ఉందా? లేదా? అని నిలదీశారు. ఇటీవల సిపిఐ నిర్వహించిన తెలంగాణ అభివృద్ధి సదస్సులో తాను 'సిల్లీ'గా మాట్లాడానని సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ చేసిన వాగ్దానం 'బంగారు తెలంగాణ' లక్ష్యం వైపునకు పాలన సాగడం లేదని రాజకీయంగా తాను పలు అంశాలను లేవనెత్తానని, వాటికి సమాధానం ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం సురవరం సుధాకర్‌రెడ్డి 12 ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ సిఎం కెసిఆర్‌కు ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో ఏక వ్యక్తి నియంతృత్వ పాలన సాగుతున్నదని, అవినీతి పెరుగుతున్నదని, సాగు, తాగు నీటి తరువాయి 6లో

జిఎస్‌టి అద్భుతమని కితాబెలా ఇచ్చారు? : జీవన్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: జిఎస్‌టి వల్ల జరిగే నష్టం గురించి తెలియకుండానే జిఎస్‌టి అద్భుతమని కెసిఆర్ ఎలా కితాబునిచ్చారని సిఎల్‌పి ఉపనాయకుడు ఎ.జీవన్ రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ జిఎస్‌టిని సమర్థించిందే కెసిఆర్ అని, అందుకే తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జిఎస్‌టిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెబుతున్నారన్నారు. కరీంనగర్‌లో వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని సిఎం కెసిఆర్ హామీ నిచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ దీక్షకు దిగితే ఆయనపై ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యం చేయించిందన్నారు. ముస్లిం రిజర్వేషన్లకు ప్రధాని మోడి సానుకూలమని చెబుతున్న కెసిఆర్, మరి రిజర్వేషన్ల అమలు చేసేందుకు అడ్డుపడుతున్న వారేవరో చెప్పాలని ప్రశ్నించారు. మెడిగడ్డ, సుందిళ్ల అన్నారంకు ఉపయోగిస్తున్న రివర్స్ పంపింగ్ విధానాన్ని ఎస్‌ఆర్‌ఎస్‌పి వరకు కొనసాగించాలని, కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్‌తో తరలించడంతో వరదల సమయంలో విద్యుత్ ఉత్పత్తి కూడా కలిసి వస్తుందన్నారు. తద్వారా 50 కిలో మీటర్ల కాలువ నిర్మాణం అదనంగా రెండు లిఫ్టుల భారం కూడా తగ్గుతుందని చెప్పారు. గోదావరి ద్వారా రివర్స్ పంపింగ్‌ను అమలు చేస్తే కేంద్ర నిధులు కూడా వస్తాయన్నారు. కడెంకు దిగువన మరో ప్రాజెక్ట్‌ను నిర్మిస్తే మరింత ఉపయోగంగా ఉంటుందని ఆయన చెప్పారు.

ధరలను నియంత్రించండి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో కూరగాయల ధరలను నియం త్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ నిఘా లేకపోవడంతో ఒక వైపు రైతు లు, మరోవైపు వినియోగదారులు బాధితుల ఉన్నారని ఆయన ఒక ప్రక టనలో తెలిపారు. రైతులు కూరగాయల సాగును పెంచే విధంగా ప్రభు త్వం ప్రోత్సాహకాలు అందించాలని, ప్రత్యేక కేంద్రాలతో పాటు సంచార వాహనాల ద్వారా కూరగాయలను సబ్సిడీ రేట్లకు అందజేయాలని, నిర్ణీత ధరలకే విక్రయించాలని కోరారు. ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.

పంట కాలనీల ఏర్పాటుపై ప్రభుత్వం...

ప్రత్యేక దృష్టి

- **రైతు సమాఖ్యలకు బడ్జెట్‌లో రూ.500కోట్లు కేటాయింపు**
- **త్వరలో 3,000 మంది రైతు ప్రతినిధులతో సిఎం వర్క్‌షాప్**

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: పంట కాలనీల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనివల్ల పంటల సాగులో మౌలిక మార్పులు చేయవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఏఏ ప్రాంతాల్లో, ఏ రకాల భూముల్లో ఎలాంటి పంటలు వేయాలి అనే విషయాలపై అవగాహన కలిగిన ప్రతినిధులతో త్వరలో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌ను మినహాయించి 30 జిల్లాల్లో జిల్లాకు 100 మంది చొప్పున 3,000 మందిని ఎంపిక చేసి జిల్లాల వారీగా జాబితాను గత నెలలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. వీరితో పాటు మరో 1,000 మంది ప్రస్తుత, పదవీవిరమణ పొందిన వ్యవసాయాధికారులతో కలిపి 4,000 మందితో ముఖ్యమంత్రి ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. రైతు సమాఖ్యల ఏర్పాటులో భాగంగా జిల్లాకు 100 మంది రైతులను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. వీరి ఎంపికలో ప్రభుత్వం ఎటువంటి నియమ నిబంధనలను నిర్దేశించనప్పటికి నల్లగొండ వ్యవసాయశాఖాధి కారు లు పాటించిన నియమాలనే అన్ని జిల్లాలకు వర్తింప చేశారు. ప్రతినిధిగా ఎన్నికైనవారు రైతు సమగ్ర సర్వేలో పేరు నమోదు చేసుకొని వుండాలి. పంటల సాగు విషయంలో అనుభవం కలిగి వుండాలి. నూతన పంటల విధానం, వాణిజ్య పం టలు, మార్కెట్‌పై సరైన అవగాహన కలిగి, వివాదస్పదరహితులుగా వున్న వారిని ప్రతినిధిగా ఎంపిక చేయాలన్న సూచనలతో అభ్యర్థుల జాబితా అధికారులు సిద్ధం చేశారు.



జిల్లాకు వంద మంది ప్రతినిధులలో హార్టీకల్చర్‌కు సంబంధించి 20 మంది ప్రతినిధులుగా వుం టారు. ఈ ప్రతినిధులకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ పేరును సూచించనప్పటికి సిఎం సమక్షంలో జరిగే సమీక్షా సమావేశంలో అధికారికంగా వీరికి నామకరణం చేయనున్నట్లు తెలిసింది. గత నెలలోనే రైతు ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని అధికారులు భావించినప్పటికి కొంత జాప్యం జరిగింది. ఈ నెల మూడోవారంలో వర్క్ షాష్ నిర్వహంచనున్నట్లు సమాచారం. రాష్ట్ర బడ్జెట్‌లో రైతు సమాఖ్యల పేరుతో రూ. 500 కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభు త్వం రూపొందించింది. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంటకాలనీలను అభివృద్ధి పరిచే దిశగా ఈ ప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆధునిక పంటల సాగును, యంత్ర పరికరాల వాడకాన్ని ప్రోత్సహించడం, పంటలు నష్టపోయిన వారికి పంటలబీమా పథకం వర్తింపచేయడం వంటివి పంట కాలనీలతో సాధ్యమౌతుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

టోకెన్ సమ్మెకు సిద్ధం!

- **తెలంగాణ రాష్ట్ర స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్**

మన తెలంగాణ/హైదరాబాద్ : మున్సిపల్ కార్మికులు టోకెన్ సమ్మెకు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) పిలుపునిచ్చింది. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం అధ్యక్షతన సమావేశం జరిగింది. మున్సిపాలిటీలలోని కార్మిక సంఘాలు జెఎసిగా ఏర్పడి ఆగస్టు 29, 30 రెండు రోజులు టోకెన్ సమ్మె చేయాలని, అన్ని మున్సిపాల్టీలలో ధర్నాలు, ప్రదర్శనలు చేపట్టి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని సమావేశం నిర్ణయించింది. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరింది. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ, మున్సిపాల్టీ, నగర పంచాయితీలలో పని చేస్తున్న కార్మికులకు 10వ పిఆర్‌సి వేతన పరిధిలో భాగంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. 2015లో వేతనాల పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్చేయాలని కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా త్వరలో వేతనాలు పెంచుతామని హామి ఇచ్చి కమిటీ వేశారన్నారు. కమిటీ రిపోర్టు వచ్చినప్పటికీ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని సిబ్బందికి పెంచి మున్సిపల్ కార్మికులకు నేటికి పెంచకపోవడం దారుణమని అన్నారు. కనీస వేతనాలతో పాటు సమాన పనికి సమాన వేతన విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు యం.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు రూ.250 కోట్లు

రాబోయే రెండేళ్లలో కేటాయింపు : మంత్రి జోగు రామన్న

మన తెలంగాణ/మన తెలంగాణ/హైదరాబాద్ : రెండు సంవత్సరాల్లో నాయీ బ్రాహ్మణుల కోసం రూ.250 కోట్లు వెచ్చించనున్నట్లు బిసి సం క్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. రాష్ట్ర బిసి సం క్షేమ శాఖ నాయీబ్రాహ్మణ సహకార సంఘాల సమాఖ్య సంయుక్తాధ్వర్యంలో బేగంపేట్‌లో మంగళవారం హెయిర్ కటింగ్ సెలూన్, బ్యూటిషియన్‌లలో ఆధునాతన పరికరాల ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ, తొలి విడతగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.161 కోట్లను, రెండవ విడతగా వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.69 కోట్లను మొత్తం రూ.230 కోట్లను నాయీబ్రాహ్మణలకు రుణాలుగా అందిస్తామని తెలిపారు. మిగిలిన రూ.20 కోట్లను నైపుణ్యాభివృద్ధి కోసం ఉపయోగిస్తామన్నారు. 17,250 నాయిబ్రాహ్మణ సంఘాలున్నాయని, వీటిలో 68 వేల మంది సభ్యులుగా ఉన్నారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం నాయీబ్రాహ్మణులు 3 లక్షల మంది వరకు ఉన్నారన్నారు. సంఘాల్లో సభ్యత్వం ఉన్నవారితో పాటు ఆ వర్గం వారికి పథకం లబ్ది అందేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని, తగిన సూచనలు చేయాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి అవగాహన కోసం త్వరలో జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రిలయన్స్ లాంటి బహుళ జాతి సంస్థలు క్షౌర వృత్తిని హైజాక్ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా అడ్డుకుంటామన్నారు. నాయీబ్రాహ్మణులు పలు సంఘాలుగా కాకుండా ఒకే సంఘంగా ఉండాలని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. యూనిట్ విలువలో 80 శాతం సబ్సిడీగా అందజేయడం అరుదైన విషయమన్నారు. నాయీబ్రాహ్మణుల్లో క్షౌరవృత్తితో పాటు బ్యాండ్ వాయించే వారున్నారని, అలాంటి వారికి ఉచితంగా డ్రెస్, బ్యాండ్ పరికరాలు అందజేయాలని ఆయన జోగురామన్నను కోరారు. నాయిబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్న సిఎం కెసిఆర్ ఆధునిక పెరియార్ అని ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. పాలిటెక్నిక్, ఐటిఐ కోర్సుల్లో నాయిబ్రాహ్మణుల వృత్తివిద్యలను కోర్సులుగా చేర్చాలని ఆయన కోరారు. హైదరాబాద్ నగరంలో వారి సంక్షేమానికి భవనం నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవం గురించి ఆలోచించిన తొలి సిఎం కెసిఆర్ అని అన్నారు. సమావేశంలో బిసి కమిషన్ సభ్యులు వకుళాభరం కృష్ణమోహన్, డాక్టర్ ఆంజనేయ గౌడ్, జూలూరి గౌరీశంకర్, ప్రభుత్వ సలహాదారు కె. రామలక్ష్మ ణ్ తదితరులు ప్రసంగించారు. జాతీయ ఎంబిసి ఛైర్మన్ కాలప్ప, బిసి శాఖ ఇంఛార్జ్ కమిషనర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



అవి సర్కారు సంఘాలే

- **రైతు జెఎసిలను ఏర్పాటు చేస్తాం**
- **భూనిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలిచ్చే వరకు పోరాటం**
- **జెఎసి ఛైర్మన్ కోదండరాం**



మన తెలంగాణ/కరీంనగర్/మంచిర్యాల : రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవలి కాలంలో రైతులు సంఘాలు పెట్టుకోవాలని, గట్టిగా నిలబడాలని చెబుతున్నారని అయితే అవి సర్కారు సంఘాలు కాకుండా ఉండాలంటే రైతులు తమకు తాము సంఘాలు వేసుకొని సంఘటితంగా నిలబడాల్సిన అవసరం ఉందని టిజెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం స్థానిక ఫిలిం భవన్‌లో తెలంగాణ రాష్ట్రం, వ్యవసాయ రంగం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో 103 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇందులో 82 శాతం ఆత్మహత్యలు 9 మండలాలల్లోనే కేంద్రీకృతం కావడానికి కారణాలు ఏమిటన్న దానిపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఇతర జిల్లాలలో 10 శాతం మందికైనా ఆర్థిక సహాయం అందితే కరీంనగర్ జిల్లాలలో ఏ ఒక్కరికీ ప్రభుత్వ పరంగా సహాయం అందలేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. నేరేళ్ళలో దళితుల పై ఇసుక మాఫియాల దౌర్జన్యాన్ని వెలుగులోకి తేవడంలో జెఎసి సఫలీకృతమైందన్నారు. సింగరేణి సంస్థ ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్మించిన పవర్‌ప్లాంట్‌లో భూనిర్వాసిత కుటుంబాకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని జెఎసి చైర్మన్ కోదండరాం డిమాండ్ చేశారు. మంగళవారం జైపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌లో 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ ఒక ఉద్యోగం కూడా శాశ్వత ఉద్యోగం కల్పించలేదని ఆరోపించారు. భూ నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించే వరకు తాముపోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణను బొందల గడ్డగా మారుస్తామని ప్రయత్నం చేస్తుందని, దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నో త్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణను సామాన్యుడు బతికే పరిస్థితి లేదన్నారు. తమకు బంగారు తెలంగాణ కాదని, బతుకు తెలంగాణ కావాలని పిలుపునిచ్చారు.

పొన్నం అరెస్టు నిర్బంధకాండకు పరాకాష్ఠ



మన తెలంగాణ / హైదరాబాద్ : కరీంనగర్‌లో మెడికల్ కాలేజీ కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్‌ను ప్రభుత్వం దొంగచాటుగా అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించడం ప్రభుత్వ నిర్బంధకాండకు పరాకాష్ఠ అని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దీక్ష చేయడం రాజ్యాంగ హక్కుల్లో భాగమని, మంజూరైన మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయకుండా సిఎం మాట తప్పి, ప్రజా స్వామ్యయుతంగా ఉద్యమిస్తున్న వారిని అరెస్టు చేయడమేమిటన్నారు. సిరిసిల్లలో పాలకుల దాష్టీకానికి బలైన దళితులను పరామర్శించేందుకు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ వస్తే సభకు అనుమతినివ్వలేదని, పొన్నం దీక్షకు అనుమతి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందన్నారు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు...

సిరిసిల్లలో దళితులపై పోలీసుల చిత్రహింసలకు గురైన దళితులను మంత్రి కెటిఆర్ దొంగచాటుగా పరామర్శించిన తీరు దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లుందని పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి ఒక ప్రకటనలో అన్నారు. హైదరాబాద్‌లో పోలీసులకు మద్దతు తెలిపిన కెటిఆర్, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. కెసిఆర్ దొంగ నాటకాలను ప్రజలు విశ్వసించరని, ఆయన ఇసుక మాఫియావైపే ఉంటారన్నారు.

90 లక్షల చీరల పంపిణీ

- **బతుకమ్మ పండుగకు పంచనున్న ప్రభుత్వం**
- **కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ ఎస్‌పి సింగ్**



మన తెలంగాణ /హైదరాబాద్ : బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల చీరలను మహిళలకు పంపిణీ చేయనున్నందున గ్రామాల వారీగా ప్రణాళికలు పొందించుకోవాలన్నారు. చీరల పంపిణీ కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను గుర్తించి టిమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అర్హులైన పేద మహిళలకే చీరలు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. చీరలు భద్రపరచడానికి అవసరమైన గోడౌన్లను జిల్లా స్థాయిలో ఎంపిక చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. సెప్టెంబర్ 20 నుండి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుందని, పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం నుండి మంగళవారం జిఎడి ముఖ్య కార్యదర్శి అదర్ సిన్హా, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అశోక్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, గిరిజన సంక్షేమ కార్యదర్శి బెనహర్ మహేశ్ దత్ ఎక్కా, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చంద్ర వదన్, చేనేత జౌళి శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, గ్రామీణ అభివృద్ధిశాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ తదితరులతో కలిసి సిఎస్ ఎస్‌పి సింగ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బతుకమ్మ చీరల పంపిణీ అంశంతో పాటు రెవెన్యూ భూ రికార్డుల ప్రక్షాళన, మిషన్ భగీరథ, హరితహారం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపైనా సిఎస్ సమీక్ష చేశారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలలో ఘనంగా నిర్వహించడానికి అధికారులకు సిఎస్ దిశా నిర్ధేశనం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు జిల్లాలు సాధించిన ప్రగతిపై ప్రసంగాలు రూపొందించుకోవాలని కలెక్టర్లను కోరారు.

భూ రికార్డులపై ప్రత్యేక సమీక్ష : రెవెన్యూ భూ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి తదుపరి సమావేశంలో ప్రత్యేకంగా సమీక్ష చేస్తామని, క్షేత్ర స్థాయి పరిస్థితుల కారణంగా వాస్తవ పరిస్థిత ఆధారంగా రికార్డులను రూపొందించాలన్నారు. అర్హులైన రైతులకు ప్రభుత్వం అందించబోయే సబ్సిడి చేరాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. హరితహారం మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జియో ట్యాగింగ్ , గ్రీన్ బ్రిగేడ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలలో కొత్తగా వేసే బోర్లకు అనుమతులు ఇవ్వవద్దని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలు సంమృద్ధిగా కురుస్తాయని, నిర్దేశిత లక్ష్యాల మేరకు మొక్కలు నాటేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

సబ్సిడీ నిధులను విడుదల చేయండి

మన తెలంగాణ/హైదరాబాద్: స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీ నిధులను సకాలంలో విడుదల చేయకుండా బ్యాంకర్లు తమ వద్దనే పెట్టుకోవడం మంచి పద్ధతి కాదని ఎస్‌సి సహకార అభివృద్ధి సంస్థ ఎం.డి లచ్చిరాం భూక్య అన్నారు. లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేసే క్రమంలో వారి నుంచి బ్యాంకర్లు డిపాజిట్లు స్వీకరించకుండా చూడాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. సంక్షేమ భవన్‌లో మంగళవారం వివిధ బ్యాంక్ నియంత్రణ అధికారుతో లచ్చిరాం భూక్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకులకు చెందిన బ్యాంక్ నియంత్రణ అధికారులు, జాతీయ ఎస్‌సి ఆర్థికాభివృద్ధి సంస్థ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సి సహకార అభివృద్ధి సంస్థ అమలు చేస్తున్న పథకాలు, రుణాల మంజూరు లో జాప్యం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని, జాప్యాన్ని నివారించేలా స్థానిక బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన బ్యాంక్ నియంత్రణ అధికారులకు సూచించారు. ప్రభుత్వ సబ్సిడీలను లబ్ధిదారులకు సకాలంలో విడుదల చేయకపోతే, వాటిని తిరిగి వెంటనే తమకు ఇవ్వాలని, లేదంటే దానిపై వడ్డీ చెల్లించాలని సూచించినట్లు తెలిసింది.

201617 సంవత్సరానికి చెందిన బ్యాంక్ ఖాతాలను ఈనెల 15లోపు తెరవాలన్నారు. 201415, 201516 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న పథకాలను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని, 201718 వార్షిక కార్యచరణ ప్రణాళికను నిర్దేశించిన కాలపరిమితిలోపు అమలు చేయాలని, ఆ దిశగా బ్యాంక్ అధికారులు ప్రయత్నించాలని చెప్పారు.

నాగేశ్వరరావు మృతికి జెన్‌కోదే బాధ్యత

మన తెలంగాణ/హైదరాబాద్ : పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని ఆర్టిజాన్స్‌గా నియమిస్తామని చెప్పి ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు మాట తప్పిన ఫలితంగా కె.టి.పి.ఎస్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు కె.నాగేశ్వరరావు పురుగుల మందు తాగి మరణించారని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. మరో కార్మికురాలు కూడా ఆత్మహత్యా ప్రయత్నం చేసిందని, ఈ పాపం జెన్‌కోదని, పరోక్షంగా ప్రభుత్వానిదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఎం.సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెరిఫికేషన్ కమిటీ అవకతవకలకు పాల్పడిందని విమర్శలు వెల్లువెత్తడంతో ఆ కమిటీని మారుస్తామని సి.ఎం.డి ప్రకటించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని తగిన చర్యలు చేపట్టాలని, మృతుని కుటుంబానికి తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు.



ఎస్‌సిఆర్ సిఎస్‌టిఇగా శ్రీవాత్సవ బాధ్యతలు

మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజినీర్ (సిఎస్‌టిఇ)గా ఐఆర్‌ఎస్‌ఎస్‌ఇ వినయ్‌మోహన్ శ్రీవాత్సవ మంగళవారం భాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆయన సెంట్రల్ రైల్వేలో చీఫ్ సిగ్నల్ ఇంజినీర్‌గా భాధ్యతలు నిర్వర్తించారు. రైల్వేలో 1984లో అసిస్టెంట్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజినీర్‌గా చేరిన శ్రీవాత్సవ పలు జోన్ల పరిధిలో వివిధ హోదాలో భాధ్యతలు నిర్వర్తించారు. ఈశాన్య రైల్వేలో వ్యూహాత్మకంగా అత్యంత ముఖ్యమైన పలు కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, డబ్లింగ్, గేజ్ మార్పిడి ప్రాజెక్టుల్లో శ్రీవాత్సవ కీలకపాత్ర పోషించారని ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో వివరించారు.

కాళోజీ అవార్డు ఎంపిక కమిటీ ఏర్పాటు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రముఖ కవి, దివంగత కాళోజీ నారాయణరావు పేరిట 2017 సంవత్సరానికి గాను అవార్డు ప్రదానం చేసేందుకు అర్హున్ని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు యువజన సేవలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి ఛైర్మన్‌గా, సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ సభ్య కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యమంత్రి ఓఎస్‌డి దేశపతి శ్రీనివాస్, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, వేణు సంకోజు సభ్యులుగా ఉన్నారు.

10న ఢిల్లీకి సిఎం కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం కెసిఆర్ ఈనెల 10వ తేదీ రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. 11వ తేదీన జరిగే ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొననున్నారు. విభజన సమస్యలు, ప్రాజెక్టులపై జిఎస్‌టి భారం, సిఎస్‌టి బకాయిలు వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతో పాటు కేంద్ర పెద్దలను కలిసే అవకాశం ఉంది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులపై జిఎస్‌టికి పూర్వం ఎంత పన్ను విధిస్తున్నది, ప్రస్తుతం ఎంత భారంగా మారిందనేది ఒక నివేదిక అందచేయనున్నారు. ఈ మేరకు ప్రాజెక్టు వారీగా నివేదిక రూపొందించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను సిఎం ఇప్పటికే ఆదేశించారు. 9, 10వ షెడ్యూలులోని సంస్థల విభజనపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా సిఎం కేంద్రాన్ని కోరనున్నారు.

28.31 శాతం డి.ఫార్మసీ సీట్లు భర్తీ

మన తెలంగాణ/హైదరాబాద్ : డిప్లొమా ఇన్ ఫార్మసీ(డి.ఫార్మసీ) సీట్లు కేటాయింపు పూర్తయ్యింది. కన్వీనర్ కోటా కింద 830 సీట్లు అందుబాటులో ఉండగా, 235(28.31 శాతం) సీట్లను కేటాయించినట్లు ప్రవేశాల కన్వీనర్ ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 595 సీట్లు ఖాళీగా మిగిలినట్లు పేర్కొన్నారు. 246 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాగా, 236 మంది విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారని అన్నారు. ఈ నెల 11వ తేదీలోగా ఫీజు చెల్లించి, కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

ఐపిఎం డిపిసి ఏర్పాటు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం)లో మొదటి స్థాయి గెజిటెడ్ పోస్టుల కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఛైర్‌పర్సన్‌గా, ఐపిఎం సంచాలకులు సభ్య కార్యదర్శిగా వ్యవహరించే ఈ కమిటీలో వైద్య ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి లేదా సంయుక్త కార్యదర్శి లేదా ఉప కార్యదర్శితో పాటు వైద్య విద్య సంచాలకులు సభ్యులుగా ఉంటారు.

22న డాక్ అదాలత్

మన తెలంగాణ /హైదరాబాద్ : తపాలా సేవలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈ నెల 22న డాక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు తెలంగాణ సర్కిల్ ఛీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నేరుగా వచ్చి ఫిర్యాదులు చేసే వారు తెలంగాణ సర్కిల్ ఛీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు రావచ్చని, ఒక వేళ స్వయంగా రాలేని వారు ఉంటే ఉత్తరాలు, ఎన్వలప్‌ల ద్వారా తమ ఫిర్యాదులను '95వ డాక్ అదాలత్, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ జనరల్ , ఛీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం (తెలంగాణ సర్కిల్), హైదరాబాద్500001 చిరునామాకు ఈ నెల 14వ తేదీ లోగా పంపించాలని తపాలాశాఖ ఆ ప్రకటనలో తెలిపింది.

బాధ్యతలు స్వీకరించిన ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ 1గా నియమితులైన ప్రొ. లింబాద్రి, వైస్ ఛైర్మన్2 ప్రొ. వెంకటరమణలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి ఛైర్మన్‌గా ప్రొ. టి.పాపిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు : ఉన్నత విద్యామండలి సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రముఖ విద్యావేత్తలు ప్రొ. శివరాజ్, ప్రొ. కె.శివశంకర్, ప్రొ.సయ్యద్ రహ్మాన్, ఒ.నర్సింహ్మారెడ్డి, ప్రొ. కె.శ్యామల, డా. ఆర్.నాగేందర్‌రెడ్డి పారిశ్రామికవేత్త జి.ఎస్.రాజేందర్‌రెడ్డిలను సభ్యులుగా నియమిస్తున్నట్లు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు మూడేళ్లపాటు సభ్యులుగా కొనసాగుతారు.

గిరిజన భూమి అభివృద్ధికి అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్: గిరిజన భూమి అభివృద్ధి పథకంలో మిగిలిపోయిన పనులను ఇందిర జల ప్రభ మార్గదర్శకాల మేరకు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ పనుల నిమిత్తం 2017 18 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికలో సుమారు రూ.110 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్) ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపింది. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం అందుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెనహర్ మహేష్ దత్ ఎక్కా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూమి అభివృద్ధి పథకంలో వివిధ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నాలుగు బ్లాకులను ఏర్పాటు చేసింది. ఏ బ్లాకులో ఏ పనులు చేపట్టాలి.. అందుకు అయ్యే ఖర్చులు పూర్తి అంశాలతో సమగ్ర ప్రణాళికన రూపొందించారు. ఇదే విషయమై ప్రభుత్వానికి అందించిన ప్రతిపాదనలో పేర్కొన్నారు. దీంతో ఆ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం మిగిలిన పనులకు కావాల్సిన నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించుకునేందుకు గిరిజన సంక్షేమ శాఖ అనుమతినిచ్చింది.స్థానిక గ్రామీణాభివృద్ధి అధికారుల సహాయంతో జిల్లా కలెక్టర్లు ఈ పనులకు కావాల్సిన నిధులను ఖర్చు చేయాలని స్పష్టం చేసింది. ఇందిర జల ప్రభ మార్గదర్శకాలకు లోబడే పనులు చేపట్టాలని స్పష్టం చేసింది.

12 మంది సిఎం అభ్యర్థులు ఉండటం మా ఘనత : కాంగ్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో 12 మంది సిఎం అభ్యర్థులు ఉంటే మంత్రి హరీశ్‌రావుకు ఉన్న అభ్యంతరాలు ఏమిటని టిపిసిసి అధికార ప్రతినిధి జి.నిరంజన్ అన్నారు. నాయకత్వలేమితో టిఆర్‌ఎస్‌లో కెసిఆర్ తప్ప మరొకరికి సిఎం యోగ్యత లేదేమోనని, దశాబ్దాల చరిత్ర గల కాంగ్రెస్‌లో మాత్రం సిఎం యోగ్యత ఉన్న నేతలు చాలా మందే ఉన్నారని, ఇది కాంగ్రెస్ పార్టీకి గర్వకారణమని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం అభ్యర్థులు లేకుండా నియంతృత్వ రాచరిక టిఆర్‌ఎస్‌లో సాధ్యమేమోకాని, ప్రజాస్వామ్య కాంగ్రెస్ పార్టీలో అది సహజసిద్ధమన్నారు. మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వ్యవహారాలపై దృష్టి పెట్టడం కంటే ముందు ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరిస్తే బాగుంటుందని ఆయన హితవుపలికారు.

అంతన పొంతన లేదు

భూ రికార్డుల సమీక్షలో అధికారులపై సిఎం ఆగ్రహం



మన తెలంగాణ/హైదరాబాద్ : 'భూ రికార్డులు బాగుంటే సిఎంకు విలువ ఉంటుంది. గందరగోళంగా, అరాచకంగా ఉంటే ఏం విలువ ఉంటది. ఈ గొప్పతనానికి మళ్లీ సిఎంగా నేను గెలవాలా' అని సిఎం కెసిఆర్ ఉద్వేగంతో వ్యాఖ్యానించడంతో అధికారులు కంగుతిన్నారు. ప్రజలకు రికార్డులు సరిగా లేకపోతే ఏమిటది, అంతన పొంతన లేని రికార్డులున్నాయి, ఎందుకయ్యా మీ ఐఎఎస్‌లు అంటూ ఉన్నతాధికారుల ముందు సిఎం నిట్టూర్చినట్లు సమాచారం. ప్రగతి భవన్‌లో సోమవారం భూ రికార్డుల ప్రక్షాళనకు అనుసరించాల్సిన వ్యూహం ఖరారుపై సిఎం కెసిఆర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ ఐఎఎస్ అధికారులు పాల్గొన్న విషయం తెలిసిందే. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రాష్ట్రంలో అసైన్డ భూముల లెక్కలు లేవు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టిఎస్ఐఐసి) భూముల వివరాలు లేవు. ఏం చేయ్యాలని సిఎం ప్రశ్నించారు. రెవెన్యూ రికార్డులలో డెడ్ ఖాతాలు, డబుల్ ఖాతాలు, ఆబ్సెంట్ ఖాతాలు ఏమిటని ప్రశ్నించారు. ఒక భూమిపై రిజిస్ట్రేషన్ జరిగాక యజమాని పేరు మీదికి మారుతుంది. మళ్ళీ అనుభవదారుడు (ఎంజాయర్) అనే కాలమ్ పహణీలో ఎందుకు ఉండాలని అడిగారు. పట్టాదారుడి చేతిలో భూమి ఉన్న తరువాత ఈ అనుభవదారుడు పదం ఏమిటని అడగడంతో అధికారులు ఏం చెప్పలేకపోయారు. టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్ పుస్తకం నమూనాను అధికారులు చూపించగా, భద్రతా ప్రమాణాలు బాగున్నాయని అన్నారు. కొంచెం పెద్దగా ఉందని, తగ్గించాలన్నారు. తహశీల్దార్లకు పౌర సరఫరాల విధులు ఎందుకు ఉండాలి, పంచనామా, ప్రొటోకాల్, ధ్రువీకరణ పత్రాలు వంటి సవాలక్ష పనులతో సతమతమవుతుండగా పౌర సరఫరాల విధులు కూడా ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈనెల 15వ తేదీ తరువాత మళ్లీ సమావేశం నిర్వహించుకుని ఒక నిర్ణయం తీసుకుందామని సిఎం చెప్పారు.

వారం రోజులలో నివేదిక ఇవ్వాలి

పహణీలో అనుభవదారుడు కాలమ్ తొలగింపు, తహశీల్దార్ల కు అదనపు బాధ్యతల తొలగింపుపై వారం రోజు లలో నివేదిక అందచేయాలని సిఎం ఆదేశించా రు. రెవెన్యూ చట్టంలో సవరణలు, భూ సమగ్ర సర్వే తదితర అంశాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.రఘునందన్ రావు అధ్యక్షతన కమిటీ నియ మించారు. ఈ కమిటీలో ఖమ్మం, సిద్దిపేట జిల్లా ల కలెక్టర్లు సభ్యులుగా ఉన్నారు.

కమ్యూనిస్టు దేశాల విధానానికి సిఎం సానుకూలత

కమ్యూనిస్టు దేశాలు అనుసరిస్తు న్న భూ రికార్డుల విధానం పట్ల సిఎం కెసిఆర్ సానుకూలంగా ఉన్నారు. గతంలో కమ్యూనిస్టు దేశంగా ఉన్న పోలెండ్‌లో కర్టెన్ ప్రిన్సిపుల్ విధానం అమలుపరుస్తుండగా ఆస్ట్రేలియా, అమెరికా లాంటి దేశాలలో మిర్రర్ ప్రిన్సిపల్ విధానం అమలవుతున్నది. కర్టెన్ ప్రిన్సిపుల్ విధానం అనగా రికార్డులతో సంబంధం లేకుండా భూమి ఎవరి ఆధీనంలో ఉంటే వారి సొంతం అవుతుంది. మిర్రర్ విధానం అనగా పాత రికార్డుల ప్రకారం ఎవరి నుంచి సంక్రమించింది తెలియచేస్తారు. ప్రస్తుతం తెలంగాణతో పాటు భారత దేశంలో మిర్రర్ విధానం అమలవుతోంది. పాత రికార్డులతో సంబంధం లేకుండా తాజా రికార్డు ప్రకారం సదరు వ్యక్తి పేరు మీదే పట్టాదార్ పాస్ పుస్తకం పంపిణీ చేయాలని సిఎం సూచించారు. ఎవరి నుంచి సంక్రమించింది అనే వివరాలు లేకుండా పాస్ పుస్తకం పంపిణీ చేస్తే సమస్యలు వస్తాయని, చట్టం అనుమతించదని అధికారులు చెప్పగా, అవసరమైతే చట్ట సవరణ చేద్దామని సిఎం అన్నారు.

భూ రికార్డుల ప్రక్షాళనకు ముందు వర్క్‌షాప్ : సిపిఐ డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్ : భూ రికార్డుల ప్రక్షాళనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు ముందు రాష్ట్రస్థాయిలో రెవెన్యూ నిపుణులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలతో వర్క్‌షాపు ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వవైఖరిని వివరించడంతో పాటు, అందరి అభిప్రాయాలు తీసుకొని, ఆచరణాత్మకంగా అమలు చేయడానికి కార్యాచరణను రూపొందించాలని కోరారు. అనంతరం జిల్లా, మండల స్థాయిలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. భూముల వివాదాలు కోర్టుల్లో పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండడం వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతున్నదని, ఈ నేపథ్యంలో భూ రికార్డుల ప్రక్షాళన అత్యవసరం. గతంలో అనేక మార్లు భూ రికార్డుల గురించి చెప్పినప్పటికీ ఆచరణ రూపం దాల్చలేదన్నారు. తాజాగా గ్రామ గ్రామాన సర్వే చేసి భూ రికార్డులు సరి చేస్తామన్న సిఎం కెసిఆర్ ప్రకటనను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆయన కోరారు. భూముల సర్వే చేసి రికార్డులు సరి చేయడానికి బాధ్యతలను మూడు గ్రామాలకు ఒక రెవెన్యూ అధికారికి అప్పగించనున్నట్లు సిఎం ప్రకటన చేశారని, ఒక్క అధికారితో అది సాధ్యం కాదని, రెవెన్యూ అధికారితో పాటు వ్యవసాయ, పంచాయతీరాజ్ అధికారిని కూడా ఇందులో నిమగ్నం చేయాలని ఆయన సూచించారు. పట్టా, ప్రభుత్వ భూములు (శిఖం, ఇనాం, పోరంబోకు, బంచరాయి, సీలింగు భూములు) వివాదాస్పద భూములున్నాయని, గ్రామ సభలో ఈ భూమి వర్గీకరణను దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

పొన్నం దీక్ష భగ్నం



మన తెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి : మెడికల్ కళాశాల సాధన కోసం గత మూడు రోజులుగా మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ చేస్తున్న ఆమరణ దీక్షను పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో దీక్షా శిబిరం వద్దకు చేరుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని స్థానిక ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించారు. సోమవారం పొన్నం ప్రభాకర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తోందని, దీక్ష విరమించని పక్షంలో మూత్ర పిండాలు, గుండెపై ప్రభావం చూపే అవకాశం ఉందని జిల్లా అధికార యంత్రాంగానికి నివేదిక సమర్పించారు. దీంతో సోమవారం అర్థరాత్రి నుండే పోలీసులు ఆయన అరెస్ట్‌కు ప్రణాళిక రూపకల్పన చేశారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో దీక్షా శిబిరాన్ని చుట్టుముట్టిన సుమారు 500 మంది పోలీసులు ప్రభాకర్‌ను తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంత సేపు తోపులాట జరిగింది. ఈ దశలో బలవంతంగా ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆయనను ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. అయితే వైద్య కళాశాల ఏర్పాటుపై ఒక ప్రకటన వచ్చేంతవరకు దీక్ష విరమించేది లేదంటూ వైద్య సేవలను ఆయన నిరాకరించారు. ఈ దశలో పోలీసులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కటకం మృత్యుంజయంతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి సరిగాలేని కారణంగా వైద్య సేవలు పొందాల్సిందిగా ప్రభాకర్‌ను ఒప్పించాలని కోరారు. ఆసుపత్రిలో వైద్యులు అందించిన సెలైన్ మినహా ఆహారాన్ని మాత్రం ఆయన తీసుకోలేదు. ఇదిలా ఉండగా పొన్నం ప్రభాకర్ బలవంతపు అరెస్ట్‌ను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో అనేక మండలాలల్లో కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని చోట్ల పార్టీ కార్యకర్తలు ముఖ్యమంత్రి, హోం శాఖ మంత్రుల దిష్టి బొమ్మలను దహనం చేశారు. కరీంనగర్‌లో ఆందోళన చేస్తున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్ర రాజశేఖర్‌తో పాటు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంభీరావుపేట, చందుర్తి, హుజూరాబాద్, వీణవంక, జమ్మికుంట, రామడుగు, మానకొండూర్, ఎల్లారెడ్డిపేట, సుల్తానాబాద్, ఇల్లందకుంట తదితర మండలాలలో కాంగ్రెస్ ప్రదర్శనలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఐసియులో ఉన్న ప్రభాకర్‌ను మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ శాసన సభ్యుడు సంపత్ కుమార్, టిజెఎసి ఛైర్మన్ కొదండరాం, కరీంనగర్ జడ్పి మాజీ అధ్యక్షుడు లక్ష్మ ణ్ కుమార్ కలిసి ఆయనను పరామర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి వైద్యకళాశాల ఏర్పాటుకు ఎన్ఓసి జారీ చేయాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజావసరాల విషయంలో ప్రభుత్వం భేషజాలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. వైద్యశాలలో తనకు బలవంతంగా వైద్య చికిత్స అందించినా తాను చేపట్టిన పోరాటం ఆగదని, దానిని వివిధ రూపాలలో కొనసాగిస్తానని చెప్పారు.

'నేరెళ్ల'పై ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు



మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణాలోని నేరెళ్లలో జరిగిన ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు, ఆ పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇంఛార్జీ కుంతియాతో కలసి మంగళవారం ఢిల్లీలో జాతీయ మానవహక్కుల కమిషన్‌కి, ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేసారు. జాతీయ మానవహక్కుల కమిషన్ నేరెళ్ల ఘటనపై స్వతంత్రంగా విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి డా.దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ...... జులై 2న సిరిసిల్ల రాజన్న జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో బుద్ధయ్య అనే గిరిజన యువకుడి మీదుగా ఇసుక మాఫియా లారీతో తొక్కించి చంపేశారని, పరిమితిని మించిన లోడుతో, స్పీడుతో లారీలు నడిపి అనేక మంది ప్రాణాలు తీస్తున్నారని జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు స్థానికుల ఫిర్యాదులను అసలేమాత్రం పట్టించుకోలేదని, బుద్ధయ్య చనిపోయాక నేరెళ్ల, జిల్లెల్ల, రామచంద్రాపురం గ్రామాల ప్రజల్లో ఆగ్రవేశాలు పెల్లుబికి, లారీలను ఆపి 3 లారీలకు నిప్పు పెట్టారని తమ ఫిర్యాదులో పేర్కొన్నామని తెలిపారు. ఈ వ్యవహారంలో పోలీసులు 8 మంది అమాయకులను అరెస్టు చేశారని, వారు పెంటా బానయ్య, గంధం గోపాల్, చెప్యాల బాలరాజు, కోలా హరీష్, పసుల ఈశ్వర్ కుమార్, చికోటి శ్రీనివాస్, కోలుకంటి గణేష్, బత్తుల మహేష్ (వీరిలో 5గురు దళితులు)లు ఉన్నారని ఎన్.హెచ్.ఆర్‌సికి ఫిర్యాదులో వివరించామన్నారు. వీరిని ఎస్‌పి విశ్వజీత్ నేతృత్వంలో పోలీసులు చిత్రహింసలు పెట్టడమే కాకుండా.... థర్డ్ డిగ్రీ ప్రయోగించి, మర్మాంగాలపై వేడి నీటిని పోసి, ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చారన్న విషయాన్ని మానవ హక్కుల సంఘానికి వివరించామన్నారు. 4 రోజుల తర్వాత మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, జైల్లో బాధితుల ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారని, పోలీసుల గురించి నోరెత్తవద్దని అధికారులు హెచ్చరించారని జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్మన్ హెచ్.ఎల్.దత్ కి తెలిపామన్నారు. బాధితులపై డ్రగ్స్ కేసులు నమోదు చేసి బయటకురాకుండా చేస్తామని బెదిరించారని, బుద్ధయ్య మరణానికి కారణమైనవారిపై కేసులు పెట్టలేదు సరికదా ఎలాంటి విచారణ జరపలేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. 8మందిని చిత్రహింసలు పెట్టిన ఎస్‌పి సహా పోలీసు అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కి ఫిర్యాదు చేసామన్నారు. తమ ఫిర్యాదు పై స్పందించిన జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్మన్ హెచ్.ఎల్.దత్ త్వరలో నేరెళ్లకు జాతీయ మానవ హక్కుల సంఘం బృందాన్ని పంపుతామని హామీ ఇచ్చారని తెలంగాణ కాంగ్రెస్ నేతలు మీడియాకు వివరించారు. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ ఛైర్మన్ రామ్ శంకర్ కథారియా అందుబాటులో లేకపోవడంతో కమిషన్ సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు మరోసారి వచ్చి ఛైర్మన్‌ని కలవాలని నిర్ణయించారు. జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్మన్‌ని కలసిన వారిలో రాజ్యసభ ఎంపిలు రేణుకా చౌదరి, ఎం.ఎ.ఖాన్, రాపోలు ఆనందభాస్కర్, మాజీ ఎంపి విహెచ్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మ య్యలు ఉన్నారు.

నేరెళ్ల ఘటన, జిఎస్‌టిపై 10న ఎగ్జిబిషన్

టిడిపి నిర్ణయం

మన తెలంగాణ /హైదరాబాద్ : నేరెళ్ల సంఘటన, జిఎస్‌టిపై సిఎం కెసిఆర్ ద్వంద్వ వైఖరిపై ఈ నెల 10న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని టిడిపి నిర్ణయించింది. ప్రజా సంఘాలతో కలిసి రాజకీయాలకు అతీతంగా దీనిని ఏర్పాటు చేయనుంది. ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, ఇ. పెద్దిరెడ్డి, అరవింద్ కుమార్ గౌడ్, అరికెల నర్సారెడ్డి, సీతక్క, వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేరెళ్ల ఘటన, జిఎస్‌టిపై ప్రభుత్వ వైఖరి, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తదితర అంశాలపై వారు చర్చించారు. సమావేశంలో నిర్ణయాల అనంతరం పార్టీ నేతలు అరవింద్ కుమార్ గౌడ్, సీతక్క, అరికెల నర్సారెడ్డి, అజ్మీరా రాజు నాయక్‌లు మీడియా సమావేశంలో వెల్లడించారు. నేరెళ్ల ఘటనపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, మీడియాలో వస్తున్న కథనాలతో కెటిఆర్ మొక్కుబడిగా నేరెళ్లకు వెళ్లారని అరవింద్ కుమార్ గౌడ్ విమర్శించారు. నేరెళ్ల ప్రాంతంలో ఇసుకా సురులు ఇంకెవరో కాదు.. కేటిఆర్ బంధువులేనని ఆరోపించారు. ఒక్క నెంబర్‌తో రెండు నుంచి ఐదు లారీల వరకు నడుస్తున్నాయని ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు తమకు లారీల ఫోటోలను కూడా పంపించారని చెప్పారు. పేదలకు చెందాల్సిన వనరులను అధికార పార్టీ పెద్దల బంధువులకు దోచి పెడుతున్నారన్నారు. అరికెల నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న రైతంగ సమస్యలపై మరింతగా ఉద్యమించనున్నామన్నారు. పంట నష్టాలపై అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుని రైతులకు పరిహారం అందజేయాలన్నారు. పొట్టచేత బట్టుకుని గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కార్మికులను స్వరాష్టానికి తీసుకు వచ్చే దిక్కులేకుండా పోయిందన్నారు. టిడిపి ఒక కమిటిని వేసి గల్ఫ్ దేశాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించామని నర్సారెడ్డి వెల్లడించారు. మాజీ ఎంఎల్‌ఎ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీతక్క మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా తప్పని సరిగా 9 రకాల సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న పౌరసరఫరాల శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఆగస్ట్ 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు.

జులైలో 4 జిల్లాల్లో అధిక వర్షపాతం


9 జిల్లాల్లో తక్కువ వర్షపాతం

మన తెలంగాణ/హైదరాబాద్ : జులై మాసంలో సాధారణం కన్నా అధిక వర్షపాతం నాలుగు జిల్లాల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, గద్వాల్ జోగులాంబ జిల్లాల్లో నమోదైంది. తొమ్మిది జిల్లాలైన ఆదిలాబాద్, జయశంకర్, మెదక్, పెద్దపల్లి, కొమురం భీం, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో తక్కువ వర్షం కురిసింది. మిగిలిన 18 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భూగర్భజలాల నీటి మట్టం నమోదు చేసే పిజమీటర్‌లలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వద్ద అత్యధికంగా నీటి మట్టం ఉన్నట్లు తేలింది. భూమట్టానికి క్రింద (బిలో గ్రౌండ్ లెవల్) నీటి మట్టాల వారిగా చూస్తే 20 మీటర్ల లోతులో నీరు ఉన్న మండలాల్లో సంగారెడ్డి (9 మండలాలు), మహబూబ్‌నగర్ (8), రంగారెడ్డి (7), సిద్దిపేట్ (7), 10 నుండి 20 మీటర్ల లోతులో 229, 5 నుంచి 10 మీటర్ల లోతులో 178 మండలాలు, 25 మీటర్ల లోతులో 92 మండలాలున్నాయి. 2 మీటర్ల వరకు 25 మండలాలున్నాయి. జులై మాసంలో కురిసిన వర్షం, భూగర్భ జలాల స్థాయిని బట్టి గత సంవత్సరం జులైతో పోల్చి చూస్తే 25 జిల్లాల్లో నీటి మట్టం పెరగగా, ఆరు జిల్లాల్లో తగ్గింది. సరాసరిగా గతంలో నీటి మట్టం 13.40 మీటర్లుగా ఉండగా అది 10.57 మీటర్లకు తగ్గింది. నీటి మట్టాల స్థాయి 0.24 మీటర్ల నుండి 7.83 మీటర్లకు పెరగగా, మెదక్ జిల్లాలో అత్యధికంగా పెరిగినట్టు గుర్తించారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో జులై మాసం వరకు గణిస్తే 10 శాతం వర్షపాతం తక్కువగా కురిసింది. అయినప్పటికీ స్వల్పంగా 1.78 మీటర్ల నీటి మట్టం పెరుగుదల కనిపించింది.

ద్వితీయార్థంలోనూ సాధారణ వర్షపాతమే...

న్యూఢిల్లీ: వర్షాకాలం రెండో అర్ధభాగంలో వానలు సాధారణంగానే పడనున్నాయని వాతావరణ శాఖ మంగళవారం వెల్లడించింది. దేశంలో వానాకాలం ఇంకా రెండే నెలలు (ఆగస్ట్, సెప్టెంబర్) ఉంది. దీర్ఘకాలిక సగటు(ఎల్‌పిఎ) ప్రకారం 100 శాతం వానలు పడే అవకాశం ఉంది. 94–104 శాతం మధ్య పడే వర్షపాతాన్ని 'సాధారణ' వర్షపాతంగా భావిస్తుంటారు. ఆగస్టులో 99 శాతం ఉండనుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా జూన్ 1 నుంచి ఆగస్ట్ 7 వరకు నమోదైన వర్షపాతం మైనస్ మూడు శాతంగా ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇప్పటికీ దేశంలోని అనేక ప్రాంతాలలో కరువు వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాదిన. మరోవైపు గుజరాత్, రాజస్థాన్, ఈశాన్య రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో వరదలు ముంచెత్తుతున్నాయి. వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ కె.జె. రమేశ్ ఇదివరకు చెప్పిన 98 శాతం వర్షపాతం ఉండనుందన్నదాన్ని సవరించి తగ్గించారు. పసిఫిక్ జలాల వేడితో సంబంధం ఉన్న ఎల్‌నినోను లెక్కలోకి తీసుకున్న ఆయన ఇదివరలో ఊహించిన దానికన్నా వర్షపాతంతక్కువగా ఉండగలదంటున్నారు. హిందూ మహాసముద్రం డైపోల్(ఐవోడి) పరిస్థితులు కూడా తటస్థంగా ఉన్నాయని, దీనివల్ల మిగిలిన రెండు నెలల్లో వానలు పడే సూచనలు బాగానే ఉన్నాయని వాతావరణ శాఖ భావిస్తోంది. హిందూ మహాసముద్రం డైపోల్ అనేది హిందూ మహాసముద్రం వేడిమితో ముడిపడి ఉంటుంది.

“ప్రయత్నం చేసి ఓడిపో. కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోవద్దు.
–రవీంద్రనాథ్ ఠాగూర్”



చెరిపితే చెరిగిపోదు

సంపాదకీయం

భారతదేశ చరిత్రను తిరగరాయటం ద్వారా మహాత్మాగాంధీ, జవహర్ లాల్‌నెహ్రూ వంటి మహానాయకులను ప్రజల స్మృతిపథం నుంచి తొలగించగలమని బిజెపి, దాని సిద్ధాంతకర్తలు భావిస్తే వారు పప్పులో కాలేసినట్లే. అయితే అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ బిజెపి అటువంటి ప్రయత్నం చేస్తూనే ఉంది. గాంధి, నెహ్రూ భావజాలాన్ని తిరస్కరించనిదే తమ ఛాందస హిందూత్వ భావజాలాన్ని విజయవంతంగా విద్యార్థుల బుర్రల్లోకి ఎక్కించలేమన్నది వారి భయం. స్వాతంత్ర్య పోరాట కాలంలోనే ఆర్‌ఎస్‌ఎస్, అనంతరం జనసంఘ్ ఆవిర్భవించినప్పటికీ ఆ ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధులు వాటికి లేరు. అందువల్లనే నెహ్రూకు వ్యతిరేకంగా సర్దార్ వల్లభ్‌భాయి పటేల్‌ను ఆకాశానికెత్తుతున్నారు. రాజకీయ అవసరాలరీత్యా బాబాసాహెబ్ అంబేద్కర్ భజన చేస్తున్నారు. కాని రాజ్యాంగ నిర్మాతగా తప్ప దళిత జనోద్ధారకుడిగా కీర్తించరు. ఆయన బౌద్ధం లోకి ఎందుకు మారారో అసలే చెప్పరు. హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ వ్యవస్థాపకనాయకులైన వి.డి.సావర్కార్, కె.బి.హెగ్డేవార్, శ్యాం ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, నానాజీ దేశ్‌ముఖ్‌లను మహానాయకులుగా చిత్రిస్తున్నారు.

ఇది ఆరోపణ కాదు –పచ్చినిజం. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి వేడుకల కమిటీ ఉత్తరప్రదేశ్‌లో స్కూలు విద్యార్థులకు నిర్వహిస్తున్న క్విజ్ పోటీ నిమిత్తం ప్రచురించిన 70 పేజీల పుస్తకమే ఇందుకు నిదర్శనం. క్విజ్ ప్రశ్నలకు ఈ పుస్తకమే ప్రాతిపదిక. భారతీయ జాతీయతత్వం, భారతీయ సంస్కృతి గొప్పదనంతోపాటు ఇప్పటి వరకు అలక్ష్యం చేయబడిన అంశాలను, జాతీయోద్యమానికి దోహదపడిన శక్తులను, స్థూలంగా చరిత్రను విద్యార్థులకు బోధించటం ధ్యేయంగా బిజెపి నాయకులు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోనే కాదు, ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా పాఠ్యపుస్తకాల్లో అనేక అసంబద్ధ, తిరోగమన మార్పులు చేశారు.

ఆధునిక, మధ్యయుగాలనుంచి ఏ ఒక్క ముస్లింను ప్రస్తావించని క్విజ్ పుస్తకంలో భారత జాతీయత ప్రస్తావనలో కవి ఇక్బాల్‌ను ప్రస్తావించారు. దేశ విభజన తదుపరి అతను పాకిస్థాన్‌లో స్థిరపడినందుకు మితవాదులు ఇప్పటివరకు నిందిస్తుండేవారు. ముస్లిం చరిత్రకు సంబంధించిన ప్రస్తావనల్లో ఒక హిందూ రాజు ఒక ముస్లింరాజును అంతం చేసిన సందర్భం, లేదా ఒక ముస్లిం రాజు హిందూరాజు ను కిరాతకంగా చంపిన సందర్భం ఉదహరించారు. ఏ ముస్లిం దండయాత్రకుణ్ణి మహారాజా సుచెల్‌దేవ్ క్యారెట్, కందలాగా ముక్కలు ముక్కలు చేశాడు? అనే ప్రశ్న ఇందుకు ఉదాహరణ.


ప్రాచీనకాల చరిత్రలో ‘‘వర్ణాశ్రమధర్మ, పురుషార్థ, పదహారు సంస్కారాలు అందరికీ ఆదర్శం’’ అంటూ కీర్తించారు. భారతీయ సంస్కృతిని విదేశీ దండ యాత్రికులు కల్మషం చేశారనే ఆరోపణతో సంతృప్తి చెందక, దూరదర్శన్, కేబుల్ టివి వగైరావల్ల ఇతర సంస్కృతుల జాఢ్యాలు దేశంలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. లంచగొండితనం, అసమానత అశోకుడు, విక్రమాదిత్య కాలంలో లేవని, విదేశీ దండయాత్రికులతో ఆ జబ్బులు భారత దేశంలోకి ప్రవేశించాయని పేర్కొన్నారు. భారత వ్యోమగాములు చంద్రునిపైకి వెళ్లి తిరిగి వచ్చారని జ్ఞానబోధ చేశారు. ఇటువంటి వక్రీకరణలతో కూడిన చరిత్ర బోధనతో భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించగలరా?

నెహ్రూను విస్మరించటానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వారికి ప్రత్యేక కారణం ఉంది. నెహ్రూ జాతీయతత్వం, లౌకికవాదం, కాస్మోపాలిటనిజం(విశ్వమానవీయత) వీరి ఛాందసవాదానికి పూర్తి విరుద్ధం. స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ నేతగానే గాక తొలి ప్రధానిగా నవభారత నిర్మాణానికి బాటలు వేసిన క్రాంతదర్శి. నవ స్వతంత్ర దేశాలకు అలీనోద్యమమనే వేదికను నిర్మించిన ప్రముఖుల్లో ఒకరు. కొత్తరాష్ట్రపతి రామనాథ్ కోవింద్ తమ ప్రమాణస్వీకారానంతర తొలి ప్రసంగంలో ప్రస్తావించిన ప్రముఖుల జాబితాలో నెహ్రూపేరు లేకపోవటం యాదృచ్ఛికం కాదు. అందువల్ల ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి విధానాలపై రాజకీయరంగంలో పోరాటమొక్కటే చాలదు. ప్రగతిశీల మేధావులు శాస్త్రీయ ఆలోచనను పెంపొందించటమనే రాజ్యాంగ ఆదేశం ప్రకారం భావజాల రంగంలో పెద్దపోరాటం చేయటం అవసరం.

దేశంలో గ్రామాలెన్ని?

చూపు

వేర్వేరు ప్రభుత్వ శాఖల సమాచారం ప్రకారం దేశంలో 6,00,000 నుంచి 10 లక్షల దాకా గ్రామాలు ఉన్నాయి. వాటి సంఖ్య గాని, నిర్వచనంగాని ఆ సమాచారంలో ఒకేలా లేవు. ఇందువల్ల గ్రామాల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సవాలుగా మారింది.



2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ఉన్న మొత్తం గ్రామాలు 6,49,481. అందులోని 5,93,615 గ్రామాల్లో జనం నివసిస్తున్నారు. దీనినే అధికారిక సమాచారంగా భావిస్తున్నారు. మహాత్మా గాంధీ ఉపాధి గ్యారంటీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) లెక్కలప్రకారం మాత్రం గ్రామాల సంఖ్య 10లక్షలు. మంచినీరు, పారిశుద్ధ్యం మంత్రిత్వశాఖ తన ‘సమగ్ర యాజమాన్య సమాచార వ్యవస్థ(ఐఎంఎస్)’ నివేదికలో మొత్తం గ్రామాల సంఖ్య 6,08,662అని పేర్కొంది. ప్రభుత్వ శాఖల అంకెలు కలవకపోవడాన్ని ఈ మంత్రిత్వశాఖ ప్రస్తావించింది. ఆ శాఖ తన స్వచ్ఛ భారత అభియాన్ (గ్రామీణ్) నివేదికలో మొత్తం గ్రామాల సంఖ్యను 6,05,805గా ప్రకటించింది.

శాఖల మధ్య సమన్వయ లోపం

సమన్వయ లోపంవల్ల మంత్రిత్వ శాఖలు వేటికవిగా ఈ సంఖ్యను రికార్డు చేశాయి. దేశంలో గ్రామాల సంఖ్యపై ఒకే విధంగా అధికారిక సమాచారం లేకపోవడంవల్ల ప్రణాళిక రూపకల్పనలో, ఆర్థిక సహాయం అందించడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురౌతాయి. మౌలికంగా గ్రామమే సాధారణ పరిపాలనకు, ఆర్థిక పాలనకు ప్రాతిపదిక. వలస పాలన నాటినుంచి అది అలాగే కొనసాగుతోంది. గ్రామాలను నాడు హోల్డింగ్స్ అని పిలిచేవారు. వాటి నుంచి పన్నుల వసూళ్లకే జిల్లా కలెక్టర్‌ను నియమించే అనవాయితీ వచ్చింది. ఆ వారసత్వం మూలంగా అత్యంత పాత ప్రభుత్వ శాఖ అయిన రెవెన్యూ శాఖ గ్రామానికి ఆ గుర్తింపును, పేరును ఇచ్చింది.

అయితే ఏదైనా ఒక మంత్రిత్వ శాఖ కొత్తగా గ్రామాలను గుర్తించినా, వాటిని రెవెన్యూ శాఖ జాబితాలో చేర్చడం జరగదు. అన్ని శాఖలకు ఉపయోగపడేలా రెవెన్యూ గ్రామాలను పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ తరుణంలోనే కలుపుతారు. అందువల్లనే వెంటనే జాబితాకు ఎక్కని గ్రామాల సంఖ్య పెరిగిపోతోంది. గ్రామాల సమాచారానికి ఏకైక జాబితా ఉండాలి. ఎప్పటికప్పుడు గ్రామాల జాబితాలో చేర్పులు ఉండాలి. జనాభా లెక్కల సేకరణ అన్నది దేశంలో అత్యంత సమగ్ర సామాజిక, ఆర్థిక, ప్రజా వివరాల రికార్డు. గ్రామాలు, పట్టణాలు, తదితర భౌగోళిక అంశాల నిర్ణయానికి దానినే ఎందుకు ప్రాతిపదికగా చేయకూడదు?

జనాభా లెక్కలు ప్రాతిపదిక కాదు

జనాభా లెక్కలలో రెవెన్యూ గ్రామాలు తప్ప ఇతర గ్రామాల సమాచారం ఉంటుంది. జనం నివసిస్తున్న గ్రామాలు, నివసించని గ్రామాల సమాచారం కూడా అందులో లభిస్తుంది. జనాభా లెక్కల రికార్డుల ప్రకారం సుమారు 50,000 గ్రామాలలో జనావాసం లేదు. అడవులలో కూడ జనావాసం ఉంటుంది. అటవీ గ్రామాలుగా వాటి సమాచారాన్ని రాష్ట్రాల అటవీ శాఖలు భద్రపరుస్తాయి. జనాభా లెక్కల సేకరణ దృష్టికి రాని గ్రామాలు కూడా ఉన్నాయి. వాటిని సర్వే జరగని గ్రామాలుగా గుర్తిస్తారు. అన్ని అటవీ గ్రామాలు, సర్వే జరగని గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అటువంటి గ్రామాలలోని మెజారిటీ ప్రజలను గిరిజనులుగా పరిగణిస్తారు. అందువల్ల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందుతారు.

ప్రతి ఒక్క ప్రభుత్వ శాఖ జనాభా లెక్కల రికార్డుల ప్రకారం గ్రామాలను గుర్తించవు. ఉదాహరణకు అన్ని గ్రామీణ అభివృద్ధి పథకాలను గ్రామ పంచాయతీల స్థాయిలో అమలు చేస్తారు. జనాభా సంఖ్యను బట్టి గ్రామ పంచాయతీలో ఒకే గ్రామం లేదా సమీపంలోని గ్రామాల సముదాయం ఉండొచ్చు. నేడు దేశంలో 2,62,800 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆరోగ్యశాఖకు పాలనా కేంద్రం సబ్ సెంటర్. అది అత్యంత దిగువన ఉంటుంది. 5000 మంది జనాభాకు అది సేవలు అందిస్తుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖవారి ప్రతిష్ఠాత్మక పథకం ‘ సర్వ శిక్షా అభియాన్ ’ పాఠశాల ప్రాతిపదికగా పనిచేస్తుంది.

గ్రామంలో ఒకటి కంటె ఎక్కువగా స్కూళ్లు ఉండవచ్చు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అంగన్ వాడీ కేంద్రం స్థాయిలో పని చేస్తుంది. అది ప్రతి వెయ్యిమందికి ఒకటి చొప్పున ఉంటుంది. ఆ విధంగా పాఠశాల, అంగన్ వాడీ, సబ్ సెంటర్ వేర్వేరు సంఖ్యలలోని జనాభాకు సేవలు అందిస్తాయి.

గ్రామం నమూనా కావాలి

ఇందువల్ల అన్ని పథకాలకు ఒక గ్రామం నమూనాగా అంచనాలను ఖరారు చేయడం కష్టమౌతోంది. జిల్లా లేదా గ్రామ స్థాయిలో విద్య, ఆరోగ్యం, తదితర పథకాలకు అంచనాలు, నివేదికలు ఉమ్మడిగా అందించే అవకాశం మృగ్యమవుతోంది. ఒక పథకం గుర్తించిన గ్రామాన్ని మరో పథకం విస్మరించే పరిస్థితి ఉంది. దీనితో ప్రణాళికల రూపకల్పన జరిపి, బడ్జెట్ కేటాయింపులను చేయడం గ్రామ స్థాయిలో చాలా కష్టసాధ్యం అవుతోంది. దేశంలో గ్రామాల అభివృద్ధికి అతి సూక్ష్మ స్థాయి ప్రణాళికల రూపకల్పన అందుకే సాధ్యం కావడం లేదు.

2016లో గ్రామీణ మంత్రిత్వశాఖ జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కార్యక్రమం ‘దిశ’ అమలు చేయాలని నిర్ణయించింది. 28 కేంద్ర ప్రభుత్వ పథకాలను వివిధ పాలనా కేంద్రాల సమన్వయంతో అమలు చేయడంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం దాన్ని ఉద్దేశించారు. గ్రామాల సంఖ్యకు ఒకే జాబితా ప్రాతిపదికగా ఉంటే ఇటువంటి ప్రయాసలు తప్పి వృధా ఖర్చులకు అడ్డుకట్ట వేయవచ్చు. కొత్త కొత్త గ్రామాలు, పంచాయతీలను చేర్చుతూ ఎప్పటికప్పుడు జాబితాలను సరిదిద్దే ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

– రిచా వర్మ

వరకట్న బాధిత మహిళలకు తరిగిన చట్ట రక్షణ

498ఎ ను నీరుగార్చిన తీర్పులు



జయంతి నటరాజన్

వరకట్న వ్యతిరేక చట్టానికి అసలే కోరల్లేవు. 2017 జులై 27న రాజేశ్‌శర్మ అండ్ అదర్స్ x ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అండ్ ఆనర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆ చట్టాన్ని మరింతగా దెబ్బతీసింది. 1961లో చేసిన ఈ చట్టం అత్తవారిళ్లలో పేరాశపరులైన భర్తలు, అత్తమామలు గావిస్తున్న హత్యలు లేదా హింసనుంచి మహిళలను రక్షించేందుకు ఉద్దేశించింది. అటు తర్వాత మహిళా హక్కుల క్రియాశీల కార్యకర్తలు అదే పనిగా చేసిన విజ్ఞప్తులపై భారత శిక్షాస్మృతిలో సెక్షన్ 498ఎ చేర్చబడింది. అది వరకట్న హింసా నేరాన్ని గుర్తించదగిన, బెయిల్ ఇవ్వదగని నేరంగా పరిగణించింది. బహిరంగ వ్యవహారంలో అనగా పోలీసుల వద్దకు ఫిర్యాదులు తీసుకెళ్లటంలో, దీర్ఘకాలం తీసుకునే విచారణ క్రమాన్ని ఎదుర్కొనటంలో అధిగమించలేని అడ్డంకులు ఎదుర్కొంటున్న మహిళలకు అది అపారమైన ఉపశమనం కలుగజేసింది. సెక్షన్ 498ఎ ఒకవిధంగా కార్యస్థానంలో స్త్రీలకు సమానత ఇవ్వగోరింది. ఆ విధంగా స్త్రీలకు మరింత రక్షణ ఇచ్చింది. అయితే మహిళలకు సంబంధించిన అన్ని చట్టాలవలె దీనికి సంబంధించి కూడా పితృస్వామ్య ఆధిపత్య వాదనలు ముందుకు వచ్చాయి. 498ఎ కుటుంబ విలువలను నాశనం చేయాలని నిర్ణయించుకున్న భూతాల్లాంటి అసంతృప్త మహిళలు కొందర్ని సృష్టించిందని, వారు తమ దుష్ట ప్రయోజనాల కోసం భర్తల్ని, అత్తమామలను జైల్లో పెట్టిస్తున్నారనే అభిప్రాయం చర్చల్లో ఆధిక్యం కావటం మొదలైంది.

దీని పర్యవసానంగా, 498ఎను నీరుగార్చే తొలి ప్రయత్నం 2014లో సుప్రీంకోర్టు తీర్పునుంచి జరిగింది. 498ఎ కింద ఎవరినైనా అరెస్టు చేసేముందు నిర్ధారించుకోవలసిన 9 అంశాలను కోర్టు ఆ తీర్పులో ఆదేశించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు 498ఎ సెక్షన్‌ను దాదాపు నిరుపయోగం చేసింది, అది బాధితుల్ని ఆదుకోవటాన్ని దాదాపు దుర్లభం చేసింది. వరకట్న వేధింపు కేసులను సమీక్షించటానికై ప్రతిజిల్లాలో కుటుంబ సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ తీర్పు ఆదేశించింది. ఈ కమిటీ సభ్యులు సంఘ సేవకులు కావచ్చు లేదా ‘‘ఈ విషయంలో ఆసక్తి ఉన్న ఎవరైనా’’ కావచ్చు. వారికి గౌరవవేతనం కూడా చెల్లించాలి. పోలీసులు ఎవరినైనా అరెస్టు చేసేముందు ఈ కమిటీ సిఫారసులను పరిశీలించాల్సి ఉంటుంది. మన పురుషాధిపత్య జిల్లాల్లో ఆ కమిటీలు ఎలా పనిచేస్తాయో ఊహించటం కష్టం కాదు. సుప్రీం కోర్టు, నిందితులకు ఇతర రూపాల్లో ఇచ్చిన ఉపశమనలకు అదనంగా, వారు కోర్టు ఎదుట హాజరు కావాల్సిన అవసరాన్ని కూడా రద్దు చేసింది.

ఈ తీర్పులో, బాధితురాల్ని విస్మరించటం విచారకరం. ఆంక్షల విధింపు కారణంగా, నిజంగా బాధలకు గురవుతున్న వేలాదిమంది మహిళలు న్యాయం పొందలేరు. బాధితరాండ్రయిన మహిళలు మరణిస్తేనే వారు బాధితులు అయ్యేటట్లు కనిపిస్తున్నది. బ్రతికి ఉండి న్యాయం పొందటం దుర్లభం.

మహిళల సమస్యలకు సంబంధించిన చర్చల్లో, అతి సూక్ష్మంగానైనా ప్రగతిశీల భావాలు కలిగివున్న ఏ ఉద్యమమైనా మహిళా సాధికారతను కోరితే అది వెనువెంటనే అతితీవ్రమైన వివాదాంశం అవుతున్నదనటానికి సెక్షన్ 498ఎను నీరుగారుస్తున్న 2014 మరియు 2017 సుప్రీంకోర్టు తీర్పులు ఉదాహరణలు. పార్లమెంటులో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణను, స్వాతంత్ర్య తదుపరి 70ఏళ్లకు కూడా పార్లమెంటు ఆమోదించలేకున్నది. భారతదేశ చరిత్రలో, ఆ మాటకొస్తే, ప్రపంచంలోనే ఇంత తీవ్రంగా ప్రతిఘటించబడుతున్న లేదా ఇంత దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న మరో శాసనం ఏదీ కనిపించదు. అదేవిధంగా, అత్తవారిళ్లలో మహిళలకు రక్షణ కల్పించేందుకు ఆమోదించబడినటువంటి సెక్షన్ 498ఎ ప్రభావాన్ని – అత్తవారిళ్లలో వరకట్న మరణాలను, మహిళల పట్ల క్రూరత్వాన్ని నిరోధించటంలో దాని సమర్థతను పరీక్షించటానికై – మదింపు చేసి ఉండాల్సింది. అయితే ఊహించదగినట్లే జడ్జీల దృష్టి, సమాజంలోని పెద్ద విభాగం దృష్టి ‘‘మోసకారులైన’’ మహిళలు ఆ సెక్షన్‌ను ‘‘దుర్వినియోగం’’ చేస్తున్నారనే ఆరోపణపైనే కేంద్రీకరించబడింది. మహిళలపట్ల సానుభూతితోనే – ఈ కేసులో 498ఎ కింద ‘‘తప్పుగా’’ అరెస్టు చేయబడిన తల్లులు, ఆడబిడ్డ–తీర్పు వెలువరించారు. సెక్షన్ 498ఎను రక్షా కవచంగా ఉపయోగించుకోవలసిన స్త్రీలు దాన్ని దురదృష్టవంతులైన అత్తమామలకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగిస్తున్నారని జడ్జీలు వ్యాఖ్యానించారు. ‘‘అటువంటి ఫిర్యాదులు చాలామేరకు క్షణిక ఉద్రేకంలో, అల్పమైన సమస్యలపై దాఖలు చేసిన వాస్తవాన్ని కోర్టు ఇంతకుముందే గమనించింది’’. ఆ విధంగా అవి ‘‘నిందితులను వేధించేందుకు’’ దారితీస్తున్నాయి అని కూడా పేర్కొన్నారు. అది వారి సొంత ఊహ. ఎటువంటి పరిశోధన దానికి ప్రాతిపదికగా లేదు. లేదా జడ్జీలు ఎటువంటి పరిశోధనను ప్రస్తావించలేదు.

> చట్టం దుర్వినియోగం గూర్చి ఆరోపితమైన, ఊహాజనితమైన, కొన్ని సందర్భాల్లో నిజమైన కేసులు సైతం ఉన్నప్పటికీ, అది నిజమైన బాధితులైన అసంఖ్యాక మహిళలకు హానికరం కాకూడదు. చట్టం, ప్రజాస్వామ్యం ధ్యేయం బాధలనుభవిస్తున్న మన మహిళలకు రక్షణ కల్పించటమేగాని, నిందితులకు రక్షణలు కల్పిస్తూ పోవటం కాదని గుర్తుంచుకోవాల్సిన సమయమిది.

జడ్జీలు ఉదహరించిన గణాంకాలు వాస్తవానికి పరస్పర విరుద్ధ నిర్ధారణకు దారితీస్తాయి. జస్టిస్ సి.కె.ప్రసాద్ అంతకుక్రితం వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని వారు పేర్కొన్నారు. దాని ప్రకారం, 2012లో సెక్షన్ 498ఎ కింద 2లక్షల అరెస్టులు జరిగాయి, వారిలో 47,951 మంది మహిళలున్నారు. 93.6 శాతం కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలైనప్పటికీ శిక్ష విధించిన రేటు 14.4శాతమే. దీని ఆధారంగా జడ్జీలు, ఫిర్యాదులు అల్పమైనవి, ‘స్వల్పప్రాధాన్యం గలవి’ అని నిర్ధారించారు. అయితే వాస్తవం ఏమంటే, 93.6 శాతం కేసుల్లో, మహిళల పట్ల ఏ మాత్రం సానుభూతిలేని పోలీసులు, ఫిర్యాదులు ఛార్జిషీటు దాఖలుకు తగినవని భావించారు. మరో రకంగా చెప్పాలంటే, ఫిర్యాదులు పోలీసు స్క్రూటినీ గట్టెక్కాయి. కాని శిక్షల విధింపు 14.4 శాతం మాత్రమే ఉండటమనేది బాధాకరమైన న్యాయక్రమంపై అభిశంసన. ఈ క్రమం ఎంతో సమయం తీసుకుంటున్నది, మహిళల ఆర్థిక వనరులను, సంకల్పబలాన్ని హరిస్తున్నది. అనేకమంది నిస్పృహతో సెటిల్మెంట్‌ను ఎంచుకుంటున్నారు.

2013 లో మానభంగం కేసుల్లో శిక్షలు పడిన రేటు 27.1శాతం మాత్రమే. మానభంగానికి వ్యతిరేకంగా శిక్షల నిబంధనలను కోర్టు ఇప్పుడు సరళతరం చేస్తుందా? డబ్బు లావాదేవీలు ప్రాథమికంగా సివిల్ లావాదేవీలు మాత్రమే. అయితే చెక్కు చెల్లకపోవటం(డిజ్‌హానర్) నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్టులోని సెక్షన్ 138 కింద నేరం. అధికవడ్డీలు గుంజే వడ్డీవ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలు దాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేయటం ఎన్నడూ బహిరంగ చర్చకు రావటం లేదు. ఇతర చట్టాలు, నేరాల దుర్వినియోగం గూర్చి న్యాయవ్యవస్థ, పౌరసమాజం ఎన్నడూ చర్చించినట్లు కనిపించదు. ఏ చట్టాన్నయినా దుర్వినియోగపరచటం సాధ్యం, అది ఆచరణలో జరుగుతున్నప్పటికీ అటువంటి చర్చకు రాలేదు. అయితే మహిళల సాధికారతకు సంబంధించి ఏదైనా చట్టం చేసినప్పుడే, ఆ చట్టం దుర్వినియోగం గూర్చి, నిందితుల బాధల గూర్చి ఉన్మాదపూరిత చర్చ బయలుదేరుతుంది.

న్యాయమైన సమాజంలో, బాధితుడు లేక బాధితురాలి ధ్యేయాన్ని కాపాడిన తదుపరి మాత్రమే శిక్ష నిబంధన సమీక్షించబడాలి. 2012 నుండి 2014 వరకు భారతదేశంలో 24,771వరకట్న మరణాలు సంభవించాయి. అంటే ప్రతిరోజు సగటున 20వరకట్న మరణాలు సంభవిస్తున్నాయి. అందువల్ల, సెక్షన్ 498ఎ సంగతమైనదే గాక, నిజమైన బాధితుల రక్షణ నిమిత్తం అది కీలకం కూడా. చట్టం దుర్వినియోగం గూర్చి ఆరోపితమైన, ఊహాజనితమైన, కొన్ని సందర్భాల్లో నిజమైన కేసులు సైతం ఉన్నప్పటికీ, అది నిజమైన బాధితులైన అసంఖ్యాక మహిళలకు హానికరం కాకూడదు. చట్టం, ప్రజాస్వామ్యం ధ్యేయం బాధలనుభవిస్తున్న మన మహిళలకు రక్షణ కల్పించటమేగాని, నిందితులకు రక్షణలు కల్పిస్తూ పోవటం కాదని గుర్తుంచుకోవాల్సిన సమయమిది.

– (రచయిత కేంద్ర మాజీమంత్రి, క్రియాశీల రాజకీయవేత్త. వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆమె వ్యక్తిగతం.)

ఏజెన్సీలో గిరిజనేతరుల ఓటు హక్కు రద్దు చేయాలి

ఎడిటర్‌కు లేఖ

నేడు ప్రపంచంలో, దేశంలో, రాష్ట్రంలో జిల్లాల్లో ఎక్కడైనా సరే ఆదివాసీలు అస్తిత్వం అంచులో కొట్టుమిట్టాడుతున్నారు. తరతరాలుగా అడవిలో, కొండలలో జంతువులతో మమేకం అయి సహజీవనం గడుపుతున్న ఆదివాసీల సాంస్కృతిక జీవన వ్యవస్థ వారసత్వం విధ్వంసం అవుతున్నాయి. జల్ జంగిల్ జమీన్ కోల్పోతున్నారు.

గిరిజనేతర వలసలతో సతమతమవుతున్న వారి స్వయంపాలన, స్వయం నిర్ణయ హక్కు హరించబడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి 1982 ఆగస్టు 9 న జెనీవాలో 26మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూప్‌ల సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ కమిటీ 1992 నుండి పది సంవత్సరాలపాటు ప్రపంచవ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించి ఆగస్టు 9 ని అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 100దేశాలలో 5వేల తెగలకు చెందిన 50కోట్ల ఆదివాసీలు 6700 భాషలు మాట్లాడుతున్నారు. మన దేశంలో 461 ఆదివాసీ తెగలు ఉండగా వారిలో 92 శాతం మంది నేటికీ అడవిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఆదివాసీల కోసం తీర్మానించిన విధానాలు, లక్ష్యాలు, అభివృద్ధి ఆశయాలు నేడు కాల రాయబడుతున్నాయి. నేటి పాలకులు ఆదివాసీలపై అనుసరిస్తున్న అత్యంత అమానుష అణచివేత విధానం నేడు మన కళ్ళ ముందు కనిపిస్తున్నది.

ఐక్యరాజ్యసమితి తీర్మానించిన విధానాలు, లక్ష్యాలు, ఆశయాలలో ప్రధానంగా ఆరు ముఖ్యంశాలు ఉన్నాయి. అవి 1)ఆదివాసీల స్వయం పాలన హక్కు 2)స్వేచ్ఛ హక్కు 3)వారు తమ హక్కులు సంరక్షించుకునే హక్కు 4) తమ సంస్కృతి సాంప్రదాయాలు, జీవన విధానం, భాష వేషధారణను రక్షించుకునే హక్కు 5)తమ కోసం స్వయంపాలన వ్యవస్థలు ఏర్పాటు చేసుకునే హక్కు 6)ఆదివాసీల విద్య, వైద్యం మౌలిక సదుపాయాల కల్పన హక్కు. కాని వాస్తవంగా జరుగుతున్నదేమిటి....? ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి ముసుగులో ధ్వంసం చేయబడుతున్నది ఎవరు...? ఆదివాసీ అడవి బిడ్డలే... ! రెడ్ ఇండియన్స్‌ను అంతం చేసి వారి వనరులను దోచుకొని అమెరికా అగ్రరాజ్యంగా అవతరించింది. అదే సామ్రాజ్యవాదం నేడు దేశంలో, దండకారణ్యంలో, రాష్ట్రంలో, జిల్లాల్లో అడుగుబెట్టి ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న సహజవనరులు, ఖనిజ సంపదనూ రాజ్యంగ వ్యతిరేకంగా దొడ్డిదారిలో దోచుకొని ఆదివాసీలను నిలువునా నిర్వాసితులను చేస్తున్నది. దండకారణ్యంలో ఆదివాసీలపై నరమేధం కొనసాగుతున్నది. వారి మహిళలపై అంతులేని అత్యాచారాలు సాగుతున్నాయి.

ఆదివాసీల స్థితిగతులు పట్టించుకొనేవారు లేక వారు నానాటికీ నష్టపోతున్నారు. రాజ్యాంగం 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్ ఆదివాసీ భూభాగంలో ఉన్న ప్రాంతాల్లో రాజ్యాంగ వ్యతిరేకంగా ముఖ్యమంత్రులు కలెక్టర్ల చేత కర్ర పెత్తనం చేయిస్తున్నారు. నేడు ఆదివాసీ ప్రాంతాలు ఆదివాసేతర (గిరిజనేతర)రాజకీయ యంత్రాంగంలో బందీగా మిగిలిపోయాయి. ఏజెన్సీలో ఆదివాసీ ప్రజాప్రతినిధులు గిరిజనేతర రాజకీయ పార్టీలచేతిలో కీలు బొమ్మలుగా, తోలుబొమ్మలుగా మారిపోయారు.

గిరిజనేతరులు....నేడు ఆదివాసీల రిజర్వేషన్స్ కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. ఏజెన్సీలో చట్టవిరుద్ధంగా రాజ్యాంగ విరుద్ధంగా పీసాచట్టానికి వ్యతిరేకంగా ఆదివాసీల సమాధుల పైనా ప్రాజెక్టులు, ఓసీలు తీస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆదివాసుల పాలిట శాపంగా మారింది. ఆదివాసుల హక్కులు కనుమరుగు అయిపోయాయి.

జిల్లాల పునర్విభజన పేరుతో ఆదివాసీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలలో కలిపారు. తెలంగాణలో 90శాతం ఆదివాసుల రిజర్వేషన్స్‌లను, ఉద్యోగాలను లంబాడీలు అక్రమంగా, చట్టవ్యతిరేకంగా దోచుకుంటున్నారు. మరోవైపు చెల్లప్ప కమీషన్ ద్వారా మరో మూడు కులాలను యస్‌టి జాబితాలో కలిపి ఆదివాసులను నిర్వీర్యం చేస్తున్నారు.

ఏజెన్సీలో ఇంతగా ఆదివాసీల జీవన ధ్వంసం జరుగుతున్నా ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయపార్టీలు సైతం నోరు మెదపటం లేదు. రెడ్ ఇండియన్స్‌ను అంతంచేసి అమెరికా అగ్రరాజ్యంగా అవతరించినట్లుగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదివాసులను అంతంచేసి బంగారు తెలంగాణ, స్వర్ణాంధ్రప్రదేశ్‌లను ఆవిష్కరించాలని కలలు కంటున్నారు. ఏజెన్సీలో గిరిజనేతరుల ఓటు హక్కు రద్దు చేయాలి. ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలు అరికట్టాలి. యస్‌టి జాబితా నుండి లంబాడీలనూ తొలగించాలి.


చెల్లప్ప కమీషన్ రద్దు చేయాలి. ఐటిడిఎలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలి. ఐటిడిఎలో అటెండరు నుండి ఐఎయస్ వరకు ఆదివాసీలనే నియమించాలి. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని, జివొ నెం3 ని పకడ్బందీగా అమలు చేయాలి. ఏజెన్సీలో పోలీస్‌నూ ఐటిడిఏ నియంత్రణలోకి తీసుకురావాలి.

ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడాలి. ఏజెన్సీలో ఆదివాసీలు సాగుచేస్తున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలి. ఏజెన్సీలో గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

(ఆగస్టు 9 న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం)

– వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు,
9866073866

ఆస్తమా..! దీన్నే దమ్ము వ్యాధి, ఉబ్బసం అని కూడా అంటారు. ఇది అన్ని వయసుల వారికి వస్తుంది. ఊపిరాడక అగచాట్లు పడడం ఆస్తమా వ్యాధి లక్షణం. దుమ్ము ధూళి, వాతావరణ కాలుష్యం వల్ల నేడు అధిక శాతం మంది ఆస్తమా బారిన పడుతున్నారు. వ్యాధి లక్షణాలను తొలినాళ్లలోనే గుర్తిస్తే నయం చేయడానికి వీలవుతుంది. నిర్లక్ష్యం చేస్తే అది క్రానిక్‌గా మారి చికిత్స కష్టతరమవుతుంది. వ్యాధి ముదిరితే ప్రాణాపాయం కూడా కలిగే ప్రమాదం వుంది. ఈ వ్యాధి రావడానికి కారణాలేంటో చూద్దాం.



ఆస్తమా నియంత్రణ సాధ్యమే!

కారణాలు : వంశపారంపర్యంగా, శ్వాసకోశాల ఇన్‌ఫెక్షన్‌కు గురికావడం వల్ల, ఎలర్జీల వల్ల, ధూమపానం వల్ల కూడా రావచ్చును.

లక్షణాలు :

- శ్వాసనాళాలు ఇన్‌ఫ్లేమేషన్‌తో మూసుకొని పోయి శ్వాసించడం కష్టంగా మారుతుంది.
- ఛాతీలో శ్లేష్మం చేరి, పిల్లి కూతలు వస్తూ శ్వాస ఆడకుండా కావడం.
- ఛాతీ పట్టేయడం, నిద్రలో నుండి లేచి కూర్చోవడం, దగ్గురావడం, దగ్గుతో పాటుగా కళ్లె పడటం జరుగును.
- వ్యాధి తీవ్రత రాత్రి, తెల్లవారుజామున ఎక్కువగా ఉండును.
- తేమ వాతావరణం, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువగును.

జాగ్రత్తలు :

- ఆయాసం ఉన్నప్పుడు రోగి వెల్లికల పడుకోకుండా, తల ఎత్తులో పెట్టుకొని కూర్చోన్న స్థితిలో పరుండవలెను.
- చలి గాలిలో బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా మాస్కు ధరించాలి.
- దుమ్ముధూళి వాహన కాలుష్యం, పారిశ్రామిక కాలుష్యానికి దూరంగా ఉండాలి.
- వయసుపై బడిన వారు చలిగాలిలో వేకువ జామున తిరగకుండా కొద్దిగా ఎండ వచ్చిన తర్వాత బయటకు రావడం మంచిది.

మందుల రకాలు

యాంటింటార్బ్ : ఛాతీలో శ్లేష్మం చేరి బయటకు రాకుండా, ఊపిరి ఆడకుండా చేస్తూ ఆయాసం వస్తున్న ప్పుడు ఈ మందు ఆలోచించదగినది. ఛాతీలో నుండి గుర గురు శబ్దాలు వచ్చును. చల్లటి వాతావరణంలో వీరికి ఆయాసం ఎక్కువగును. ఇలాంటి లక్షణాలున్న వారికి ఈ మందు వాడి ప్రయోజనం పొందవచ్చును.

ఇపికాక్ : ఛాతీలో బరువుగా ఉండి, ఊపిరి ఆడకుండా అనిపించును. అలాగే వాంతికి వచ్చినట్లుగా అనిపించును. వీరికి కదలికల వలన బాధలు



ఎక్కువగును. ఇలాంటి లక్షణాలున్న వారికి ఈ మందు వాడుకోదగినది.

ఆర్స్‌ఆల్బ్ : వీరికి ఆయాసం మధ్య పగలు ఎక్కువగుట గమనించదగిన లక్షణం. దీంతో పాటుగా వీరికి ప్రాణ భయం అధికంగా ఉండును. చెమటలు ఎక్కువగా వచ్చును. అలాగే వీరికి చల్లని పదార్థాల వలన బాధలు ఎక్కువగును. ఇలాంటి లక్షణాలున్న వారికి ఈ మందు వాడాలి.

నేట్రంసల్ఫ్ : వీరికి తడి వాతావరణం గిట్టదు. ఆయాసంతో పాటుగా ఛాతీలో గురు గురు శబ్దాలు వస్తుంటాయి. తెల్లవారు జామున ఆయాసం ఎక్కువగును. వీరి నాలుక పరిశీలించినట్లు అయితే బంగారపు రంగు పూత ఏర్పడి ఉండును. ఇటు వంటి లక్షణాలున్న వారికి ఈ మందు ముఖ్యమైనది.

కాలికార్బ్ : వీరికి ఆయాసం తెల్లవారుజామున 35 గంటల మధ్య ఎక్కువగుట గమనించదగిన లక్షణం. సంభోగం అనంతరం కలిగే ఆయాసానికిఈ మందు బాగా పనిచేయును. ఈ మందులే కాకుండా ఆస్పిడో స్పెర్మం; లోబేలియో ఇన్ ఫ్లెటా, శాంభుకస్, స్పాంజియా, కాల్కేరియా కార్బ్, సల్ఫర్ మెడోరినమ్. గ్రేండిలియా, బ్లాటా, సెనేగా, అమ్మో నియా కార్బ్. టుబర్కులినం, ఫెర్రంఫాస్, లేకసిస్, కాల్కేరియా కార్బ్, సల్ఫర్, వంటి కొన్ని మందులను లక్షణ సముదాయాన్ని అనుసరించి డాక్టర్ సలహా మేరకు వాడుకుని 'ఆయాసం' బాధ నుండి ఉపశమనం పొందవచ్చును.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్
హన్మకొండ, వరంగల్ జిల్లా

తిన్నా సుఖం లేదా?

చాలామందికి తిన్న వెంటనే నిద్రపోవాలనిపిస్తుంటుంది. దాంతో పాటు అలసట, నీరసం కూడా ఉంటుంది. ఈ లక్షణాలు కనపడగానే మధుమేహానికి దారితీస్తుందోనని భయపడుతుంటారు. కానీ కొందరిలో భోజనం చేయగానే ఎలాంటి కారణాలు లేకుండే రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయిన మాదిరిగా లక్షణాలు కనబడుతాయి. దీన్నే 'ఇడియోపతిక్ పోస్ట్ పాండ్రియల్ హైపోగ్లైసీమియా' (ఐపీఎస్) అంటారు. పిండి పదార్థం అధికంగా గల పదార్థాలు తినటం మూలంగా ఇది పెరుగుతూ ఉంటుంది. అయితే, వీరికి రక్తపరీక్ష చేస్తే గ్లూకోజు స్థాయులు మామూలుగానే ఉంటాయి.

దీంతో కాళ్లు చేతులు వణకటం, ఆందోళన, చెమట, చలి, చిరాకు, చూపు మసకబారటం వంటి లక్షణాలు కనబడతాయి. అయితే, ఐపీఎస్ ఎందుకొస్తుందనేది కచ్చితంగా చెప్పలేం. గ్లూకోజు స్థాయులు మామూలుగా ఉన్న సమయంలో ఎపినెఫ్రిన్ అనే హార్మోన్ (అడ్రినలిన్) రక్తంలోకి పెద్దమొత్తంలో విడుదల కావటం వల్ల ఇలాంటి పరిస్థితి వస్తుందని పలువురు ఆరోగ్య నిపుణులు అనుమానిస్తున్నారు. జీవనశైలిని మార్చుకోవటం ద్వారా దీనిని కంట్రోల్ చేయొచ్చు. చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, శుద్ధిచేసిన పిండి పదార్థాలను తక్కువ తీసుకోవాలి. ఇలాంటి లక్షణాలు ఉన్న వారు ఆకుకూరలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, పప్పుల వంటి పీచు అధికంగా ఉండే పదార్థాలు.. తేలికైన ప్రోటీన్ ఉన్న పదార్థాలను తీసుకోవడం మంచిది.

ప్రొస్టేట్ ఉబ్బి వేధిస్తోందా..?

వయసు మీద పడుతున్నకొద్దీ పురుషుల్లో సహజంగానే ప్రొస్టేట్ గ్రంథి ఉబ్బటం (బీపీహెచ్) మొదలవుతుంది. ఇదేమీ క్యాన్సర్‌కు దారితీయదు గానీ బీపీహెచ్, ప్రొస్టేట్ క్యాన్సర్ రెండూ కలిసి కనబడుతుంటాయి. ప్రొస్టేట్ ఉబ్బినప్పటికీ సుమారు 60% మందిలో ఎలాంటి లక్షణాలూ ఉండకపోవచ్చు. కొందరిలో మాత్రం తీవ్ర వేదన కలిగిస్తాయి. మూత్ర విసర్జన సాఫీగా కాకపోవటం, ధార తగ్గటం, మూత్రం ఆగకపోవటం, లీకవ్వటం, మూత్రం పోసినా లోపల ఇంకా ఉందని అనిపించటం, తరచుగా.. ముఖ్యంగా రాత్రిపూట ఎక్కువసార్లు మూత్రం పోయాల్సి వస్తుండటం వంటివి జీవితాన్ని దుర్భరం చేస్తాయి. ఇలాంటి వారికి మందులతో పాటు జీవనశైలి మార్పులు బాగా ఉపయోగ పడతాయి.

- కొందరు ఒత్తిడిలో ఉన్నప్పుడు, ధైర్యాన్ని కోల్పోయినప్పుడు మరింత ఎక్కువగా మూత్ర విసర్జన చేస్తుంటారు. ఇలాంటివారు వ్యాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడి తగ్గించుకోవటం మంచిది.
- కాస్త ఎక్కువ సమయం పట్టినా బాత్రూమ్‌కు వెళ్లినపుడు పూర్తిగా మూత్ర విసర్జన అయ్యేలా చూసుకోవాలి. దీంతో ఎక్కువసార్లు మూత్రానికి పరుగెత్తాల్సిన అవసరం తప్పుతుంది.
- కొన్ని మందులు సైతం మూత్ర సమస్యకు దోహదం చేయొచ్చు. అందువల్ల మీరు వేసుకునే అన్నిరకాల మందుల గురించి డాక్టర్‌కు చెప్పటం మంచిది. అవసరమైతే మందులను మార్చటమో, మోతాదును తగ్గించటమో చేస్తారు.
- సాయంత్రం వేళల్లో ద్రవాలు తీసుకోవటం మానెయ్యాలి. ముఖ్యంగా కెఫీన్‌తో కూడిన కాఫీ వంటి పానీయాలు, మద్యం జోలికి వెళ్లకపోవటం ఉత్తమం. ఇవి రెండూ మూత్రాశయ కండరాల పటుత్వాన్ని దెబ్బతీస్తాయి. మూత్రం ఎక్కువగా ఉత్పత్తయ్యేలా చేస్తాయి. దీంతో రాత్రిపూట మూత్రం ఎక్కువసార్లు రావటానికి దారితీస్తాయి.



సాధారణ ప్రొస్టేట్



ఉబ్బిన ప్రొస్టేట్

నేడు కలెక్టర్లతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలోని 31 జిల్లాల కలెక్టర్లతో బుధవారం రాత్రి 7 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. భారతదేశాన్ని ఎలా అభివృద్ధి చేయాలి, తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధాని జిల్లా కలెక్టర్ల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాల్సిందిగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది

జీఎస్‌టీపై అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్ళాలి : సిపిఐ(ఎం)



మన తెలంగాణ / హైదరాబాద్ : జిఎస్‌టి వల్ల రాష్ట్ర ప్రజలపై పడుతున్న భారాలను తగ్గించడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్ళాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేసారు. జిఎస్‌టి భారాలపై రాజీలేని పోరాటం చేస్తామని సిఎం స్వయంగా ప్రకటించి 24 గంటలు గడవకముందే 'ఫలితాలు ఎలా ఉంటాయో వేచిచూద్దాం' అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఎంబి భవన్‌లో మంగళవారం బి.వెంకట్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యకర్తల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. సిఎం ఇంకా మీనమేషాలు లెక్కించకుండా జిఎస్‌టి వల్ల తెలంగాణ సమాజానికి జరుగుతున్న అన్యాయంపై తక్షణమే కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తేవడానికి ప్రతిపక్షాలను, ప్రజా ఉద్యమాలను కలుపుకునిపోవాలని ఆయన సూచించారు.

కాకినాడకు ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు కాచిగూడ కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. కాచిగూడ కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు కాచిగూడ నుండి ఆగస్టు 24న సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.40 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక రైలు కాకినాడ టౌన్ నుండి ఆగస్టు 27న సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు మల్కాజ్‌గిరి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైళ్లలో రెండు ఎసి టూ టైర్, నాలుగు ఏసి త్రీ టైర్, ఏడు స్లీపర్ క్లాస్ బోగీలుంటాయి. ప్రత్యేక ఛార్జీలు వర్తిస్తాయి.

అదనపు బోగీలు}వేచి ఉండే జాబితాలో (వెయిటింగ్ లిస్ట్) ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని మూడు ప్రత్యేక రైళ్లకు ఒక్కో రైలులో అదనంగా రెండేసి చొప్పున స్లీపర్ క్లాస్ బోగీలను జత చేస్తున్నారు. సికింద్రాబాద్ కాకినాడ టౌన్ (ఆగస్టు 11న), కాకినాడ టౌన్ సికింద్రాబాద్ (ఆగస్టు 12న), కాచిగూడ కాకినాడ టౌన్ (ట్రైన్ నెంబర్ 7425 ఆగస్టు 11 నుండి సెప్టెంబర్ 22వ తేదీ వరకు), కాకినాడ పోర్ట్ కాచిగూడ (ఆగస్టు 12 నుండి సెప్టెంబర్ 23 వరకు), కాచిగూడ కృష్ణరాజపురం (ఆగస్టు 13 నుండి సెప్టెంబర్ 24 వరకు), కృష్ణారాజపురం ప్రత్యేక రైలు (ఆగస్టు 14 నుండి సెప్టెంబర్ 25 వరకు) అదనపు బోగీలను జత చేయనున్నారు.



ఆర్‌టిసి బికెయు నూతన కార్యవర్గం

మన తెలంగాణ / హైదరాబాద్ : టిఎస్‌ఆర్‌టిసి బహుజన వర్కర్స్ యూనియన్ (బికెయు) రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. బికెయు గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.కృష్ణ, ముఖ్య సలహాదారుడు డి.శ్రీనివాస్, అధ్యక్షులు జె.సత్యనారాయణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌తో కూడిన ప్రతినిధిA బృందం మంగళవారం ఆర్‌టిసి మేనేజింగ్ జి.వి.రమణరావును మర్యాదపూర్వకంగా కలిసింది. యూనియన్ ఉపాధ్యక్షులుగా ముగ్గురిని, సంయుక్త కార్యదర్శులుగా నలుగురిని, కార్యదర్శులుగా మరో నలుగురిని ఇటీవల జరిగిన యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎన్నుకున్నట్లు డాక్టర్ కృష్ణ తెలిపారు.

ఉచితంగా చెవి శస్త్రచికిత్సలు

మన తెలంగాణ/హైదరాబాద్ : దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిలో మొదటి వంద మంది ఉచితంగా చెవి శస్త్రచిAకిత్సలు చేయడంతో పాటు హియరింగ్ ఎయిడ్స్‌ను అందించనున్నట్లు డాక్టర్ రావ్స్ ఇఎన్‌టి సూపర్ స్పెషాలిటీ ఇంటర్నేషనల్ హాస్పిటల్ ఎండి డాక్టర్ జి.వి.కె.చైతన్యరావు తెలిపారు. హాస్పిటల్ కెపిహెచ్‌బి, పంజగుట్ట శాఖల్లో మంగళవారం ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యరావు మాట్లాడుతూ, ప్రతి నెల రెండవ మంగళవారం ఉచిత పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాయం రైతులందరికీ

(మొదటిపేజీ తరువాయి)

మూడేళ్ల బిడ్డ అని, దేశంలోనే ఆదాయానికి మాత్రం దొడ్డగా ఉందని కెసిఆర్ చెప్పారు. మూడేళ్ల బిడ్డగా ఉన్న తెలంగాణ 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని చూసి ప్రధాని మోడీ సైతం ఆశ్చర్యపోయారని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో నీళ్లు, నిధులు లేక గ్రామాలు విడిచి వలసవెళ్లే పరిస్థితి ఏర్పడిందని, స్వ రాష్ట్రంలో రైతుల బాధలు తీరుతున్నాయన్నారు. గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులతో వచ్చే సంవత్సరం నాటికి రాష్ట్రంలోని 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందజేయనున్నట్లు తెలిపారు. బంగారు తెలంగాణలో గ్రామాలు బాగుపడి సంపద రావాలని, ఇందుకు రైతులకు నీళ్లు, విద్యుత్, పెట్టుబడి అవసరమన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య తీరిందని, గోదావరి జలాలతో ప్రతి పైరుకు నీరు అందనుందన్నారు. గత గురువారం శామీర్‌పేట మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించిన సిఎం మరుసటి రోజే గ్రామాలలో మౌలిక వసతులతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను రెండు గ్రామాలకు రూ.27.75 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులను విడుదల చేయగా, మూడుచింతలపల్లి గ్రామాభివృద్ధికి రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్లు మంజూరు చేస్తామని గ్రామసభలో హామీనిచ్చారు. శామీర్‌పేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతూ మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు గానూ రూ.120 కోట్ల వరకు ఖర్చు చేస్తామని సిఎం ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి స్మీతా సబర్వాల్, రాష్ట్ర ఉన్నతాధికారి నీతూప్రసాద్, మల్కాజిగిరి ఎంపి సిహెచ్.మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ఎం.సుధీర్‌రెడ్డి, వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎంవి రెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.ధర్మారెడ్డి, సర్పంచ్ పద్మ, ఎంపిపి చంద్రశేఖర్ యాదవ్, జెడ్‌పిటిసి బాలేష్ పాల్గొన్నారు.

15 టిఎంసిలు వదలండి

(మొదటిపేజీ తరువాయి)

నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద గల పుట్టంగండి నుండి తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. సాధారణ కనీస స్థాయి 510 అడుగులు కాగా ప్రస్తుతం 500.50 అడుగులు మాత్రమే ఉందన్నారు. నాగార్జునసాగర్‌లోకి ఇన్‌ఫ్లో రాకుండా సరఫరాను కొనసాగించడం ఇబ్బందికరంగా ఉందని హరీష్‌రావు పరిస్థితిని తెలిపారు.

గురుకుల పరీక్షల తేదీలు

(మొదటిపేజీ తరువాయి)

డైరెక్టర్, జూనియర్ లెక్చరర్లు, లైబ్రేరియన్, స్కూళ్లలో ప్రిన్సిపాల్ పోస్టులకు సెప్టెంబర్ 10న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సెప్టెబర్ 4 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే టిజిజి(ఫిజికల్ సైన్స్, సోషల్, సైన్స్) మెయిన్ పరీక్షలు ఈ నెల 29,30 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 26 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు.

బదిలీలకు మార్గదర్శకాలు

(మొదటిపేజీ తరువాయి)

ఒకే రాష్ట్రంలో పనిచేసుకునే విధంగా బదిలీ చేయించుకునే వెసులుబాటు ఇచ్చారు. అంతర్రాష్ట్ర బదిలీ కోరుకున్న వారు మార్గదర్శకాలు జారీ నాటి నుండి నెల రోజుల్లోపు సంబంధిత విభాగం అధిపతికి నిర్దేశిత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను రెండు నెలల వ్యవధిలోపు పరిశీలిస్తారు. ఉద్యోగుల సర్వీసు కాలంలో ఈ బదిలీని ఒక్క సారికే అనుమతిస్తారు. అంతర్రాష్ట్ర బదిలీ కోరితే ఆ కోరిన చోట తప్పనిసరిగా ఖాళీ ఉండాలి. బదిలీ కోరే ఉద్యోగిని వేరు ఉద్యోగం (అంతకు ముందు తీసుకున్నంత పే స్కేల్ ఉండేవి) చేయాలని కోరే అవకాశం ఉంది. ఉపాధ్యాయులు అంతర్రాష్ట్ర బదిలీ కోరితే అదే యాజమాన్యం, కేటగిరీ, సబ్జెక్ట్ ఉండాలి.

జిఎస్‌టి పై మా బాధను పట్టించుకోలేదు!

నిర్మాణాత్మక సూచనలను పెడచెవిన పెట్టిన కేంద్రం: ఈటెల



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రాలలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు జిఎస్‌టి ఒక గుదిబండగా కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేAందర్ అన్నారు. జిఎస్‌టి కౌన్సిల్ ప్రతి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పలు నిర్మాణాత్మక సూచనలుచేసినా వాటిని పెడచెవిన పెట్టిందని ఆయన ఆరోపించారు. సామాన్య ప్రజల మీద భారం పడకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రం కోరినఅంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే కేంద్ర ప్రభుత్వంపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈ మేరకు మంత్రి ఈటల మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానికి తాను లేదా మంత్రి కెటిఆర్ ఎవరు వెళ్తే ఏమిటని, ప్రభుత్వ వాదనలను వినిపించామన్నారు. రాష్ట్రాలకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉన్నదన్నారు. పన్నులు కట్టించేలా ఉండాలని, ఎగగొట్టే లాగా ఉండొద్దని కేంద్రాన్ని కోరామని, గతంలో గ్రానైట్స్, బియ్యంపైన పన్నులు ఉంటే ఎవరూ కట్టలేదని, బియ్యంపై 5 శాతం పన్ను ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారానే వచ్చిందని, ప్రైవేటు వ్యక్తులు ఎవరూ పన్నులను చెల్లించలేదని వివరించారు. ఇలాంటి విధానం మంచిదికాదన్నామని, పేద ప్రజల మీద పన్ను భారం పడకుండా చూడాలని కోరామని, అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, తద్వారా చాలా మంది ప్రజల ఇబ్బంది పడుతున్నారన్నారు. జిఎస్‌టిపై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

33 అంశాలపై బుక్‌లెట్ : జిఎస్‌టి విషయంలో తాము 33 అంశాలపై బుక్‌లెట్ రూపొందించి జిఎస్‌టి కౌన్సిల్‌కు అందజేశామని ఈటల రాజేందర్ అన్నారు. ఏ వస్తువు ఏ స్లాబ్‌లో ఉండాలో సిఫారసు చేశామని, ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రత్యేక పరిస్థితులను బట్టి వస్తువులపై పన్నులు రూపొందించాలని వివరించామన్నారు. తెలంగాణ, పంజాబ్‌లో బియ్యం అధికంగా పండుతుందని, గ్రానైట్ పరిశ్రమల తెలంగాణ, రాజస్థాన్‌లో అధికమని, నార్త్ ఈస్ట్రన్ స్టేట్స్‌లో వెదురు ఉత్పత్తులు అధికం ఇలా రాష్ట్రాల వారిగా ప్రాధాన్యతలు ఉన్నప్పుడు వారి వాదనలను జిఎస్‌టి కౌన్సిల్ వినాలని, కాని ఇది జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల మీదనే కేంద్ర ప్రభుత్వం పన్నుల విధించడం సరికాదని హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. వర్క్స్ కాంట్రాక్ట్స్ పైన పన్ను వేయ్యొద్దని చెబితే దానిని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించారని, ఇది తెలంగాణ రాష్ట్రంపై పెనుభారం పడుతుందని చెప్పారు.

రూ. 24వేల కోట్ల పన్నులు : రాష్ట్రంలో రూ. లక్షల కోట్ల కోట్ల పనులు జరుగుతున్నాయని, తద్వారా రూ. 24వేల కోట్ల పన్ను కట్టాల్సి వస్తుందని, ఇంత పెద్ద మొత్తం పన్నులు చెల్లిస్తుంటే, నష్టం కాదని బిజెపి నేతలు ఎలా చెబుతారని మంత్రి ప్రశ్నించారు. బీడీ కార్మికులు, చేనేత, వ్యవసాయ, పనిముట్ల మీద కూడా పన్నుభారం పడకుండా చూడాలని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడేలా ఉండొద్దని, నిరుద్యోగ సమస్యలు పెరిగేలా నిర్ణయాలు ఉండకూడదని కోరినట్లు వివరించారు.

రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ : కాంగ్రెస్ నేతలు ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారని మంత్రి అన్నారు. సామాన్య ప్రజలపై భారం పడితే ఎవరిని సహించేది లేదన్నారు. తమది ప్రజల అవసరాల మేరకే మిత్రుత్వం ఉంటుందన్నారు. తాము అసెంబ్లీలో జిఎస్‌టి బిల్లును ఆమోదించే సమయంలో ఏ వస్తువుపై ఎంత మొత్తంలో ధరలు ఉంటాయో తెలియదన్నారు. జిఎస్‌టి సమావేశానికి ఎవరు వెళ్లినా ప్రభుత్వ విధానమే వెల్లడిస్తారని, ఎవరికి వారుగా వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించరని ఆయన స్పష్టం చేశారు.

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

రూ.2000 కరెన్సీ నోట్లను రెండు భిన్నమైన సైజుల్లో ప్రభుత్వం ముద్రించడంపై రభస చోటుచేసుకుంది. దీనిపై ప్రధాని మోడీ దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలంటూ కాంగ్రెస్‌తోపాటు టిఎంసి, జెడి (యు) ముక్తకంఠంతో డిమాండ్ చేయడంతో సభ స్తంభించి పోయింది. సభ ప్రారంభంకాగానే కాంగ్రెస్ సభ్యులు రాహుల్‌పై రాళ్ల దాడి ఘటనకు నిరసనగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి చొచ్చుకుపోయారు. రాళ్లు సూటిగా తగులుండుంటే తమ నాయకుడు రాహుల్ చనిపోయి ఉండేవారని కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యుల వాదనను హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. రాహుల్ ఎస్‌పిజి భద్రతా నిబంధనలను అనుసరించడం లేదంటూ ఆయన ప్రతిదాడి చేశారు. రాహుల్ 72 రోజుల్లో ఆరు పర్యాయాలు విదేశీ పర్యటనలకు భద్రతా సిబ్బంది లేకుండానే వెళ్లారు. ఆయనలా ఎందుకు చేశారో దేశ ప్రజలతో పాటు ఈ సభ కూడా తెలుసుకోవాలని కోరుకుంటోందని మంత్రి అన్నారు. గడచిన రెండేళ్లలో రాహుల్ 121 ప్రణాళిక బద్ధమైన, ప్రణాళికారహితమైన పర్యటనలు చేశారని, వంద సందర్భాల్లో ఆయన బుల్లెట్ ప్రూఫ్ కారును వాడనేలేదని మంత్రి గుర్తు చేశారు. ఈ రకంగా ఆయన ఉల్లంఘనలకు పాల్పడ్డారని రాజ్‌నాథ్ ఆరోపించారు. తమ నాయకుడి పర్యటనలపై విమర్శలు చేయడంతో కాంగ్రెస్ నేతలు ప్లకార్డులు చేతబూని తమ ఆందోళనను ఉధృతం చేశారు. పర్యవసానంగా సభ సజావుగా సాగని పరిస్థితి నెలకొంది. దాంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను తొలుత మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయిన తర్వాత కూడా సభ్యుల ఆందోళన కొనసాగింది. దేశాన్ని, సభను రాజ్‌నాథ్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే చేసిన ఆరోపణపై పార్లమెంటు వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధే సభను తప్పుదోవపట్టిస్తున్నారని, ప్రజాధనంతో కల్పిస్తున్న ఎస్‌పిజి భద్రతను రాహుల్ ఎందుకు ఉపయోగించుకోవడం లేదు? అవసరం లేదనుకున్నపుడు ఆయనకు ప్రత్యేక భద్రత ఎందుకు? అంటూ కుమార్ ఎదురు ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సభ్యులకు టిఎంసి ఎంపి సుదీప్ బందోపాధ్యాయ్ కూడా జతకట్టారు. రాహుల్‌పై దాడిని సభ ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు సమాజంలో అశాంతిని ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు. అదే సమయంలో ఎస్‌పిజి భద్రతను రాహుల్ ఉపయోగించుకోవాలని ప్రభుత్వం చెప్పడాన్ని ఆయన సమర్థించారు. ఇలా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు ఎంతసేపటికీ సద్దుమణగకపోవడంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ అదే సీన్...

మరోవైపు రూ.500, రూ.2000 నోట్లను రెండు భిన్నమైన సైజుల్లో ముద్రించడం వెనుక మతలబేంటంటూ విపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ఈ శతాబ్దంలో ఇదే అతిపెద్ద కుంభకోణమని విపక్ష నేత గులాం నబీ ఆజాద్ అభివర్ణించారు. సభ తొలుత ఉదయం 11 గంటలకు ప్రారంభంకాగానే ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కపిల్ సిబాల్ లేవనెత్తారు. ముద్రించిన రెండు భిన్న రకాల కొత్త నోట్లలో ఒకటి అధికార పార్టీ (సభ్యుల)కి, మరొటి ఇతరులకు అంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సిబాల్, ఆజాద్‌లకు తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డిరెక్ ఓబ్రీన్‌తో పాటు బీహార్‌లో బిజెపితో చేతులు కలిపిన జెడి (యు) నేత శరద్ యాదవ్ ఈ విషయంలో మాత్రం విపక్షాలతో జతకట్టారు. ప్రపంచంలోని ఏ దేశంలోనూ ఒకే విలువ కలిగిన నోటు రెండు భిన్నమైన సైజుల్లో ఉండదని ఆయన అన్నారు. విపక్ష సభ్యులు లేవనెత్తిన అంశాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పసలేనివిగా కొట్టిపారేశారు. న్యాయ శాఖ మంత్రి రవి శంకర్, పార్లమెంటు వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ముఖ్తర్ అబ్బాస్ నఖ్వీ ఆయనకు బాసటగా నిలిచారు. సభలో ప్రదర్శించిన నోట్లను ఎక్కడ నుండి తీసుకొచ్చారో చెప్పాలంటూ వారు విపక్ష సభ్యులను డిమాండ్ చేశారు. దీంతో ఇరు పక్షాల సభ్యుల మధ్య వాదనలు యుద్ధాన్ని తలపించడంతో తొలుత సభ ఆరుసార్లు వాయిదా పడింది. చివరకు గందరగోళ పరిస్థితులు ఏమాత్రం సద్దుమణగకపోవడంతో డిప్యూటీ ఛైర్మన్ పిజె కురియన్ మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో సభను నేటికి వాయిదా వేశారు. కాగా, అంతకుముందు 2 గంటల సమయంలో మోటారు వాహనాల బిల్లు–2017ని ఎంపిక కమిటీకి నివేదించేందుకు సభ ఆమోదం తెలిపింది.

ఆత్మాభిమానాన్ని ఎప్పుడూ చంపుకోలేదు

పుస్తకావిష్కరణ సందర్భంగా వెంకయ్యనాయుడు



మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావుకు సాష్టాంగ నమస్కారం చేసిన వారే ఆ తర్వాత ఆయనను కాళ్ళు పట్టి లాగారని ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఈ సమయంలో తాను పేర్లు వెల్లడించడం సరికాదని అంటూ వారు ఇప్పటికీ రాజకీయాలలో ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వెంకయ్యనాయుడు ప్రసంగాలు, రచనలు, పార్లమెంట్‌లో ఆయన చేసిన ప్రసంగాలతో కూడిన అలుపెరుగని గళం, విరామమెరుగని పయనం అనే శీర్షికతో ఎమెస్కో ప్రచురించిన రెండు గ్రంథాలను ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత సిహెచ్ రామోజీరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, పాదాభివందనం చేయడం, చేయించుకోవడం తనకు నచ్చదని అన్నారు. తనకు బిజెపి గురుతుల్యులుగా ఉన్న వాజ్‌పేయ్, అద్వానీలకు కూడా తానెప్పుడూ పాదాభివందనం చేయలేదన్నారు. 198384 కాలంలో గవర్నర్ రాంలాల్ అప్పటి ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేశారని, అప్పట్లో ప్రజాస్వామ్యపరిరక్షణ కోసం ఎన్‌టిఆర్‌తో కలిసి పని చేశానని అన్నారు. తిరిగి ఎన్‌టిఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత తనను మంత్రివర్గంలో చేరాలనిఆహ్వానించారని, కానీ తాను పార్టీ మారేది లేదని తేల్చి చెప్పానని అన్నారు. కాళ్ళకు దండం పెట్టే పద్ధతి తనకు నచ్చదన్న విషయాన్ని ఎన్‌టిఆర్‌కు చెప్పానని అన్నారు. ఓ రోజు ఎన్‌టిఆర్ పిలిస్తే తెల్లవారు జామునే ఆయన ఇంటికి వెళ్లానని, అప్పటికే ఆయన చుట్టూ కొంత మంది ఉన్నారన్నారు. తనను చూడగానే మీరంతా వెళ్ళండని తనతో పాటు ఉన్న వారికి ఎన్‌టిఆర్ చెప్పారని, వారంతా తిరిగి వెళ్తూ ఎన్‌టిఆర్ కాళ్ళకు సాష్టాంగపడి నమస్కారం పెట్టారన్నారు. ఇదేం పద్ధతి అని ఎన్‌టిఆర్‌ను అడిగితే వారు తనకిచ్చే గౌరవమని, వారిష్టాన్ని కాదనకూడదని చెప్పారన్నారు. అలా కాళ్ళకు దండం పెట్టిన వారే ఆ తర్వాత ఆయనను పదవి నుంచి కాళ్ళు పట్టి లాగారన్నారు. తాను ఎంఎల్‌ఏగా ఉన్న రాజకీయాలు ఇప్పటి రాజకీయాలు చాలా భిన్నంగా ఉన్నాయని, మేం చెన్నారెడ్డిని నాడు తిట్టిన తిట్లను నేడు తిడితే అసెంబ్లీ నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. చిన్నతనంలోనే ఎంఎల్‌ఏనైన తాను పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న లాంటి వారి పెద్ద పెద్ద వారితో కలిసి పని చేసే అదృష్టం లభించిందన్నారు.

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎస్. గురుమూర్తి మాట్లాడుతూ, వెంకయ్య ప్రసంగాలు, రచనలను నేటి తరానికి పాఠ్యాంశంగా చేరిస్తే బాగుంటుందన్నారు. నిరంతరం ప్రజాసమస్యలపై ఆలోచిస్తూనే తన అభిప్రాయాలను ప్రజలకు రచనల ద్వారా తెలిపారన్నారు. ఏ పదవిని అలంకరించినా ఆ పదవికి పూర్తి న్యాయం చేసిన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా రాజ్యాంగ పరిధిలో పూర్తి న్యాయం చేస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. ఏ అంశాన్నైనా కూలంకషంగా అవగాహన చేసుకోవడం, అందులోని సాదక బాధకాలను తెలుసుకోవడం, వాటిని సరళమైన పద్ధతిలో వివరించడం వెంకయ్యకున్న ప్రత్యేకత అని అన్నారు.

తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు.ఈనాడు గ్రూపు సంస్థ అధినేత రామోజీరావు మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతానికి జీవితాంతం కట్టుబడిన అసలైన నేత వెంకయ్యనాయుడు అని అన్నారు. కసి ప్లస్ కృషి ఈజిక్వల్ట్ వెంకయ్యనాయుడు అని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి అన్నారు. వెంకయ్యనాయుడు చట్టసభల్లో శాశ్వతంగా ఉండాల్సిన వ్యక్తి అని, ఆయన చూపిన ప్రతిభ, తెగువ, అంశాల వారిగా ఆయన చేసిన ప్రసంగాలు నేటికీ గుర్తున్నాయన్నారు. నేటి రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, నేడు ఒక పార్టీలో రేపు ఒక పార్టీలో ఉంటూ ఆవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. రాజకీయాలలో హద్దులు మీరొద్దని నాడే సమాజానికి తెలియజేసిన వ్యక్తి వెంకయ్యనాయుడు అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు అన్నారు. ఉప రాష్ట్రపతిగా సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా వెంకయ్యనాయుడు ఉంటారని ఆశిస్తున్నానని అన్నారు. వెంకయ్య ప్రసంగాలు, రచనలతో రూపొందించిన గ్రంథాలు భవిష్యత్ తరాలకు పాఠ్యాంశాలుగా నిలుస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమెస్కో అధినేత విజయకుమార్ పాల్గొన్నారు.

నేరెళ్ల బాధాకరం: కెటిఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి సంఘటనలు జరగాలని ఎవరూ కోరుకోరని, దీనిని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఒక ఉద్యమ పార్టీగా ఏర్పడి, ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసమే కృషి చేస్తుందని ఆయన తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు కోసం ప్రజల అవసరాల నిమిత్తం ఇసుక తరలించే క్రమంలో వాహనాల రద్దీ పెరిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయం వాస్తవమేనన్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొంత మంది నాయకులు ఇసుక మాఫియా అంటూ రాజకీయంగా విమర్శలు చేయడం సరికాదని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నది. అందులో 45 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం పాలించింది. అప్పుడు ఇసుక మాఫియాలు తల ఎత్తాయి కాని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత మూడేళ్లల్లో ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఆదాయం ఉంది కాని మాఫియా లేదన్నారు. నేరెళ్ల లారీల దగ్ధం కేసుల్లో దళితులు, బిసిలు ఉన్నారని, దళితులను మాత్రమే టార్గెట్ చేశారని అనడం సమంజసం కాదన్నారు. సంఘటనపై డిఐజి విచారణ జరుగుతుందని విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మిగతా రాజకీయ పార్టీల నాయకులు టూరిస్టుల వల్ల వచ్చి పరామర్శించి పోతున్నారే తప్ప ఏ ఒక్కరు కూడా బాధితులను ఆదుకోలేదన్నారు. ప్రతిసారీ ఇతర పార్టీ నాయకుల తిట్టే తిట్లే మాకు దీవెనలన్నారు. బాధితుల ఆరోగ్యం పూర్తి స్థాయిలో కుదుటపడే వరకు పూర్తి బాధ్యత తనదేనని, వారికి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. తన నియోజకవర్గం ప్రజలను తన నుండి దూరం చేయడం ఎవరివల్లా కాదన్నారు. ఆయన వెంట జడ్‌పిటిసి గుడిసె శ్రీకాంత్,టిఆర్‌ఎస్ నాయకులు ఎర్రం మహేశ్, సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజుతో పాటు తదితరులున్నారు.

ఎందుకీ అసహనం?

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులలో పెరుగుతున్న ఖర్చులు అందుకు నిదర్శమని పేర్కొన్నారు. తాము చేసిన విమర్శలో ప్రతి అంశానికి కట్టుబడి ఉన్నామని, వీటిపై చర్చకు కూడా తాము సిద్ధమేనని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన వివిధ రాజకీయ పార్టీలు, సబ్బండ వర్గాల ఉమ్మడి పోరాటాల ఫలితమా, కాదా, అయితే ప్రస్తుతం వారి పాత్రేమిటో చెప్పాలన్నారు.

''తాను వ్యక్తిగత దాడికి పూనుకోలేదు. కుసంస్కారపు మాటలు అనలేదు. సిఎంగా కెసిఆర్ వైఫల్యాలను రాజకీయంగా ఎత్తి చూపాం. ప్రతిపక్షంగా అది మా హక్కు. ఈ అంశాలు ప్రజల దృష్టికి తీసుకెళ్ళటం మా బాధ్యత. మీకు ఎందుకింత అసహనం. తాము లేవనెత్తిన అంశాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు? అది మీ బాధ్యత కాదా? కమ్యూనిస్టులపై, కాంగ్రెస్‌పై ఒంటికాలిపై లేస్తున్నారు. వినయంగా ఉండమని కేంద్రం కోరితే బిజెపి ముందు సాగిలబడాల్సిన అవసరమేముంది'' అని కెసిఆర్‌ను సురవరం ప్రశ్నించారు.

తాము చేసే విమర్శ నచ్చకపోవచ్చుని, మింగుడుపడకపోవచ్చు కానీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు అధికారపక్షంపై రాజకీయ విమర్శలు ప్రతి విమర్శలు అనివార్యమన్నారు. రాజకీయంగా సమాధానం చెప్పలేనప్పుడు చేసేది వ్యక్తిగత దాడులు, వాడేది కుసంస్కారపు భాష అని, ఇది సిఎం విలువను పెంచకపోగా తగ్గిస్తుందన్నారు. ముఖ్యమంత్రిగా మీరు ప్రజలకు, ఎంఎల్‌ఎలకు, అధికారులకు అందుబాటులో ఎందుకు లేరో వివరణ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలకు, ప్రజా సంఘాలకు ఇంటర్వ్యూ ఎందుకివ్వరు? ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నాయకుల విమర్శలకు అసహనంతో, సంస్కారహీనంగా సమాధానాలు ఏమిటని ప్రశ్నించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు జవాబుదారీ ప్రభుత్వమని, అందులో భాగమే ప్రతిపక్ష పార్టీలన్నారు. నిజానికి ప్రజాదరణలో రాష్ట్రంలో సింహభాగం ప్రతిపక్షాలదన్న వాస్తవాన్ని పాలకులు గుర్తెరగాలన్నారు. దేవుళ్ళు, పండగలు, పబ్బాల పేరుతో ప్రభుత్వ సొమ్మును ఉదారంగా ఖర్చు చేస్తున్నారని, సెక్యులర్ రాజ్యాంగానికి ఇది విరుద్ధమన్నారు.

ప్రజాస్వామ్యమంటే ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలే కాదని, ప్రజాసమస్యల పరిష్కారానికి విజ్ఞప్తులు, ఆందోళనలు, పోరాటాలు కూడా మార్గమన్నారు.

టీ గార్డుల దొంగతనంపై సిఎస్ సీరియస్

మన తెలంగాణ/హైదరాబాద్: మొక్కలను రక్షించేందుకు ఏర్పాటు చేసే ట్రీ గార్డుల దొంగతనాన్నిప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రతి సారి ట్రీగార్డు దొంగతనాల ఫిర్యాదులు రావడంతో ఇక ''ట్రీ గార్డ్'' దొంగలను జైల్లో పెట్టాలని నిర్ణయించారు. ట్రీ గార్డు దొంగలపై కేసు నమోదు చేసి, వారిని జైల్లో పెట్టాలని ఎస్.పి.సింగ్ రాష్ట్ర హోంశాఖను ఆదేశించారు. ఇలా చేస్తే భవిష్యత్తులో ట్రీ గార్డుల దొంగతనాలు పునరావృత్తం కాకుండా ఉంటాయన్నారు. హరితహారం పురోగతిపై సచివాలయంలో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడవ విడతలో భాగంగా ఇప్పటి వరకు నాటిన మొక్కలు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, జియో ట్యాగింగ్, గ్రీన్ బ్రిగేడ్ తదితర అంశాల వారిగా జిల్లా కలెక్టర్లును, ఉన్నతాధికారులను ఎస్.పి.సింగ్ అడిగి తెలుసుకున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో మంచి వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు లేనప్పుడు మొక్కల టార్గెట్‌ను పూర్తి చేయాలన్న ఆందోళన వద్దని, ముందు నాటిన మొక్కలను రక్షించుకునేందుకు దృష్టి సారించాలన్నారు. అనంతరం రోడ్లు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ మాట్లాడుతూ ఆర్‌టిసి సిబ్బందితో పాటు రోడ్ల భవనాల శాఖ అధికారులు హరితహారంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని, అర్బన్ పార్కుల వంటి సంబంధిత కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

నకిలీ కుర్ కురే కేంద్రంపై దాడి

మనతెలంగాణ/శంషాబాద్ : మూడు లక్షల విలువ చేసే నకిలీ కుర్‌కురేను ఎస్‌ఓటి పోలీసులు, ఆర్జీఐఏ పోలీసులు దాడి చేసి పట్టుకున్నా సంఘటన మంగళవారం శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఓటి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ బేగంబజార్‌కు చెందిన వ్యాపారి మహ్మద్ ఇర్ఫాన్ (35) హుడా కాలనీ వద్ద పాడుపడ్డ పౌల్ట్రీఫామ్‌లో అనుమతి లేకుండా కుర్‌కురే తయారు చేస్తున్నట్లు సమాచారం వచ్చిట్లు తెలిపారు. దీంతో అ స్థావరంపై దాడి చేయగా దాదాపు మూడు లక్షల విలువ చేసే కుర్‌కురే తయారీ ముడి సరుకును, రెండు కుర్‌కురే మిషన్లను, మూడు కెమికల్ బాక్స్‌ను, 115 నకిలీ కుర్‌కురేను, ఒక వెయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకొని శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.



ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి : మహమూద్ అలీ

మన తెలంగాణ/హైదరాబాద్/హిమాయత్‌నగర్ : గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందిస్తున్నదని ఉప ముఖ్యమంత్రి మహమ్మూద్ అలీ పేర్కొన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో కొమరంభీమ్ అవార్డ్, సాంస్కృతిక సంబరాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎవరెస్టు శిఖరం అవరోధించిన మాలోతు పూర్ణ, దేశ రాజధాని ఢిల్లీలో ఆర్‌టిసి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సరితతో పాటు వివిధ రంగాలలోసేవలను అందించిన ఏడుగురికి కొమరంభీమ్ అవార్డులను మంత్రులు ప్రదానం చేశారు. మంత్రి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం సిఎం కెసిఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నరని తెలిపారు. హోంశాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.శంకర్‌నాయక్ మాట్లాడుతూ తీజ్ పండుగను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని,గిరిజనుల సంస్కృతి కోసం గిరిజన పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కెవి రమణ,వెంకటేశ్వర్‌రెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, బొల్ల శివకుమార్, జునాయక్ పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడుకు ఘనస్వాగతం




మన తెలంగాణ / శంషాబాద్ : ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యాక మొదటిసారిగా హైదరాబాద్ వచ్చిన ఎం. వెంకయ్య నాయుడికి మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాష్ట్ర గవర్నర్ నరసింహన్, బిజెపి నేతలు డాక్టర్ లక్ష్మ న్, కిషన్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, రాంచంద్రరావుతోపాటు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు బిజెపి మహిళ మోర్చా నేతలు ఆత్మీయంగా రాఖీలుకట్టారు.

కబ్జాపై ఫిర్యాదు చేస్తే సస్పెండ్ చేస్తారా?

మన తెలంగాణ /హిమాయత్‌నగర్: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలో కోట్ల విలువ గల 600 ఎకరాల ప్రభుత్వ భూమిని భూ కబ్జాదారుల చేతుల్లో కబ్జా కు గురైందని, సాక్ష్యాధారాలతో సిఎంకు ఫిర్యాదు చేసినందుకు అధికారులు, భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోకుండా మండల సర్వేయర్‌ను సస్పెండ్ చేయడం దారుణమని తెలంగాణ రాష్ట్ర భూ సంరక్షణ సమితి పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర భూసంరక్షణ సమితి అధ్యక్షులు గొల్లపల్లి దయానందరావు, యంగ్ ఇండియన్ సర్వెంట్ సొసైటీ అధ్యక్షులు పెండ్యాల నరేష్, మాట్లాడుతూ మేడిపల్లి మండలంలో ప్రభుత్వభూ మి, శిఖం భూములు (సర్వే నంబర్ 215, 216 నుండి 221వరకు)కబ్జాకు గురయ్యాయని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సర్వేయర్ కృష్ణ సి ఎంకు జులై 2న ఫిర్యాదు ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, తహశీల్దార్ సంతోష్‌లాల్, భూకబ్జాదారులపై ఏలాంటి చర్య లు తీసుకోకుండా సర్వేయర్‌ను సస్పెండ్ చేశారన్నారు. అతనికి అధికార పూర్వకంగా ఎలాంటి షోకాజ్ నోటీస్, చార్జీమెమో కూడా ఇవ్వలేదని తెలిపారు. సిఎం కెసిఆర్ ఈ భూకబ్జాపై జోక్యం చేసుకుని, ఇందుకు బా ధ్యులై అధికారులు, భూకబ్జాదారులపై చర్యలు తీసుకుని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, సర్వేయర్ కృష్ణ పై విధించిన సస్పెన్షన్‌ను మేడ్చల్ కలెక్టర్ పునఃలోచించి సస్పెన్షను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశా రు. ఈ సమావేశంలో సర్వేయర్ కె. కృష్ణ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగి మృతి





మన తెలంగాణ/ ఇబ్రహీంపట్నం : విద్యుత్ షాక్‌కు గురై విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంగరకలాన్‌లో మంగళవారం జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌కి చెందిన అశోక్ రెడ్డి(47) అదే గ్రామంలో విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు లైన్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కక్కడే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఆదిభట్ల ఎస్‌ఐ మోహన్‌రెడ్డి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, రెగ్యులైజేషన్ జాబితాలో అశోక్‌రెడ్డి పేరు ఉన్నట్టు బంధువులు తెలిపారు.

పరిహారం వచ్చేలా చూస్తాం : విద్యుత్తుశాఖ అధికారులు హామీ

విద్యుత్‌శాఖ కాంట్రాక్టు ఉద్యోగి ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందటంతో అశోక్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వమే తక్షణమే నష్టపరిహారం అందచేయాలని బంధువులు, గ్రామస్తులు డిమాండ్‌చేశారు. దీంతో విద్యుత్ శాఖ డిఇ, ఎఇలు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం విద్యుత్‌శాఖ డిఇ, ఎఇలు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే గ్రాంట్‌ను, ఎల్‌ఐసి ద్వారా నిధులు వచ్చేటట్టు ప్రయత్నిస్తామని హామీనిచ్చారు. పరిహారం కోసం చేసే ఆందోళన బంధువులు, గ్రామస్తులు విరమించారు.

గోల్డ్ స్టోన్ బాధితులను ఆదుకోవాలంటూ

శంషాబాద్‌లో రాజకీయ పార్టీల ధర్నా



మన తెలంగాణ/ శంషాబాద్ : ఘాన్సిమియా గూడ గ్రామంలో గోల్డ్ స్టోన్ భూ కబ్జాదారులపై కఠినచర్యలు తీసుకొని రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలంటూ మంగళవారం వివిధ పార్టీల నాయకులు శంషాబాద్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాచేశారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ నాయకుడు కె.సీతారాములు మాట్లాడుతూ తప్పుడు డాక్యుమెంట్లు చూపి, అమాయక రైతుల నుంచి అక్రమంగా విలువైన భూములను లాక్కున్నారని ఆరోపించారు. ఈ భూ కుంభకోణంలో స్థానిక అధికారులు, నాయకులు, ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. టిడిపి నాయకుడు గణేష్‌గుప్త మాట్లాడుతూ ఎవరైనా ఫిర్యాదుచేస్తే స్పందించని పోలీసులు గోల్డ్‌స్టోన్ బాధితులను మాత్రం అటుగా వెళ్తే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఘాన్సిమియాగూడ సర్పంచ్ భర్త జగన్‌గౌడ్ మాట్లాడుతూ అసలు గ్రామంలో ఏం జరిగిందో ఇప్పటికైనా ప్రభుత్వం నిజానిర్ధరణ చేసి దోషులను శిక్షించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి భూపాల్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్, జగన్, మల్లేష్, శ్యామెల్, జగదీష్, చంద్రమోహన్, మహేందర్, ఆనంద్, రామ్‌నాయక్ తదితరలు పాల్గొన్నారు.

సర్వీసు రెగ్యులరైజ్ కాలేదని విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికుని ఆత్మహత్య

మన తెలంగాణ/కొత్తగూడెం : విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వ తీరుతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న నాగేశ్వర్‌రావు కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, మృతికి కారకులైన అధికారులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాష డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ ఉద్యోగుల రెగ్యుల రైజేషన్ జాబితాలో 20 ఏండ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఆ జాబితాలో తన పేరు లేకపోవడంపై మనస్తాపానికి గురైన కేశబోయిన నాగేశ్వరరావు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సాబీర్ పాషా ఆస్పత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సిపిఐ నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, బెజవాడ సత్యనారాయణ, భాను వెంకట్ తదితరులు ఉన్నారు.

దోపిడీ ముఠా ఆటకట్టు

హైవేలపై అర్ధరాత్రి దారి దోపిడీలే లక్ష్యం **ప్రాణాలు తీయడానికీ వెనుకాడరు**



మన తెలంగాణ/షాద్‌నగర్ : హైవేలపై అర్ధరాత్రి వేళల్లో దారి దోపిడీలకు పాల్పడుతున్న షికారి గ్యాంగ్‌ను షాద్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సాయంత్రం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎసిపి శ్రీనివాస్ షికారి గ్యాంగ్ ముఠా సభ్యుల అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర రాష్ట్రం సంగ్లి జిల్లా మిరాజ్ తాలుక ఎరన్‌దోలి గ్రామానికి చెందిన విజయ్, భరత్ బస్వరాజ్ బోస్‌లే అలియాస్ ప్రతాప్, బాదల్ బస్వరాజ్ బోస్‌లే అలియాస్ శ్రీను, సింహాద్రి బస్వరాజ్ బోస్‌లేలు అన్నదమ్ములు. వీరికి పిట్టుకాలే అలియాస్ కిట్టు కాలే వరసకు బావమరిది. వీరు ముఠా గా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఆరు నెలలుగా షాద్‌నగర్ ప్రాంతంలో దారిదోపిడీలు చేస్తున్నారు. ముఠా సభ్యులలో ఒకరు చీర ధరించి రోడ్డుపై నిలబడి వాహనాలకు ఆపుతారని, వాహనాలను ఆపి కిందికి దిగిన ప్రయాణికులను డ్రైవర్, క్లీనర్‌లను చెట్లలోకి తీసుకెళతారని తెలిపారు. వెంటనే ముఠాసభ్యులందరు చెట్లలోకి వచ్చి వారిపై దాడిచేసి దోపిడీ చేస్తారని వివరించారు. అదేవిధంగా అర్ధరాత్రి వేళల్లో అలసిపోయి రోడ్డు పక్కన వాహనాలు ఆపి నిద్రిస్తున్న వారిని గ్యాంగ్‌సభ్యులు టార్గెట్‌గా చేసుకొని దారిదోపిడీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. రోడ్డుపై వెళ్లే వారెవరికీ అనుమానం రాకుండా దోపిడీ చేసి అక్కడి నుండి పరారవుతున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో ఇటీవల మూడు కేసులు నమోదైనట్లు వివరించారు. దారిదోపిడీ ముఠా సభ్యులను అరెస్టు చేసేందుకు ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటుచేసి షికారి గ్యాంగ్‌ను అరెస్టుచేసినట్లు వివరించారు.షాద్‌నగర్ బస్టాండ్ సమీపంలో మంగళవారం షికారి గ్యాంగ్‌ను పట్టుకొన్నట్లు వివరించారు. వీరి నుండి రూ. రెండు వేల నగదు, కత్తులు, కత్తెరలు, బ్లేడ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. షికారి గ్యాంగ్ సభ్యులు అడ్డువచ్చిన వారిని అంతమొందించేందుకు వెనుకాడరని తెలిపారు. ఈ ముఠా భువనగిరి, చౌటుప్పల్, భూత్పూర్, షాద్‌నగర్ ప్రాంతాలతో పాటుగా వివిధ రాష్ట్రాల్లో దారి దోపిడీలకు పాల్పడినట్లు తెలిపారు. ముఠాను పట్టుకోవడంలో షాద్‌నగర్ సిఐ శ్రీనివాసచారి, ఎస్‌ఐ దాసు, ఐడి పార్టీ సిబ్బంది శేఖర్, శివ, రవీంద్రనాయక్, శ్రీనివాసులుతోపాటుగా పోలీసు సిబ్బంది కృషి చేసినట్లు వివరించారు.

ఉద్యోగాల పేరిట మోసగిస్తున్న ఇద్దరు గల్ఫ్ ఏజెంట్ల అరెస్టు

మన తెలంగాణ/కోరుట్ల : ప్రజలను గల్ఫ్ దేశాలకు పంపించే ఏజెంట్ ను మంగళవారం కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. సిఐ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం కథలాపూర్‌కు చెందిన దువాల్ల గంగాధర్ (50) అను వ్యక్తి కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన ఓ మహిళను సౌది దేశం పంపగా అక్కడ గంగాధర్ చెప్పిన పని కాకుండా ఆమెతో వేరే పనులు చేయించగా ఆమె అక్కడి పోలీసుల సహాయంతో వెల్లిన నెల రోజుల్లోనే స్వదేశం తిరిగొచ్చింది. ఈ విషయంలో గంగాధర్‌తో పాటు కథలాపూర్ గ్రామానికి చెందిన దొబ్బుల బాబు(43) లను అరెస్టు చేశామని సిఐ తెలిపారు. ఏజెంట్ లు గంగాధర్, బాబులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేని ఏజెంట్ల మాటలను నమ్మి మోసపోయి,డబ్బులు ఇచ్చి నష్ట పోవద్దని ప్రజలకు పోలీసు శాఖా తరపున విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్‌ఐలు కృష్ణకుమార్,ఆరీఫ్ అలీఖాన్‌లు ఉన్నారు.

1190 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు



- రూ.11,586 కోట్ల పెట్టుబడుల అంచనా
- వలస కార్మికులను వెనక్కి రప్పిస్తాం
- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

మన తెలంగాణ/సంగెం: దేశంలోనే అతిపెద్ద మెటా టెక్స్‌టైల్ పార్క్ జిల్లాకు రాబోతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం సంగెం మండలం చింతలపల్లి టెక్స్‌టైల్ పార్క్ స్థలంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబు,కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, స్థానిక ఎంఎల్‌ఎ చల్లా ధర్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎం.హరిత మొక్కలు నాటారు. అనంతరం సంగెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.85 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ టెక్సటైల్ పార్క్ ఏర్పాటుకు 1190 ఎకరాల భూమిని సమస్యలు లేకుండా రైతులను ఒప్పించి సేకరించడం జరిగిందని ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న జిల్లా కలెక్టర్ అదేవిధంగా స్థానిక ఎంఎల్ఎలను ప్రత్యేకంగా అభినందించారు. టెక్స్‌టైల్ పార్క్‌ను రూ.1150 కోట్ల నిధులతో ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎంఎల్‌ఎ చల్లా ధర్మారెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి పురుషోత్తం, ఆర్‌డిఒ మహేందర్‌జీ, సంగెం జడ్పిటిసి గుగులోతు వీరమ్మ, ఎంపిపి బొమ్మల కట్టయ్య, ఆర్‌విఎం ఈఈ కాంతారావు, సంగెం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా మేముంటాం : మర్రి

మన తెలంగాణ/యాచారం: రైతులకు అండగా మేముంటామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి మర్రిశశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని స్థానిక సాయిశరణం గార్డెన్స్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు ఫార్మా భూ నిర్వాసిత రైతుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీల ప్రకారం పేదలకు భూములు పంచి ఆదుకోవాల్సింది పోయి వారికి జీవనాధారమైన భూములు లాక్కోవడం దారుణమైన చర్యగా ఆయన అభివర్ణించారు. నేడు రైతులు ఫార్మాసిటీ కోసం ఉన్న భూములు కోల్పోయి మరిక ముందు వారు ఏంచేసి బతకాలో అధికార పార్టీ నాయకులే చెప్పాలని ఆయన సెలవిచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులను అధికారుల ద్వారా బెదిరించి వారి భూములను తీసుకోవాలనుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇక ముందు కూడా పరిస్థితి ఇలాగే కొనసాగితే పార్టీ వారికి అండగా నిలబడుతుందని హామీనిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ముదిరెడ్డి కోదండరెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ ఫార్మా పరిశ్రమ ఏర్పాటు వల్ల తరతరాలకు తరగని నష్టం వాటాల్లుతుందని, భూగర్భ జలాలు విషతల్యం కావడానికి అవకాశముందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు దెంది రాంరెడ్డి మండల ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కాలె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథను పరిశీలించిన ఐపిఎస్‌లు



మన తెలంగాణ/గజ్వేల్: మారుమూల పల్లెలకు కూడా ఇంటింటికీ పరిశుద్ధమైన తాగునీటిని నల్లాల ద్వారా అందించటం నిజంగా ఒక భగీరథ యత్నమే.. ప్రజల ఆరోగ్యానికి ఈ పథకం ఎంతో దోహదపడుతుంది.. సిఎం కెసిఆర్ చేసిన ఆలోచనకు కార్యరూపం ఇచ్చి సమర్థంగా అమలు చేయటం ప్రశంసనీయమని సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలోని కోమటిబండపై నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంటును, సంప్‌హౌస్ తదితర నిర్మాణాలను పరిశీలించిన ఐపిఎస్ అధికారుల బృందం అభిప్రాయపడింది. కరీంనగర్ జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో ఉన్న గజ్వేల్ మిషన్ భగీరథ ప్లాంటును ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు కోమటిబండ గుట్టపై నుంచినియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు శుద్ధి చేసిన నీటిని భారీ పైపుల నుంచి గ్రావిటీ ద్వారా సరఫరా అవుతున్న తీరును పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. ఎత్తయిన గుట్టపైన నిర్మించిన ప్రాజెక్టు సంప్‌లు, పంపింగ్ హౌస్, భారీ ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైలాన్ నిర్మాణాలను పరిశీలించారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలో మిషన్ భగీరథ పనుల పురోగతిని, ప్రాజెక్టు పనితీరును గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి హనుమంతరావు, మిషన్ భగీరథ ఎస్‌ఇ విజయప్రకాష్ తదితరులు ఐపిఎస్ అధికారుల బృందానికి వివరించారు. ఇంటింటికీ తాగునీటిని నల్లాల ద్వారా అందించటం నిజంగా ప్రతిష్ఠాత్మకమైన పథకమేనని వారన్నారు. సోమవారం పర్యటించిన ఐపిఎస్ అధికారుల బృందంలో అవినాష్ మొహంతి, హైదరాబాద్ సిపి మహేందర్‌రెడ్డి,అధికారి సుమతితో పాటు పలువురు ఐపిఎస్‌లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వారి వెంట సిద్దిపేట ఎసిపి నర్సింహారెడ్డి, గజ్వేల్ సిఐ సతీష్, ఎస్‌ఐ కమలాకర్, మిషన్ భగీరథ పథకం డిఈ రాజయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

7.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

మన తెలంగాణ/కల్లూరు : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ గ్రామానికి చెందిన రేషన్‌షాపు నుండి అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు సమాచారం మేరకు పట్టుకున్నారు. పేరువంచలోని రేషన్ డీలర్ ఆర్. నాగేశ్వరరావు ఇంటి వద్ద నుండి మంగళవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో సివిల్ సప్లై అధికారి మురళి దాడి చేసి పట్టుకున్నారు. 7.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఆటోను అదుపులోకి తీసు కున్నారు. బియ్యాన్ని సమీపంలోని ముగ్గు వెంకటాపురం డీలర్‌కు అప్పగించారు. ఈ దాడిలో ఎస్‌ఐ పవన్ కుమార్, ఆర్‌ఐ చిరంజీవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గౌతమ్ సినిమాలపై గంపెడాశలు

సౌత్ ఇండస్ట్రీలో దర్శకుడు గౌతమ్ మీనన్‌ది ఓ విలక్షణ శైలి. డైరెక్టర్‌గా ఆయన టాలెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. గౌతమ్‌మీనన్ నిర్మాతగానూ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఆయన నిర్మాతగా టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ఓ తమిళ సినిమాలో నటిస్తున్నాడు. కార్తీక్ నరేన్ దర్శకత్వంలో 'నరగాసురన్' టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. తెలుగులో 'నరకాసురుడు'గా రాబోతున్న ఈ సినిమాలో సందీప్ కీలకమైన పాత్రలో నటిస్తున్నాడు. సందీప్‌కిషన్ రోల్ సినిమాకే హైలైట్‌గా ఉంటుందని తెలిసింది. గౌతమ్‌మీనన్, కార్తీక్ నరేష్ కాంబినేషన్ కారణంగా ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా తర్వాత సందీప్ కిషన్ హీరోగా మరో సినిమాను నిర్మించాలని గౌతమ్ మీనన్ అనుకుంటున్నాడు. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కనుంది. నటుడిగా మంచి పర్‌ఫార్మెన్స్ ఇస్తున్నా హిట్ సినిమాలు లేక సందీప్ సక్సెస్‌ను అందుకోలేకపోతున్నాడు. శమంతకమణి చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న అతనికి 'నక్షత్రం' చిత్రం నిరాశనే మిగిల్చింది. దీంతో గౌతమ్‌మీనన్ సినిమాల మీద గంపెడాశలు పెట్టుకున్నాడు సందీప్.


సందీప్ కిషన్

బర్త్‌డే గిఫ్ట్‌గా టీజర్




మహేశ్

సూపర్‌స్టార్ మహేశ్ ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్‌ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'స్పైడర్'. ఇటీవల విడుదలైన సినిమా టీజర్‌కు ప్రేక్షకులు, అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. కాగా బుధవారం మహేశ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా మహేశ్‌కు నిర్మాతలు ఠాగూర్ మధు, ఎన్.వి.ప్రసాద్, ఎ.ఆర్.మురుగదాస్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. 'స్పైడర్' కొత్త టీజర్‌ను బుధవారం విడుదల చేయనున్నారు. నిర్మాత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ ''ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు రికార్డు స్థాయిలో స్పందన వచ్చింది. బుధవారం మా హీరో మహేశ్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం 9 గంటలకు కొత్త టీజర్‌ను విడుదల చేస్తున్నాం. ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తయింది. ఈ పాట చిత్రీకరణ ఈనెల 23 వరకు జరుగుతుంది. దీంతో మొత్తం షూటింగ్ పార్ట్ పూర్తవుతుంది. డబ్బింగ్, రీరికార్డింగ్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి దసరా కానుకగా సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా 'స్పైడర్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం''అని అన్నారు. మహేశ్, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః హేరిస్ జయరాజ్, సినిమాటోగ్రఫీః సంతోష్ శివన్, ఎడిటింగ్ః శ్రీకర్ ప్రసాద్.

లక్నోలో యాక్షన్ ఎపిసోడ్...

మహేశ్ కొరటాల శివ కాంబినేషన్‌లో డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై డివివి దానయ్య ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కొత్త షెడ్యూల్ ఈనెల 11 నుంచి 22 వరకు లక్నోలో జరుగుతుంది. బుధవారం మహేశ్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫిల్మ్‌మేకర్స్ లక్నోలో జరిగే షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలు తెలియజేశారు. హీరో మహేశ్, హీరోయిన్ కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్‌లతో పాటు ప్రముఖ తారాగణం పాల్గొనే కీలక సన్నివేశాలతో పాటు పీటర్ హెయిన్స్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను లక్నోలో చిత్రీకరిస్తారు. ఈ చిత్రాన్ని జనవరి 11న సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతంః దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీః రవి కె.చంద్రన్.

బోయపాటి శ్రీను దర్శకత్వంలో యంగ్ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'జయజానకి నాయక'. రకుల్‌ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌లుగా నటించిన ఈ చిత్రంలో జగపతిబాబు ఓ ముఖ్య పాత్రలో నటించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా జగపతిబాబుతో ఇంటర్వ్యూ...

ఇంటర్వ్యూ


జగపతిబాబు

పరువు కోసం పాకులాడే వ్యక్తిగా నటించా

ఆ స్థాయిలో పేరు తెస్తుంది...

జయజానకి నాయక చిత్రాన్ని లెజెండ్ సినిమాతో పోల్చకూడదు. కానీ ఆ స్థాయిలో నాకు మంచి పేరు తెచ్చే చిత్రమిదని నమ్ముతున్నాను. నా కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీగా ఈ చిత్రం నిలుస్తుంది.

ఏమాత్రం రాజీపడరు...

బోయపాటి శ్రీను చాలా మంచి డైరెక్టర్. నటీనటుల నుంచి తనకేం కావాలో బాగా తెలిసిన వ్యక్తి. సినిమా క్వాలిటీ విషయంలో ఏమాత్రం రాజీపడరు. ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేవిధంగా అద్భుతంగా తెరకెక్కించారు.

మరో స్టార్ వస్తున్నాడు...

'లెజెండ్'లో నేను ఈగో ఉన్న వ్యక్తిగా నటిస్తే... జయజానకి నాయక చిత్రంలో పరువు కోసం పాకులాడే వ్యక్తిగా నటించాను. ఈ సినిమాలో హీరో పెద్దవాడా, చిన్నవాడా అని పక్కనపెడితే... బోయపాటి చేతుల మీదుగా మరో స్టార్ ఇండస్ట్రీకి వస్తున్నాడని ఖచ్చితంగా చెప్పగలను.


దర్శకుడు బోయపాటి శ్రీను

అలాంటి నిర్మాతలు అవసరం...

బోయపాటి మీద ఉన్న నమ్మకంతో నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి సినిమా మేకింగ్‌లో ఎక్కడా జోక్యం చేసుకోలేదు. సినిమా బిజినెస్ కూడా ఎక్కువే అయింది. సినిమాను ప్యాషన్‌తో తెరకెక్కించే రవీందర్ రెడ్డి వంటి నిర్మాతలు మనకు ఎంతో అవసరం. ఈ సినిమాతో బోయపాటి ఓ హీరోను, ఓ నిర్మాతను నిలబెట్టాడు.

అందువల్లే నిరాశపరిచింది...

పటేల్ సార్ సినిమా టీజర్ ఎంత పెద్ద హిట్ అయిందో అంతేలా మైనస్ కూడా అయింది. ఎందుకంటే టీజర్ చూసిన ప్రేక్షకులు సినిమా సస్పెన్స్ థ్రిల్లర్, హర్రర్ మూవీలా కాకుండా పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా ఉంటుందని భావించారు. ప్రేక్షకుల భారీ అంచనాలను అందుకోలేక సినిమా నిరాశపరిచింది. మంచి కథ వల్లే ఆ సినిమాలో హీరోగా నటించాను. ఇక నన్ను హీరోగా పెట్టి మరో నిర్మాత సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ నేను వారితో వద్దని అన్నాను.

పేర్లు బయటపెట్టకుండా ఉండాల్సింది...

సినిమావాళ్లంటే సెలబ్రిటీలు కాబట్టి డ్రగ్స్ వ్యవహారం పెద్ద న్యూస్ అయింది. అయితే విచారణ సమయంలో ఎవరి పేర్లు బయటపెట్టకుండా ఉండే బాగుండేది. కానీ ఇప్పటికీ మామూలు వాళ్ల పేర్లు బయటకు రాలేదు.

నెక్ట్స్ సినిమాలు...

ప్రస్తుతం అఖిల్ రెండో సినిమాలో నటిస్తున్నాను. అడవిశేష్ సినిమాలో నటించాల్సి ఉంది. ఇక తమిళం, కన్నడలో కూడా సినిమాలు చేస్తున్నాను.

సౌత్‌లో సత్తా చాటుతా


హ్యూమా ఖురేషి

బాలీవుడ్‌లో ఇప్పటికే పాగా వేసిన హ్యూమా ఖురేషి సౌత్‌లో అడుగుపెడుతోంది. గ్యాంగ్ ఆఫ్ వస్సీపూర్ సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కాలా' మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. రజనీతో 'కబాలి' సినిమా తీసిన పా.రంజిత్ డైరెక్షన్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. నాలుగు దశాబ్దాల క్రితం నాటి ముంబయ్ గ్యాంగ్‌స్టర్ కథ నేపథ్యంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. రజనీకాంత్ అల్లుడు ధనుష్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు నానా పటేకర్ రాజకీయ నాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. అయితే 'కాలా' వంటి లక్కీ ఆఫర్ తనకు సౌత్‌లో మంచి క్రేజ్ తీసుకువస్తుందని భావిస్తోంది హ్యూమా ఖురేషి. ఈ చిత్రం తర్వాత దక్షిణాదిన మరిన్ని మంచి అవకాశాలు వస్తాయని ఆమె ఆశపడుతోంది. 'కాలా'తో సౌత్‌లో సత్తాచాటుతానంటోంది ఈ ముద్దుగుమ్మ. అయితే హ్యూమా హిందీలో ఓ టివి షో చేయనుంది. ఈ షో పేరు 'ఇండియా 70'. కాలగమనంలో సమాజంలో గొప్ప మార్పు తెచ్చిన వ్యక్తుల నిజ జీవిత గాథలను తెలియజేసే విధంగా ఈ షోను ప్లాన్ చేశారు. ఆయా రంగాల్లో పేరొందిన వారు చేసిన కృషి, సాధించిన విజయాలను ఈ షోలో పరిచయం చేయనున్నారు.

సక్సెస్ కోసం


ప్రగ్యా జైస్వాల్

హీరోయిన్లను విజయాలు, అపజయాలు ఎప్పుడు ఎలా మలుపు తిప్పుతాయో ఎవరూ ఊహించలేరు. నువ్వు హీరోయిన్ ఎలా అవుతావు అని హేళన చేసిన అమ్మాయి కూడా అదృష్టం కలిసివస్తే స్టార్ హీరోయిన్ అయిపోతుంది. నువ్వు హీరోయిన్ కన్నా అందంగా ఉన్నావే అన్న భామ స్టార్ హీరోయిన్ కాలేదు. ఈ నేపథ్యంలో 'కంచె' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ప్రగ్యా జైస్వాల్ ఇప్పుడు మంచి విజయం కోసం బాగా కష్టపడుతోంది. ఎప్పటినుండో సక్సెస్ కోసం ఎదురుచూస్తోంది. ఇటీవల వచ్చిన 'నక్షత్రం' సినిమా ప్రగ్యాకు విజయాన్ని అందించలేకపోయింది. కంచె సినిమా తర్వాత చేసిన మిర్చిలాంటి కుర్రోడు, ఓం నమో వెంకటేశాయ, గుంటూరోడు సినిమాలు చేసినా అవి తన కెరీర్‌ను పెద్దగా బూస్టప్ చేయలేదు. అయితే కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'నక్షత్రం'పై ప్రగ్యా జైస్వాల్ పెట్టుకున్న ఆశలన్నీ ఆవిరైపోయాయి. ఈ సినిమాలో ఆమె యాక్షన్ సీక్వెన్సులు కూడా చేసింది. పోలీస్ ఆఫీసర్‌గా చేసి అదరగొట్టింది. అయితే ఇందులో ప్రగ్య మితిమీరిన అందాల ఆరబోత యువకుల మతులు పోగొట్టింది. ఈ చిత్రం గ్లామరస్ తారగా ఆమెకు క్రేజ్‌ను తెచ్చిపెట్టిందే తప్ప సక్సెస్‌ను మాత్రం అందించలేకపోయింది. అయితే ఇప్పుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో శుక్రవారం రాబోతున్న 'జయ జానకి నాయక' సినిమాపై ప్రగ్యా జైస్వాల్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఈ చిత్రంలో సెకండ్ హీరోయిన్‌గా ఆమె నటించింది. ఖచ్చితంగా ఈ సినిమా విజయాన్ని సాధించి తనకు మంచి పేరును తీసుకువస్తుందని ఆశిస్తోంది ఈ బ్యూటీ.

మొహాలు తిప్పకున్న వాళ్లంతా షేక్‌హ్యాండ్ ఇచ్చారు

రానా ప్రధాన పాత్రలో తేజ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, క్యాథరిన్‌లు కథానాయికలు. డి.సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్ రెడ్డి, సి.భరత్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు తేజ చెప్పిన సినిమా విశేషాలు...


తేజ

ఆయనను కాదనుకొని రానాతో... మొదటిసారి స్టోరీ లైన్ అనుకోగానే 'అహం' అనే టైటిల్ పెట్టి రాజశేఖర్‌కు ఈ కథ చెప్పాను. కానీ కొన్ని కారణాల వల్ల అనుకున్న కథను మార్చడం ఇష్టం లేక ఆ ప్రయత్నం మానుకున్నాను. ఆతర్వాత స్టోరీని కొంచెం డెవలప్ చేసి రానాకు చెప్పాను. ఆయన వెంటనే ఒప్పుకోవడం వలన సినిమా మొదలైంది.

'బాహుబలి-2' కంటే ముందే...'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాన్ని 'బాహుబలి2' కంటే ముందే ప్రారంభించాను. కానీ మధ్యలో ఆ సినిమా రావడం... హిట్టవడం అన్నీ జరిగిపోయాయి. ఆ సినిమా తర్వాత మళ్లీ రీ స్టార్ట్ చేసి ఈ చిత్రాన్ని పూర్తిచేశాను.

కథ బలంగా... సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. అప్పటివరకు నన్ను చూసి మొహాలు తిప్పుకున్న వాళ్లంతా దగ్గరికొచ్చి షేక్‌హ్యాండ్ ఇచ్చి బాగుందన్నారు. గత ఫెయిల్యూర్స్ అన్నీ కథలో లోపం ఉండటం వల్లే నిరాశపరిచాయి. అందుకే ఈసారి కథను బలంగా చెబుదామనుకొని ఈ సినిమా చేశాను.

మంచిని, చెడుని చూపిస్తాం... సినిమాలో రానాది నెగటివ్ పాత్ర కాదు. రెగ్యులర్ సినిమాల్లో అయితే హీరోలను పాజిటివ్‌గా మాత్రమే చూపిస్తారు. కానీ ఇందులో అలా కాదు. జోగేంద్ర పాత్రలోని మంచిని, చెడుని అన్నింటినీ చూపిస్తాం. నిజ జీవితంలో మనిషి ఎలా ఉంటాడో అలాగే ఉంటాడు.

ఆర్ట్ సినిమాల్లో పాత్రల్లా... రెగ్యులర్ సినిమాలకు ఒక మీటర్ ఉంటుంది. కానీ ఈ సినిమాకు అలా ఉండదు. అలాగని కమర్షియల్ అంశాలు లేవని కాదు. అవి కూడా ఉంటాయి. కానీ పాత్రలన్నీ ఆర్ట్ సినిమాలో పాత్రల్లా ఉంటాయి. 'చిత్రం' సినిమా ఎలా ఉంటుందో ఇది కూడా అలాగే ఉంటుంది. కథ అందరికీ తెలిసిందే. ఎప్పుడూ మన చుట్టూ జరిగేదే. కానీ తీసిన విధానం, చెప్పిన నేపథ్యం కొత్తవి.

ఆ మూడ్‌తోనే వస్తాడు... రానా చాలా తెలివైన నటుడు. స్మార్ట్‌గా ఆలోచిస్తాడు. కొంతమంది మేమే గొప్ప నటులం అని ఫీలవుతుంటారు. కానీ రానా అలా కాదు. ముందు రోజు సీన్ చెబితే దాని గురించే ఆలోచిస్తూ సెట్‌కు ఆ పాత్రలో ఉండే మూడ్‌తోనే వస్తాడు.

లీనమైపోయి నటించింది... కథ చెప్పగానే సురేష్‌బాబు... కాజల్‌తోనే ఈ సినిమా చేద్దామని అన్నారు. కాజల్ కూడా ఇప్పుడు ఎంతో మారిపోయింది. ఏ సీన్‌లోనైనా సులభంగా నటించేస్తోంది. పాత్ర గురించి చెప్పాక నాకన్నా ఎక్కువగా అందులో లీనమైపోయి నటించింది.

క్యాథరిన్ గ్లామరస్‌గా... క్యాథరిన్ పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. ఓ సీన్‌లో ఆమె సిగరెట్‌తో కనిపిస్తుంది. కాజల్, క్యాథరిన్ పాత్రలు చాలా బలంగా ఉంటాయి. క్యాథరిన్ గ్లామరస్‌గా నటించింది.

స్టార్ హీరోల జాబితాలో... ఈ సినిమాతో రానా స్టార్ హీరోల జాబితాలో చేరిపోతాడు. కాజల్‌కు కూడా మంచి పేరొస్తుంది. అలాగే సినిమాటోగ్రాఫర్, సంగీతాన్ని అందించిన అనూప్ రూబెన్స్‌కు కూడా పేరొస్తుంది.

సినిమా స్థాయి పెరిగింది... నాకు రామానాయుడితో సినిమా చేయాలని ఉండేది. కానీ కుదరలేదు. ఇప్పుడు సురేష్‌బాబుతో ఈ సినిమా చేశాను. చాలా సంతోషంగా ఉంది. ఆయన వల్ల ఈ సినిమా స్థాయి చాలా పెరిగింది.

వైవిధ్యభరిత చిత్రంలో...

సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ హీరోగా బాలీవుడ్‌లో 'చందమామ దూర్ కే' అనే మూవీ తెరకెక్కుతోంది. ఈ సైన్స్ ఫిక్షన్ మూవీలో వ్యోమగామిగా నటిస్తున్నాడు సుశాంత్ సింగ్. అయితే ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రద్ధాకపూర్‌ను తీసుకున్నారట. ముందుగా ఇందులో నటించేందుకు పలువురు కథానాయికలు నిరాకరించారు. ఎందుకంటే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాల కోసం జుట్టును కట్ చేసుకోవాల్సి వస్తుందట. పైగా ఈ సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు మరో సినిమాలో నటించే అవకాశం ఉండదు. పూర్తిగా కొన్ని నెలలపాటు ఈ సినిమాపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కొన్ని సన్నివేశాల కోసం శరీర బరువును కూడా తగ్గించాల్సి ఉంటుంది. దీంతో హీరోయిన్ క్యారెక్టర్ చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అయితే శ్రద్ధాకపూర్ 'హసీనా' చిత్రంలో ఎంతో వైవిధ్యంగా నటించింది. దీంతో 'చందమామ దూర్ కే' సినిమా కోసం శ్రద్ధ అయితే బాగుంటుందని ఫిల్మ్‌మేకర్స్ ఆమెను తీసుకున్నారు. ఇప్పటికే హీరోహీరోయిన్లపై షూటింగ్ కూడా జరుగుతోందని తెలిసింది. ఈ సినిమా కోసం నాసాలో స్పేస్ వాక్ ఎలా చేస్తారో శిక్షణ తీసుకున్నాడట హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్. ఇందులో నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్.మాధవన్ కూడా నటిస్తున్నట్లు సమాచారం.


శ్రద్ధాకపూర్

బజాజ్ ఆటో-ట్రయంప్ మోటార్ భాగస్వామ్యం



న్యూఢిల్లీ : ద్విచక్ర వాహన రంగంలో అద్భుత భాగస్వామ్యం చోటుచేసుకుంది. దేశీయ ద్విచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో సంస్థ బ్రిటీష్ దిగ్గజం ట్రియంఫ్ మోటార్‌సైకిల్‌తో అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరు సంస్థలు ఒక ప్రకటన చేశాయి. ట్రయంఫ్ మోటార్ సైకిల్స్‌తో బజాజ్ కంపెనీ ఈక్విటీ యేతర ఒప్పందాన్ని కుదుర్చుకుందని, దీనికోసం గత తొమ్మిది నెలల నుంచి చర్చలు నిర్వహించినట్టు వెల్లడించారు. దీనిలో భాగంగా మధ్యస్థాయి సామర్థ్యంగల ట్రయంప్ మోటార్ సైకిళ్లను దేశీ మార్కెట్లో బజాజ్ ఆటో అమ్మకం చేపట్టనుంది. మధ్యస్థాయి విభాగంలో ఇరుసంస్థలు ఇరు సంస్థల ఒప్పందం ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు. మోటార్ సైకిళ్లతో జతకట్టడం ద్వారా తన పోర్ట్ ఫోలియోను విస్తరించేందుకు బజాజ్ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో దుకాటి మోటార్స్‌తో తాము ఒప్పందం చేసుకవోడం లేదని, ట్రయంప్ బ్రాండ్, మోటార్ సైకిళ్లను విక్రయించడం ద్వారా తాము లబ్ధి పొందగలమని బజాజ్ ఆటో పేర్కొంది. తమ భాగస్వామ్యం ద్వారా మార్కెట్‌ను మరింత విస్తరించనున్నామని కంపెనీ వెల్లడించింది.

డొల్ల కంపెనీలపై నిషేధం

• 331 కంపెనీలు అనుమానాస్పదమైనవిగా గుర్తించిన సెబి • నెలలో ఒక్కసారి మాత్రమే ట్రేడింగ్‌కు పరిమి

న్యూఢిల్లీ : అనుమానిత డొల్ల కంపెనీల్లో ట్రేడింగ్‌పై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. దాదాపు 331 డొల్ల కంపెనీల్లో(నల్లధనం, పన్నుల ఎగవేత కోసం ఏర్పాటు చేసేవి) ట్రేడింగ్‌ను నిలుపుదల చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను ఆదేశించింది. ఈ లిస్టెడ్ కంపెనీల ట్రేడింగ్‌లో జిఎస్‌ఎం (గ్రేడెడ్ సర్విలెన్స్ మీసర్) స్టేజ్ 6 తక్షణమే అమల్లోకి వస్తుందని సెబి పేర్కొంది. ఆరో స్టేట్ కింద డొల్ల కంపెనీల్లో ట్రేడింగ్‌ను నెలలో ఒక్కసారి మాత్రమే పరిమితం చేస్తారు.. అది కూడా ట్రేడ్ నుంచి ట్రేడ్ విభాగంలో ఉంటుంది. 331 లిస్టెట్ కంపెనీలు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేకుండా ఉన్నాయని గుర్తించారు. అనుమానాస్పద కంపెనీలు భావించిన ఈ కంపెనీలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వీటిని పరిశీలించిన అనంతరం సెబీ ఈ చర్యలు చేపట్టింది. నెలలో ఒక్కసారే అది కూడా మొదటి సోమవారమే వీటిలో ట్రేడింగ్‌కు అనుమతించనున్నట్టు సంబంధిత ప్రకటనలో సెబీ పేర్కొంది. వీటిపై ఆడిట్ నిర్వహించాలని, అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించాలని సూచించింది. డొల్ల కంపెనీల జాబితాను సెబీ విడుదల చేసింది

10 వేల మార్క్ దిగువకు నిఫ్టీ

స్టాక్‌మార్కెట్ మంగళవారం భారీ నష్టాలతో ముగిసింది. ఉదయం ఆరంభంలో ఉత్సాహంగా కదలాడిన సూచీలు ఆ తర్వాత నెమ్మదిగా నష్టాల్లోకి జారుకున్నాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో చివరకు నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 259.48 పాయింట్లు నష్టపోయి 32,014.19 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ కీలకమైన 10 వేల పాయింట్ల మార్క్ దిగువకు పడిపోయింది. 78.85 పాయింట్ల నష్టంతో 9,978.55 వద్ద ముగిసింది. సెబీ చర్యలతో మార్కెట్‌లపై ప్రభావం పడింది. దీంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ , నిఫ్టీ షేర్లు పడిపోయాయి. అయితే లాభాల స్వీకరణ కూడా మార్కెట్ పతనానికి కారణని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ రంగాల్లో ప్రాఫిట్ బుకింగ్ పెరడంతో మార్కెట్‌లు నష్టాలు చవిచూశాయని అంటున్నారు. రియల్ ఎస్టేట్, ఆయిల్, గ్యాస్, పవర్, ఎనర్జీ, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్‌ఎంసిజి షేర్లతో తీవ్ర అమ్మకాల ఒత్తిడి నెలకొని.. నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో వేదాంత, హిందాల్కో, టాటాస్టీల్, సిప్లా, గెయిల్ తదితర షేర్లు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, బిపిసిఎల్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, కోల్ ఇండియా, ఎస్‌బిఐ షేర్లు నష్టాలతో ముగిశాయి.



చేనేతకు సంపూర్ణ సహకారం

• ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్

మన తెలంగాణ / హైదరాబాద్ : చేనేత పరిశ్రమను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని పరిశ్రమలు, ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధాపూర్ నోవాటెల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతివారం తప్పనిసరిగా చేనేత వస్త్రాల ధరింపజేయాలని పూనుకుందన్నారు. హ్యాండ్లూమ్ ప్రమోషన్ కౌన్సిల్ నేతృత్వంలో ఛైర్మన్ పద్మశ్రీ గజం అంజయ్య ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ అవార్డులను ప్రదానం చేశారు. ఓవెన్ 2017 కలెక్షన్ పేరిట టెక్స్‌టైల్ రివైవలిస్ట్ శైలేష్ సింఘానియా, వర్ధమాన నటి ఆదాశర్మలు నిర్వహించిన చేనేత వస్త్ర ధారణ పలువురిని ఆకట్టుకుంది.

సురేష్‌దాసును అభినందించిన రాపోలు

మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రసిడెంట్, ఫౌండర్ సురేష్ దాసును మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్‌శాఖ అభినందించి ప్రశంసాపత్రమును కూడా ఇవ్వడం పట్ల రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చేనేత వర్గాల అభ్యుదయం కోసం నిరంతరం కృషి చేస్తున్న వీవర్స్ డెవలప్‌మెంట్ సంస్థను, సురేష్ దాసును ఈ సందర్భంగా రాపోలు అభినందించారు.

నేటి నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియా సేల్ ఆఫర్లు



న్యూఢిల్లీ: అమెజాన్ ఇండియా మరోసారి ఆఫర్లతో వస్తోంది. ఆగస్టు 9 నుంచి 12వ తేదీ వరకు 'గ్రేట్ ఇండియా సేల్' పేరిట డిస్కౌంట్లను అందిస్తుందని సమాచారం. స్టేట్ బ్యాం క్ ఆఫ్ ఇండియా డెబిట్, క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు అదనంగా క్యాష్ బ్యా క్‌తో పాటు ముఖ్యమైన బ్రాండ్లపై డిస్కౌంట్లను ఇవ్వనుంది. మొబైల్ ఫోన్లు, యాక్సరీస్‌పై 40 శాతం వరకు, ఎలక్ట్రానిక్స్‌పై 50 శాతం వర కు డిస్కౌంట్లను ఆఫర్ చేయనున్నట్టు తెలిపింది. అమెజాన్ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్లపైనా గ్రేట్ ఇండియన్ సేల్‌లో డిస్కౌంట్లను ఆఫర్ చేయనుంది. ఉదాహరణకు వన్ ప్లస్ స్మార్ట్‌ఫోన్లపై రూ.2 వేల వరకు, ఎంపికచేసిన మోటోరోలా మొబైల్ ఫోన్లపై రూ.5 వేల వరకు, ఆపిల్ స్మార్ట్‌ఫోన్లపై 35 శాతం వరకు డిస్కౌంట్లను అమెజాన్ ఆఫర్ చేయనుంది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32014.19	-259.48	0.80%
నిఫ్టీ	9978.55	-78.85	0.78%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27170	29058.82	0.22%
ముంబై	27870	29807.49	0.71%
ఢిల్లీ	27450	29358.29	0.18%
కోల్‌కతా	27810	29743.32	0.14%
కేరళ	26600	28449.20	0.76%
బెంగళూరు	26550	28395.72	0%
హైదరాబాద్	27170	29058.82	0.18%
గల్ఫ్	1337.28	1430.25	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	40800.00	40600.00	0.49
ముంబై	40800.00	40600.00	0.49
ఢిల్లీ	40800.00	40600.00	0.49
కోల్‌కత్తా	40800.00	40600.00	0.49
హైదరాబాద్	40800.00	40600.00	0.49



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	321	విశాఖపట్నం	330
వరంగల్	320	చిత్తూరు	365
విజయవాడ	323	చెన్నై	372
గోదావరి	323	బెంగళూరు	360

యాక్సిస్ బ్యాంక్ సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్ల కోత



న్యూఢిల్లీ : ఎస్‌బిఐ పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గించిన కొద్ది రోజులకే యాక్సిస్ బ్యాంక్ కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. తాజాగా యాక్సిస్ సేవింగ్ ఖాతాలపై 50 బేసిస్ పాయింట్లు కోత విధించింది. దీంతో ప్రస్తుతం ఈ రేట్లు 3.5 శాతానికి తగ్గిపోనున్నాయి. రూ. 50 లక్షల లోపు డిపాజిట్లపై ఈ కొత్త రేట్లు వర్తిస్తాయి. రూ.50 లక్షలకు పైన డిపాజిట్లపై యథావిధిగా 4శాతం వడ్డీని చెల్లించనున్నట్టు ఈమేరకు రెగ్యులేటరీ ఫైలింగ్ యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది. కొత్త వడ్డీ రేట్లు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి. జులై 31న దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)తో సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్ల కోత ప్రక్రియ ప్రారంభమైంది. ఆ తర్వాత వరుసగా పలు బ్యాంకులు పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ వస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరో కూడా రూ.50 లక్షల వరకు డిపాజిట్లపై వడ్డీ రేటును 3.5 శాతానికి తగ్గించింది. కర్నాటక బ్యాంక్ కూడా పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు కోత నిర్ణయం తీసుకుంది. తాజాగా దేశంలో నాలుగో అతిపెద్ద ప్రైవేటు బ్యాంక్ యాక్సిస్ కూడా ఇదే విధానాన్ని అనుసరించింది.

సెంచరీ టెక్స్‌టైల్స్‌కు భారీ లాభాలు

న్యూఢిల్లీ: సెంచరీ టెక్స్‌టైల్స్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ క్యూ1(ఏప్రిల్–జూన్) ఫలితాల్లో భారీ లాభాలను నమోదు చేసింది. అంచనాలను మించి కంపెనీ లాభాలన నమోదు చేయడంతో ఎక్స్ఛేంజ్‌లో షేరు జోష్‌ను చూపింది. మంగళవారం కంపెనీ షేరు ధర 5 శాతం పెరిగి రూ.1286 వద్ద ట్రేడయింది. ధర రూ.1291 వద్ద జీవిత కాల గరిష్టస్థాయిని చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ 1 ఫలితాల్లో కంపెనీ నికర లాభం రూ.120.24 కోట్లను ఆర్జించగా, గతేడాది ఇదే సమయంలో కంపెనీ లాభం రూ.6.46 కోట్లు మాత్రమే ఉండడం గమనార్హం. కంపెనీ మొత్తం ఆదాయం రూ. 2,342.76 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ. 2,320.34 కోట్లను ఆర్జించింది. ప్రభుత్వ గ్రాంట్స్ విడుదల ద్వారా భవిష్యత్‌లో వచ్చే ఆదాయం పెరగుతుందని కంపెనీ అంచనా వేసింది. ఇలా పెరిగే ఆదాయం సుమారురూ.28.46 కోట్లు ఉండొచ్చని కంపెనీ భావిస్తోంది. కంపెనీకి నిర్వహణ ఖర్చు గతేడాదితో పోలిస్తే 6.43 శాతం తగ్గి రూ. 2159.46 కోట్లకు చేరింది.

నైపుణ్యంతో మంచి భవిత

• గీతం ప్రొ విసి ఎన్. శివప్రసాద్

మనతెలంగాణ/ హైదరాబాద్ : నైపుణ్యంమే బంగారు భవితకు బాట అని గీతం విశ్వవిద్యాలయం ప్రొ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో టెక్ ట్రంక్ వెంచర్స్ సౌజన్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ విసి మాట్లాడుతూ, పరిశ్రమలో మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయని, విద్యార్థులు ఆ మార్పులను అవగతం చేసుకుని వృత్తి నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. టెక్ ట్రంక్ వెంచర్స్ సాంకేతిక నిపుణులు అన్ను పాండే మాట్లాడుతూ కృత్రిమ మేథపై నైపుణ్యం సాధిస్తే మంచి ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు.

కృత్రిమ మేథతో రోబోలకు రూపకల్పన చేస్తున్న దశలో కార్యశాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం ముదావహమని, ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ టెక్నాలజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ సంజయ్ సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.ఈశ్వరయ్య అతిథులను స్వాగతించగా, కార్యక్రమ సమన్వయకర్త సిహెచ్.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు.

బెంగళూరులో లెక్సస్ నాలుగో సెంటర్

మన తెలంగాణ / హైదరాబాద్ : విలాసవంతమైన వాహన తయారీ సంస్థ లెక్సస్ బెంగళూరులో నాలుగో షో రూంను ప్రారంభించుకున్నట్లు వెల్లడించింది. ఢిల్లీ, ముంబై, గుర్‌గావ్‌లో ఇప్పటికే గెస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు తమకు ఉన్నాయని ఇది నాల్గో కేంద్రమని లెక్సస్ ఇండియా సీనియర్ వైస్ ప్రసిడెంట్ అకితోషి తకెమురా తెలిపారు. శరవేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లకు నూతన అద్భుత అనుభూతులను అందించేందుకు లెక్సస్ కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు.

రూ. 10 కోట్లతో ఎంఎస్‌ఎంఇ క్లస్టర్లు

● కేంద్ర సహకారంతో రాష్ట్రంలో ఏర్పాటు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టిఎస్ఐఐసి) రాష్ట్రంలో 10 ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లను ఏర్పాటు చేయిస్తోంది. ఫార్మా రంగంలో ఏర్పాటు చేయనున్న క్లస్టర్‌ల కోసం కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.8 కోట్లు ఇవ్వనుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు కోట్లను కలిపి మొత్తం 10 కోట్లతో ఎంఎస్‌ఎంఇలో నూతన క్లస్టర్ ఏర్పాటు, పాతవాటి పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకుంటోంది. మొత్తంగా ప్రైవేటు రంగంలో ఐదు కొత్త క్లస్టర్లు, ప్రభుత్వ రంగంలో టిఎస్ఐఐసి ఆధ్వర్యంలో ఐదు క్లస్టర్ల పునరద్దురణకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రైవేటు రంగ భాగస్వామ్యంలో..

ప్రైవేటు రంగంలో రానున్న క్లస్టర్లలో ఒఎఫ్‌సి ఫైబర్ క్లస్టర్ (రావిరాల), కోన్ ఆటోమోటివ్ పార్కు(జీడిమెట్ల), ఫైబర్ గ్లాస్ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఇబ్రహీంపట్నం సమీపంలోని రావ్‌కోల్, ఐటి క్లస్టర్ ను మనికొండలో ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం రంగంలో కొత్త క్లస్టర్లను ఏర్పాటు చేయడం కంటే కూడా ఇప్పటికే ఉన్న వాటిని పునరుద్ధరించి లెటెస్ట్ టెక్నాలజీని వినియోగించుకునేలా వాటిని తీర్చిదిద్దాలని టిఎస్ఐఐసి నిర్ణయించింది. ఈ క్రమంలో సిద్దిపేట, వికారాబాద్‌లలోని టిఎస్ఐఐసి క్లస్టర్లను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు కొత్తగా మరో 40 ఎకరాల స్థలంలో వీటిని విస్తరించనున్నారు. మెదక్ జిల్లా ములుగు మండలం బండమైలారంలో ఉన్న సీడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రిని కూడా అభివృద్ధి చేయాలని టిఎస్ఐఐసి నిర్ణయించింది. ఐదోది నల్గొండ జిల్లాలో ఖాయిలా పడిన సంస్థలను అధ్యయనం చేయించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు టిఎస్ఐఐసి ఉన్నతాధికార వర్గాలు మన తెలంగాణకు తెలిపాయి.

శాఖాహారంతో రూ.10 కోట్లు ఆదా

న్యూఢిల్లీ: అప్పుల్లో కూరుపోయిన ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఖర్చులను తగ్గించుకునే పనిలో భాగంగా ఇటీవల ఎకానమీ క్లాస్‌లో మాంసాహారం భోజనాన్ని రద్దు చేసింది. అయితే దీని వల్ల సంస్థకు వార్షికంగా రూ.8–10 కోట్లు ఆదా కానున్నాయని కేంద్రం ప్రకటించింది. ఈమేరకు పార్లమెంట్‌లో కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా తెలిపారు. దేశీయ విమానాల్లో ఎకానమీ క్లాసులో మాత్రమే మాంసాహారం భోజనం రద్దు చేశామని, దీనివల్ల ఖర్చులు తగ్గుతాయని అన్నారు. కాగా ఎకానమీ క్లాస్ ప్రయాణికులకు మాంసాహారం వడ్డించబోమని, కేవలం శాకాహారం మాత్రమే అందిస్తామని ఎయిర్ ఇండియా కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. అంతర్జాతీయ విమానాల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేసింది. ఎయిరిండియాకు రూ. 52వేల కోట్ల వరకు అప్పులున్నాయి. దీంతో సంస్థను ప్రైవేటీకరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎయిరిండియాను కాపాడుకునేందుకు ఉద్యోగులు ఖర్చు తగ్గింపు ప్రణాళికలను యాజమాన్యం దృష్టికి తీసుకురావడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.

అమరరాజా లాభం డౌన్

న్యూఢిల్లీ: అమరరాజా బ్యాటరీస్ నికరలాభం క్షీణించింది. జూన్ త్రైమాసికంలో లాభం 23 శాతం తగ్గి రూ.100 కోట్లకు చేరింది. క్రితం ఏడాదిలో ఈ లాభం రూ.130.66 కోట్లుగా ఉంది. కంపెనీ టర్నోవరు 15 శాతం అధికమై రూ. 1,685 కోట్లు నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో ఆటోమోటివ్ బ్యాటరీ వ్యాపారం కంపెనీకి కలిసొచ్చింది. ఆటోమోటివ్ ఎగుమతులు, ఇన్వర్టర్ బ్యాటరీ విక్రయాలు పెరగడంతో ప్లాంట్ల వినియోగం అదే స్థాయిలో అధికమైందని తెలిపింది. మంగళవారం బిఎస్‌ఇపై షేరు విలువ 2.51 శాతం పడిపోయి రూ.800.60కు చేరుకుంది.

రెండు అధికార కేంద్రాలవల్ల వైదొలగలేదు



• నా పదవీకాలం ఎంతో తెలియదు : అరవింద్ పనగారియా

న్యూఢిల్లీ : నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా తన పదవి కాలం ఎంత వరకు అనేది తెలియదని అరవింద్ పనగారియా వెల్లడించారు. వైస్‌ఛైర్మన్ పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేసిన అరవింద్ పనగారియా అమెరికా బోధన చేపట్టనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన అనూహ్య రాజీనామా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రెండు అధికార కేంద్రాల కారణంగా నీతి ఆయోగ్‌లో కీలక పదవి నుంచి వైదొలగినట్టు వచ్చిన పుకార్లను ఆయన కొట్టిపారేశారు. పిటిఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 64 ఏళ్ల పనగారియా మాట్లాడుతూ, పాశ్చాత్య యూనివర్శిటీల పనితీరు ఆకర్షించిందని, కొలంబియా వర్శిటీకి వెళ్లాలని నిర్ణయించున్నానన్నారు. 2019 వరకు నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్‌గా కొనసాగాలని ప్రధానమంత్రి కార్యాలయం(పిఎంఒ) కోరినప్పటికీ తాను విద్యా బోధనకే మొగ్గుచూపానని అన్నారు. 2015లో ఈ కీలక పదవిలో నియమించినప్పుడు ఉపాధ్యాయ వృత్తికి తిరిగి వెళ్తానని ప్రభుత్వానికి చెప్పలేదని ఆయన వివరించారు. అయితే నీతి ఆయోగ్ కీలక పదవిలో ఎంతకాలం కొనసాగాలో చెప్పలేదని, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిన తర్వాత నియామకానికి అంగీకరించానని పనగారియా తెలిపారు. ఫోన్ చేసినప్పుడు వైస్ ఛైర్మన్‌గా నియమిస్తున్నామని అన్నారని, తాను ఓకే చెప్పానని అన్నారు. కొత్తగా నీతి ఆయోగ్ ఏర్పాటు, కీలక పదవిలో నియామకం జరిగాయని, అయితే ద్వంద్వ అధికార కేంద్రాల వల్ల విభేదాలు వచ్చాయనేది వాస్తవం కాదని ఆయన కొట్టిపారేశారు. ఏ సంస్థ అయినా రెండు లేదా అంత కంటే ఎక్కువ అధికార కేంద్రాలతో నడవలేదని, అక్కడ ఒకటే అధికార కేంద్రం ఉందని అన్నారు. ఒకప్పటి ప్రణాళికా సంఘం ఇప్పుడు నీతి ఆయోగ్ మారింది. కాగా పనగారియా వైదొలగిన కొద్ది రోజులకు నీతి ఆయోగ్ కొత్త వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ రాజీవ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. పనగారియా తప్పుకుంటున్నట్టు ప్రకటించిన ఐదు రోజుల తరువాత ఆయన స్థానంలో రాజీవ్‌ను నియమించారు. ఆగస్టు 31న తాను విద్యావేత్తగా తిరిగి కొలంబియా యూనివర్సిటీ వెళ్లనున్నట్టు పనగారియ తెలిపారు. అయితే నీతి ఆయోగ్‌లో సభ్యుడిగా డాక్టర్ వినోద్ పాల్‌ను నియమించిన ప్రభుత్వం, ఆయన్ను ఎయిమ్స్‌లో శిశు వైద్యుడిగా కూడా నియమించిందని సమాచారం. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో రాజీవ్ కుమార్ పట్టా పొందారు. అలాగే లక్నో యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టాను కూడా పొందడమే కాకుండా సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సిపిఆర్)లో సీనియర్ పరిశోధకుడిగా పనిచేశారు. ఇటీవల, ఎఫ్ఐసిసిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రాజీవ్, ఇండియన్ కౌన్సెల్ ఫర్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ (ఐసిఆర్ఐఇఆర్)లో కూడా సేవలందించారు. 2006 నుంచి 2008 వరకు జాతీయ భద్రతా సలహాదారు బోర్డులో సభ్యుడిగా ఉన్నారు. సిఐఐ ప్రధాన ఆర్థికవేత్తగా కూడా సేవలందించారు.


నితీశ్ రాజకీయ సమాధిని తవ్వుకున్నారు : లాలూ



పాట్నా: ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మహాకూటమి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి బిజెపితో చేతులు కలపడం వల్ల నితీశ్ తనకు తాను రాజకీయ సమాధిని తవ్వుకున్నారని మండిపడ్డారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నితీశ్ కుమార్‌ను దేశంలో ఇక ఏ పార్టీ కూడా విశ్వసించబోదని, ఆయన రాజకీయ శకం ముగిసినట్లేనన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జెడి(యు) రెండు సీట్లకన్నా ఎక్కువగా గెలుచుకోలేదని లాలూ చెప్పారు. రాష్ట్రంలో బిజెపి, ఎన్‌డిఎకు ఉన్న ప్రస్తుత సీట్లను వచ్చే ఎన్నికల్లో నితీశ్ కోసం వదులుకోవని ఆర్‌జెడి చీఫ్ పేర్కొన్నారు. బీహార్ ముఖ్యమంత్రి తనకంటే పరిపక్వతగల వ్యక్తి అని అనుకున్నాను, కానీ అది తప్పని నిరూపితమైందని, అందుకు తాను చింతిస్తున్నానన్నారు. ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీపై కూడా లాలూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆగస్టు 27న ఆర్‌జెడి నిర్వహించ తలపెట్టిన ర్యాలీకి నిధులు ఇవ్వాలని ఇసుక మాఫియా డిమాండ్ చేశారని సుశీల్ మోడీ చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ర్యాలీ నిర్వహించేందుకు తాము వారి నుంచి నయా పైసా కూడా తీసుకోలేదన్నారు.

ఆమె నా కూతురులాంటిది

హర్యానా బిజెపి చీఫ్ సుభాష్ బరాల



చండీగఢ్: ఓ మహిళను తన కుమారుడు వేధించాడన్న ఆరోపణపై మంగళవారం హర్యానా బిజెపి చీఫ్ సుభాష్ బరాల చివరికి మౌనం వీడారు. బాధితురాలు తన కూతురు వంటిదని, ఈ విషయంలో పోలీసులపై తన నుంచి, తన పార్టీ నుంచి గానీ ఎలాంటి వత్తిడిలేదన్నారు. మహిళ వేధింపు ఘటన తరువాత రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు బరాలపై దాడిచేశాయి. నైతికంగా బాధ్యతవహిస్తూ రాజీనామా చేయాలని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్‌ఎల్‌డి) ఆయనను కోరింది. తన కుమారుడు వికాస్, అతడి మిత్రుడు ఆశిష్ ప్రమేయం ఉందన్న కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతున్నదని బరాల అన్నారు. చండీగఢ్ పోలీస్‌లపై బిజెపి ఒత్తిడి చేస్తున్నదన్న ప్రతిపక్షాల వాదనను ఆయన ఖండించారు. ఈ విషయంలో తన నుంచి లేదా తన పార్టీ(బిజెపి) నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని అన్నారు.

ముంబయిలో మోడల్‌కు వేధింపులు

కారుతో వెంబడించి ఇంటి తలుపుతట్టిన ఇంజినీర్



ముంబయి: హర్యానా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తెకు బిజెపి నేత కుమారుడు వేధించిన ఘటన మరవకముందే ముంబయిలో మరోకటి చోటుచేసుకుంది. ఫ్యాషన్ డిజైనర్ అదితి నాగ్‌పాల్ ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో పిల్లలు, సోదరితో పాటు కారులో వెళతోంది. ఆమెను మలాడ్‌కు చెందిన నితిన్ శర్మ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కారుతో వెంబడించాడు. ఆమె ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే తలుపుతట్టాడు. తనకు దాహంగా ఉందని చెప్పడంతో వెంటనే ఆమె తిట్టి పంపింది. కొద్దిసేపటికే వాచ్‌మెన్‌తో వెళ్లి సదరు వ్యక్తిని 'ఇంటికెందుకొచ్చావ్' అంటూ ప్రశ్నించింది. 'దాహంగా ఉంది... అందుకే వచ్చా. ఇంకా ఏ ఉద్దేశం లేదు' అంటూ సమాధానమివ్వడంతో వాచ్‌మెన్ సెల్‌ఫోన్‌లో వ్యక్తి ఫోటోలను చిత్రీకరించారు. ఆ తర్వాత పోలీసులకు మోడల్ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంజనీర్‌ను అరెస్ట్ చేశారు.

బిజెపి చీఫ్‌గా అమిత్ షాకు మూడేళ్లు



న్యూఢిల్లీ: బిజెపి అధ్యక్షుడిగా అమిత్ షా బుధవారం మూడేళ్ల పూర్తి చేసుకుంటున్నారు. ఆయన హయాంలో పార్టీ త్వరగా విస్తరించింది. గోవా, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలను కూడా బిజెపి హస్తగతం చేసుకుంది. మోడీ మాస్ అప్పీల్, అమిత్ షా వ్యూహం బిజెపిని పటిష్టం చేశాయి. అమిత్ షా నేతృత్వంలో బిజెపి ఉత్తరప్రదేశ్‌లో భారీ మెజారిటీతో గెలుపొందింది. ఆ రాష్ట్రానికి చెందిన 80 లోక్‌సభ స్థానాల్లో 73 గెలుచుకుంది. గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా మొదటిసారి అమిత్ షా పోటీపడుతున్నారు. బీహార్, ఢిల్లీలో మాత్రం బిజెపి ఓటమిని చవిచూసింది. కానీ అసోం, హర్యానా, జమ్మూ కశ్మీర్‌లలో తొలిసారిగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ వంటి పార్టీ వ్యవస్థాపకుల దార్శనికతకు అనుగుణంగా అమిత్‌షా పనిచేశారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు బిజెపిని విస్తరించారు. ఒడిశా, కేరళ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలలో సైతం ఆయన నేతృత్వంలో బిజెపి ఓట్ల శాతాన్ని పెంచుకుంది. అమిత్ షా ఆధ్వర్యంలో 11 కోట్ల మంది సభ్యత్వాన్ని నమోదు చేసుకుని బిజెపి ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా గుర్తింపు పొందింది.

యాంట్రిక్స్ కేసులో దేశాలకు అభ్యర్థనలు

న్యూఢిల్లీ: యాంట్రిక్స్ దేవాస్ ఒప్పందంలో అవినీతి ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా సిబిఐ నాలుగు దేశాలకు న్యాయ అభ్యర్థనలు పంపింది. దేవాస్ మల్టీ మీడియా, దాని మాతృ సంస్థ వివరాలు, సింగపూర్, మలేషియా రూటు ద్వారా పెట్టుబడులు పెట్టిన ఆర్థిక వాస్తవాలు, ఇతర సమాచారం సిబిఐ తెలుసుకునేందుకు ఈ అభ్యర్థనలు పంపింది. (ఫ్రాన్స్), అమెరికా, మారిషస్, సింగపూర్ దేశాలకు న్యాయ అభ్యర్థనలు(లెటర్స్ రొగేటరీ) పంపినట్లు సిబిఐ వర్గాలు వెల్లడించాయి. సింగపూర్‌లో ఉన్న కంపెనీ, మారిషస్‌లో ఉన్న మూడు కంపెనీల ద్వారా దేవాస్ మల్టీమీడియా ప్రై.లి లో దాదాపు 130 మిలియన్ల డాలర్లను పెట్టుబడిగా పెట్టిన విషయంపై సిబిఐ నిఘా పెట్టింది.

కుమార్తెపై మరుగుతున్న టీ

థానే: కుమార్తెపై మరుగుతున్న టీని పోసి గాయాలకు కారణమైన తండ్రిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఇది. భీవండికి చెందిన రవీంద్ర జోషి (40) భార్య, ముగ్గురు కుమార్తెలతో జీవిస్తున్నాడు. ఎలాంటి ఉద్యోగం లేని జోషి తరచూ కుటుంబ సభ్యులతో గొడవలు పెట్టుకుంటున్నాడు. పెల్హార్ వైద్య చికిత్స చేయించడం లేదన్న ఆగ్రహంతో మంగళవారం ఉదయం తన చిన్న కుమార్తెపై మరుగుతున్న టీని పోసాడు. దీంతో ఆమెకు కాలిన గాయాలయ్యాయి. కుమార్తె ఫిర్యాదు మేరకు జోషిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు నర్పోలి పోలీసులు తెలిపారు.

పడవ బోల్తా, ఆరుగురు గల్లంతు

జైపూర్: రాజస్థాన్‌లో ఓ పడవ మునిగిన ఘటనలో ఆరుగురు గల్లంతయ్యారు. జలావర్ జిల్లాలో పర్వన్ నదిలో మంగళవారంనాడు ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో పడవలో 15మంది ఉన్నారు. వారిలో నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు, మిగతావారిని ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసు బృందాలు కాపాడాయని పోలీసులు తెలిపారు. గల్లంతైన వారిని కాపాడేందుకు వివిధ ప్రదేశాలలో రక్షక బృందాలను ఏర్పాటు చేసి వెతుకుతున్నట్లు జలావర్ కలెక్టర్ జితేంద్ర కుమార్ విలేకరులకు తెలిపారు. నీటి ప్రవాహం తీవ్రంగా ఉండడం వల్లే పడవ బోల్తా కొట్టిందని జలావర్ ఎస్‌పి శర్మ అన్నారు.

పశ్చిమబెంగాల్‌లో రోడ్డు ప్రమాదం

క్రిష్ణానగర్: పశ్చిమబెంగాల్‌లోని నాడియా జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 8 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందగా, 36 మందికి గాయాలయ్యాయి. క్రిష్ణానగర్ నుంచి పలాస్సే పారాకు వెళ్తుండగా బస్సు అదుపుతప్పి మురికికాలువలోకి దూసుకెళ్లడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు నాడియా జిల్లా మెజిస్ట్రేట్ సుమిత్ గుప్తా వెల్లడించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తెహట్ట, క్రిష్ణానగర్ ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు జిల్లా మెజిస్ట్రేట్ గుప్తా తెలిపారు.





మంగళవారం ఢిల్లీలోని తాల్‌కటోరా స్టేడియంలో జాతీయ కార్మిక సంఘాల సదస్సు దృశ్యం

నిరవధిక సమ్మెకు సిద్ధంకండి

- నవంబర్‌లో మూడు రోజుల పాటు పార్లమెంట్ వద్ద ధర్నా
- జాతీయ కార్మిక సంఘాల నిర్ణయం

న్యూఢిల్లీ: వివిధ కేంద్ర వర్తక సంఘాలు దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాయి. తొలుత నవంబర్ 9, 10, 11 తేదీల్లో ఇక్కడ పార్లమెంట్ స్ట్రీట్‌లో లక్షలాది మంది కార్మికులు ధర్నా చేపట్టనున్నారు. ఆ తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నిరవధిక సమ్మెను ప్రారంభిస్తారు. ఇక్కడ తాల్‌కటోరా స్టేడియంలో మంగళవారం జరిగిన కార్మికుల జాతీయ సదస్సులో వర్తక సంఘాల నాయకులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సదస్సులో అమర్‌జీత్ కౌర్ (ఎఐటియుసి), తపన్ సేన్ (సిఐటియు), జి.సంజీవ రెడ్డి (ఐఎన్‌టియుసి) లాంటి జాతీయ వర్తక సంఘాల నాయకులు పాల్గొన్నారు. డాక్టర్.కె.హేమలత (సిఐటియు), రమేంద్ర కుమార్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి) సహా పలు వర్తక సంఘాల నేతలు అధ్యక్షత వహించారు. సదస్సు సందర్భంగా వర్తక సంఘాల నాయకులు ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి వర్తక సంఘాల ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని నాయకులు ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. కనీస వేతనాలు, సామాజిక భద్రత, కార్మికులకు హోదా, పథకంలోని కార్మికులకు చెల్లింపులు, సదుపాయాల కల్పన, ప్రైవేటీకరణ ప్రయత్నాల ఉపసంహరణ లాంటివి వర్తక సంఘాల ప్రధాన డిమాండ్లు. మరోవైపు వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వారు తీవ్రంగా విమర్శించారు. దేశంలో నానాటికీ పెరిగిపోతోన్న మత, కులపరమైన హింస, ఘర్షణ ఒరవడిని కూడా నాయకులు ఖండించారు. కాగా, నవంబరులో దేశ రాజధాని నగరంలో ధర్నా చేపట్టడానికి ముందుగా బ్లాకులు, జిల్లాలు, పారిశ్రామిక కేంద్రాలు, రాష్ట్రాల స్థాయిల్లో భారీ స్థాయి ప్రచారోద్యమాలు చేపట్టాలని వర్తక సంఘాలు ఈ సదస్సు సందర్భంగా తీర్మానించాయి.

సిజెఐగా దీపక్ మిశ్రా



న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తిగా(సిజెఐ) జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారంనాడు న్యాయశాఖ ఒక ప్రకటన చేసింది. ప్రస్తుతం చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జస్టిస్ జెఎస్ ఖేహార్ పదవీకాలం ఈ నెల 27వ తేదీతో ముగియనుంది. అదే రోజు దీపక్ సిజెఐగా బాధ్యతలు చేపడతారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, సర్వీస్ మరియు సేల్స్ టాక్స్ అంశాలలో దీపక్‌కు ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉంది. మిశ్రా గతంలో ఒరిస్సా, మధ్యప్రదేశ్ హైకోర్టులలో పనిచేశారు. డిసెంబర్ 19, 1997 సంవత్సరంలో ఆయన శాశ్వత జడ్జిగా నియమితుల య్యారు. పాట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా 2009లో బాధ్యతలు చేపట్టారు. 2010 సంవత్సరంలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2011 సంవత్సరం అక్టోబర్ 10న ఆయనకు సుప్రీం న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది.

మందిరానికి సమీపంలో మసీదు

అయోధ్య కేసులో సుప్రీంకు షియా బోర్డు నివేదన

న్యూఢిల్లీ: యుపిలోని అయోధ్య జిల్లాలో ఉన్న రామ జన్మభూమికి సమీపంలోనే మసీదు నిర్మాణాన్ని చేపట్టాలని షియా కేంద్ర వక్ఫ్ బోర్డు (ఎస్‌సిడబ్ల్యుబి) మంగళవారం సుప్రీంకోర్టుకు ఒక అఫిడవిట్ సమర్పించింది. ఎఎన్‌ఐ వార్తా సంస్థ కథనం ప్రకారం, అయోధ్యలోని శ్రీరామ్ లాలా జన్మభూమి నుండి సహేతుకమైన దూరంలో ముస్లిం ప్రాబల్య ప్రాంతంలోనే మసీదును నిర్మించవచ్చని షియా బోర్డు తెలిపింది. బాబ్రీ మసీదు తమ ఆస్తి అని ఎస్‌సిడబ్ల్యుబి పేర్కొంది. అందువల్ల బాబ్రీ మసీదు–రామాలయ స్థల వివాదం కేసులో ఇతర భాగస్వామ్య పక్షాలతో ఒక శాంతియుతమైన పరిష్కారాన్ని సాధించే దిశగా జరిపే చర్చలకు తామే అర్హమైన వాళ్లమని బోర్డు చెప్పుకొచ్చింది. అంతేకాక ఈ వివాదానికి ఒక ఆమోదయోగ్య పరిష్కారాన్ని కనుగొనేలా కమిటీ ఏర్పాటుకు తమకు కొంత సమయమివ్వాలని కూడా అత్యున్నత న్యాయస్థానాన్ని బోర్డు కోరింది. ఈ వివాదంలో షియా వక్ఫ్ బోర్డు జోక్యం చేసుకోవడం తనకు తెలిసి దైవాదీనమని బిజెపి ఎంపి సుబ్రమణ్యస్వామి అన్నారు. బాబ్రీ మసీదు కార్యాచరణ కమిటీ తరపు న్యాయవాది జఫర్‌యాబ్ జిలానీ మాట్లాడుతూ.. ఈ వివాదంలో షియా బోర్డు దాఖలు చేసిన పిటిషన్ ఒక విజ్ఞప్తి మాత్రమేనని, దానికి చట్టంలో ఎలాంటి విలువ లేదని ఆయన అన్నారు. ఈ కేసును సుప్రీంకోర్టు త్రిసభ ధర్మాసనం ఈ నెల 11 నుండి విచారించనున్న నేపథ్యంలో షియా బోర్డు తాజాగా పిటిషన్ సమర్పించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

62 శాతం కుటుంబాలకు టాయిలెట్ సదుపాయం



న్యూఢిల్లీ : గ్రామీణ భారతావనిలో 62 శాతానికి పైగా కుటుంబాలకు టాయిలెట్ల సదుపాయముందని తాజా సర్వే ఒకటి వెల్లడించింది. ఈ ఏడాది జూన్ వరకు, టాయిలెట్ల వినియోగం 91 శాతం వరకు ఉందని కూడా సదరు సర్వే తెలిపింది. కేద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద ఈ డేటాని విడుదల చేయడానికి క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ) ఈ సర్వే చేపట్టింది. దేశవ్యాప్తంగా 4626 గ్రామాల్లోని 1.4 లక్షల కుటుంబాలను సర్వే చేశారు.'ఈ ఏడాది మే–జూన్ మధ్యకాలంలో ఈ సర్వేని నిర్వహించాం. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సగటున 62.45 శాతం కుటుంబాలకు టాయిలెట్ల సదుపాయముంది. ఈ ఏడాది జూన్ నెల వరకు, 91.29 శాతం టాయిలెట్లను వినియోగిస్తున్నారు' అని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఇక్కడ విలేకరులకు తెలిపారు. 'అధికారిక డేటా ప్రకారం, సగటున 63.73 శాతం కుటుంబాలకు టాయిలెట్ల సదుపాయముంది. ఈ రకంగా చూస్తే, మా డేటాతో క్యూసిఐ సర్వే డేటా దగ్గరగా ఉంది. స్వచ్ఛభారత్ మిషన్ కింద సాధించిన పురోగతికి ఇది సాక్షీభూతంగా నిలుస్తోంది' అని ఆయన చెప్పారు. తాజా సర్వే డేటా నేపథ్యంలో, అక్టోబరు 2, 2019 కల్లా యావద్దేశాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా మార్చాలన్న లక్ష్యాన్ని చేరుకోగలమన్న విశ్వాసం ప్రభుత్వానికి ఉందని ఆయన చెప్పారు.

'370'పై మూడు వారాల్లోగా వివరణ

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న రాజ్యాంగంలోని 370 అధికరణను సవాలు చేసే పిటిషన్‌ను కొట్టివేస్తూ ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ వచ్చిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వ స్పందనను సుప్రీంకోర్టు మంగళవారం నాడు కోరింది. ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ సారథ్యంలోని బెంచ్ ఈ మేరకు కేంద్రానికి నోటీసు జారీ చేసింది. 3 వారాల్లోగా జవాబు ఇవ్వాలని కోరింది. ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 11న 370 అధికరణను సవాలు చేసే అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ అంశంలో సుప్రీంకోర్టు ఈ సరికే పిటిషన్‌ను కొట్టివేసినందున కొత్తగా పిటీషన్ వేయడంలో అర్థం లేదని పేర్కొంది. హైకోర్టు ఎదుటకు తెచ్చిన అంశం సుప్రీంకోర్టు ఎదుట ఉన్న అంశం కాదని, అది వేరు అని పిటిషన్ దాఖలు చేసిన కుమారి విజయలక్ష్మి ఝా హైకోర్టులో పేర్కొన్నారు. 1857లో రాజ్యాంగ ధర్మాసనం రద్దు కావడంతో తాత్కాలిక అధికరణ అయిన 370 ఆర్టికల్ కూడా రద్దు అయిపోయిందని ఆమె వాదించారు. భారత రాష్ట్రపతిగాని, పార్లమెంట్‌గాని ఎన్నడూ ఆమోదించలేదని అందువల్ల ఆ అధికరణ కొనసాగింపు రాజ్యాంగ మౌలిక రూపాన్ని దెబ్బతీయడమేనని కూడా ఆమె వాదించారు. 2014 జూలైలో సుప్రీంకోర్టు జమ్ము కశ్మీర్ ప్రత్యేక హోదాను సవాలు చేసే పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టుకు అపీల్ చేసుకోవాలని కూడా పిటిషనర్‌కు అప్పుడు సూచించింది.



యోగా తప్పనిసరి మా పనికాదు

న్యూఢిల్లీ: జాతీయ యోగా విధానాన్ని రూపొందించాలని కోరే అపీల్‌ను సుప్రీంకోర్టు మంగళవారం నాడు తోసిపుచ్చింది. దేశ వ్యాప్తంగా విద్యార్థులకు యోగా తప్పనిసరి చేయాలని కూడా ఆ పిటిషన్‌లో కోరారు. జస్టిస్ ఎం.బి లోకూర్ సారథ్యంలోని బెంచ్ ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆ నిర్ణయం తీసుకోవలసింది ప్రభుత్వమని వ్యాఖ్యానించింది. 'పాఠశాలల్లో ఏమి బోధించాలో చెప్పాల్సింది మేము కానేకాదు అది మాపని అసలే కాదు. అటువంటి ఆదేశం మేము ఎలా ఇవ్వగలం' అని బెంచ్ వ్యాఖ్యానించింది. స్కూళ్లల్లో ఏమి బోధించాలన్నది ప్రాథమిక హక్కు కాదని కూడా వివరించింది. పిటిషనర్లు అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్, ఢిల్లీ బిజెపి ప్రతినిధి జెసి శేఠ్ కోరిన విధంగా ఉత్తర్వు చేయడం తమ శక్యం కాదని బెంచ్ పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖను, ఎన్‌సిఇఆర్‌టిని, సిబిఎస్‌సిని యోగా అంశంపై పాఠ్యపుస్తకాలు రూపొందించవలసిందిగా ఆదేశించాలని ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో కోరారు. 18వ తరగతి విద్యార్థులకు 'యోగా ఆరోగ్య విద్య' ను తప్పనిసరి చేయాలని కూడా కోరారు.

రాజ్యసభ ఫలితంపై ఉత్కంఠ





పోటాపోటీగా ఇసిని కలిసిన కాంగ్రెస్, బిజెపి

అహ్మదాబాద్: గుజరాత్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు ప్రశాంతంగా పోలింగ్ ముగిసినప్పటికీ ఫలితాల విడుదలపై ఉత్కంఠ నెలకొంది. మంగళవారంనాడు సాయంత్రం 5గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా కాంగ్రెస్ సభ్యులు ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ కౌంటింగ్ జరిగేందుకు వీల్లేదని ఎన్నికల కమిషన్‌కు ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలు రాఘవ్‌జి పటేల్, భోలా గోహిల్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఓటింగ్ వేసే సమయంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరికి ఓటు వేస్తున్నామనేది చెబుతూ తమ బ్యాలెట్ పేపర్లను బిజెపి ఏజెంట్‌కు చూపించారని, ఆ ఇద్దరి ఓట్లను రద్దు చేయాల్సిందిగా కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇదే డిమాండ్‌తో విడతల వారీగా ఇసిని కలిశారు. దాంతో కౌంటింగ్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన బిజెపి నేతలు కూడా ఎన్నికల సంఘాన్ని పలు మార్లు కలిశారు. కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, నిర్మలా సీతారామన్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తదితరులు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ అధికారులంతా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని, వెంటనే ఫలితాలను విడుదల చేయాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. తమకు ఎన్నికల సంఘంపై విశ్వాసం ఉందని ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ తన గెలుపుఖాయమని అన్నారు. పోలింగ్ జరిగిన తీరుపై ఉదయమే ఇసికి ఫిర్యాదు చేశామని, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాజా పరిణామాలు గమనిస్తుంటే అధికారులపై ఒత్తిడి ఉన్నట్టుగా అనిపిస్తుందని అన్నారు.

బిజెపి నుంచి ఇద్దరి గెలుపు ఖాయం

గుజరాత్‌లో మూడు రాజ్యసభ స్థానాలకు మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో బిజెపి నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు బరిలో ఉన్నారు. బరిలో ఉన్న బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ విజయం దాదాపు ఖాయమైనప్పటికీ ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరిన బల్వంత్ సిన్హా రాజ్‌పుత్, కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 మంది సభ్యులున్నారు. 176 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఒక్కో అభ్యర్థికి 45ఓట్లు రావాల్సి ఉంటుంది.

సర్పంచ్‌ను చంపిన మావోయిస్టులు

కోరాపుట్/రాయ్‌పూర్: పోలీస్ ఇన్‌ఫార్మర్ అనే నెపంతో ఒడిశా కోరాపుట్ జిల్లాలోని ఓ గ్రామ సర్పంచ్‌ను మావోయిస్టులు దారుణంగా హత్య చేశారు. సోమవారం రాత్రి నందపూర్ బ్లాక్ పరిధిలో ఉన్న హాటిబారి గ్రామంలోకి సా యుధలైన 25 మంది మావోయిస్టులు ప్రవేశించి సర్పంచ్ జగన్నాథ్ ఖరాను తన ఇంట్లో నుంచి లాక్కొచ్చి గ్రామ శివార్లలోకి తీసుకెళ్లి చంపేసినట్లు పోలీసులు చెప్పారు. అంతకు ముందు బాధితుడికి చెందిన వాహనాలను కూడా వారు తగులబెట్టారన్నారు. ఘటనాస్థలి నుంచి మావోయిస్టులు చేతి రాతతో రాసిన ఓ లేఖను స్వాధీనం చేసుకున్నామన్నారు. లేఖలో పోలీసు లేదా హోం గార్డుల ఉద్యోగాలకు వెళ్లొద్దంటూ ఆ ఏరియా ప్రాంత ప్రజలను హెచ్చరిస్తూ రాసి ఉందన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నక్సల్స్ అరెస్టు

ఛత్తీస్‌గఢ్ నారాయపూర్ జిల్లాలో మంగళవారం ఇద్దరు నక్సలైట్లు అరెస్టు అ య్యారు. వారి వద్ద నుంచి అనేక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జరఘాటి పోలీస్ స్టేషన్ పరిధి తాడోనార్ గ్రామ సమీపంలో ఉన్న అడవుల్లో భద్రతా దళాలు సంయుక్తంగా గాలింపు చేపట్టి ఇద్దరు నక్సలైట్లను అరెస్టు చేసినట్లు నారాయణపూర్ ఎస్‌పి సంతోష్ సింగ్ మీడియాకు వెల్లడించారు. కడోలి, గుమ్మబేడ గ్రామాల మధ్య ఉన్న అడవుల్లో నక్సలైట్లు గుమిగూడినట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు జరా ప్రాంతంలో సోమవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ దళాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయని, తారసపడిన నక్సలైట్లు పారిపోయేందు కు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారన్నారు.

ఆరు వారాల్లో ఆర్‌టిఐ కమిషనర్లను నియమించండి : హైకోర్టు

మన తెలంగాణ/హైదరాబాద్: సమాచార్ ప్రధాన కమిషనర్, కమిషనర్లను ఆరు వారాల్లోగా నియమించాలని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ, ఎపి రాష్ట్రాల్లో చీఫ్ కమిషనర్, కమిషనర్లు లేకపోవడంతో సమాచార హక్కు చట్టం అమలు సరిగా జరగడం లేదంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ విచారణ సందర్భంగా ఆరు వారాల్లోగా నియమకాన్ని పూర్తి చేస్తామని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు నివేదించగా...కార్యాలయ భవనం, ఇతర మౌలిక సదుపాయాలు లేనందున తమకు మరింత గడువు కావాలని ఎపి ప్రభుత్వం కోరింది. ఎపి ప్రభుత్వం ఇచ్చిన సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయస్థానం ఆరు వారాల్లో కూడా నియమించలేరా? అని ప్రశ్నించింది. ఇరు ప్రభుత్వాల వాదనలు విన్న హైకోర్టు ఆరు వారాల్లోగా సమాచార ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకం పూర్తి చేయాలని ఆదేశించింది.

వ్యక్తి స్వేచ్ఛకు ముప్పు

సిడబ్ల్యుసి భేటీలో సోనియా గాంధీ



న్యూఢిల్లీ: వ్యక్తుల, సంస్థల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పార్టీ పరిరక్షించాల్సి ఉందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ మంగళవారం అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) ప్రత్యేక సమావేశంలో ప్రసంగిస్తూ ఆమె ఈ విషయం చెప్పారు. 'స్వీయ జాగరూకత' (సెల్ఫ్ విజిలెంటిజం) కేసులు పెరిగిపోతుండడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్ రాజ్యసభ స్థానాల ఎన్నికలలో ఇద్దరు అసమ్మతి ఎంఎల్‌ఎలు వేసిన ఓట్లను రద్దు చేయాలని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ పిటిషన్ పెట్టుకున్న మరునాడే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ ఎల్లప్పుడూ వ్యక్తుల, సంస్థల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కాపాడాలి. స్వేచ్ఛపై దాడి వేధన కలిగిస్తోంది. స్వేచ్ఛకు స్వీయ నియుక్త జాగరూకులు ముప్పు, భిన్నత్వానికి, బహుళత్వానికి శత్రువులు' అని సోనియా గాంధీ సమావేశంలో అన్నారు. భారత యువత, రైతులు అవస్థల పట్ల, నోట్ల రద్దు తర్వాత, జిఎస్‌టి తర్వాత నెలకొన్న అనేక సమస్యలపట్ల మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా ఆవేదన వ్యక్తం చేశారని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఎఐసిసి) సమాచార ఇన్‌చార్జ్ రణదీప్ సురేజ్‌వాలా తెలిపారు.



వ్యవసాయ పరిస్థితులపై సంయుక్త సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా), వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. సమావేశానికి వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి అధ్యక్షత వహించారు. క్రిడా డైరెక్టర్ డాక్టర్ సమ్మిరెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ జగన్‌మోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.సమావేశంలో వివిధ జిల్లాల్లో నమోదైన వర్షపాతం, పంటల వివరాలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా ఉన్న వర్ష పరిస్థితి, పంటల మీద దాని ప్రభావంపై వ్యవసాయ అధికారులు నివేదికలను సమర్పించారు. నివేదికలో గుర్తించిన వివిధ సమస్యలపై ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి చర్చించారు. వివిధ జిల్లాల్లో ఉన్న జలాశయాలు, వాటిలో నీటి సామర్థ్యం, లభ్యత, వాటి కింద వివిధ పంటల సాగు వివరాల గురించి చర్చించారు. వర్షాభావ పరిస్థితి మూలంగా ప్రధాన పంటల్లో నెలకొని ఉన్న పరిస్థితిని తట్టుకునేందుకు వివిధ ప్రత్యామ్నాయ శాస్త్రీయ పద్ధతుల గురించి సంబంధిత పంట శాస్త్రవేత్తలు విశదీకరించారు. ప్రత్తి పంటలో గులాబీ రంగు కాయతొలుచు పురుగును వివిధ ప్రాంతాలలో గమనించడం జరిగింది.

కొరియా సమీపంలో సైనిక విన్యాసాలు

షాంఘై : కొరియా ద్వీపకల్పానికి దగ్గరగా సముద్రంలో చైనా వైమానిక దళం, నౌకాదళం సైనిక విన్యాసాలను జరపడం ద్వారా తమ సత్తా చాటుకొంటున్నాయి. ఎంత కాలం ఈ విన్యాసాలు జరిపేది తెలియలేదు. రక్షణ మంత్రిత్వ శాఖ ఈ విషయం తెలిపింది. ఉత్తర కొరియా అణ్వాయుధాలను, ఖండాంతర క్షిపణులను సమకూర్చుకుంటున్న నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో చైనా జరిపిన ఈ విన్యాసాలకు ప్రాముఖ్యత పెరిగింది. ఎల్లో సముద్రం తూర్పు తీరం వద్ద జలాల్లో, గగనతలంపై ఈ విన్యాసాలు జరిగాయి. ఆ ప్రాంతం బోహాయ్ గల్ఫ్ వద్ద ఉంది. ఆ విన్యాసాల్లో డజన్ల కొద్దీ క్షిపణులను కూడా ప్రయోగించారని రక్షణ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ సోమవారం నాడు తెలిపింది. డజన్ల కొద్దీ నౌకలు, 10 విమానాలు, జలాంతర్గాములు , అనేక మంది తీర రక్షణ సిబ్బంది ఈ విన్యాసాల్లో పాల్గొన్నట్లు సమాచారం వచ్చింది. తీరం వెంబడి దాడులు జరిపే సత్తా చాటుతున్న విన్యాసాలు అవి. ఈ యుద్ధ విన్యాసాల వెనుక ఏ దేశానికైనా సందేశం ఉందా అన్నది తెలియలేదు. అమెరికా రూపొందించిన ఆంక్షల తీర్మానాన్ని ఉత్తర కొరియాను గురిపెట్టి ఐక్యరాజ్య సమితి గత శనివారం ఆమోదించిన కొత్తలో ఈ విన్యాసాలు జరగడంతో వాటికి ప్రాముఖ్యం పెరిగింది. ఉత్తర కొరియా ఆయుధ కార్యకలాపాల విషయంలో అంతర్జాతీయ సమాజంతోనే తాము ఉంటామని తీర్మానం ఆమోదం జరిగిన తక్షణమే చైనా పకటించింది. కొంతకాలంగా తన బలగాలను చైనా ఆధునీకరిస్తోంది.

మంచు పర్వతాలు మరింత పైపైకి!

లండన్: భారత, పాకిస్తాన్, చైనా సరిహద్దులలోని కరాకొరం మంచు పర్వతాల వాతావరణ మార్పులు సాగుతున్న ప్రస్తుత తరుణంలో కూడా పెరుగుతున్నట్టు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఒక అధ్యయనంలో వారు ఈ విషయం కనుగొన్నారు. కారాకొరం ఆ మూడు దేశాల సరిహద్దులలోని విస్తృతమైన మంచు పర్వత శ్రేణి. అమెరికాలోని న్యూ కాజిల్ యూనివర్సిటీ అధ్యయన బృందం ఈ పరిశోధన సాగించింది. 2000 కి.మీ. పర్వత శ్రేణి అంతటా మంచు పర్వతాలు వృద్ధి చెందుతున్నట్లు కనుగొన్నారు. మధ్య ఆసియాలోని పశ్చిమ పామీర్ అనే మరో మంచుపర్వత శ్రేణిలో కూడా అలాగే జరుగుతోంది.

కెన్యాలో సార్వత్రిక ఓటింగ్



నైరోబి: కెన్యా ప్రజలు మంగళవారం నాడు సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రస్తుత పాలకుడు ఉహురా కెన్యెట్టా, అతని ప్రత్యర్థి రైలా ఒడింగా మధ్య పోటీ తీవ్రంగా నెలకొంది. ఉత్తర ఆఫ్రికాలోని సంపన్న దేశమైన కెన్యాలో ఈ ఎన్నికల సందర్భంగా హింసాకాండ భయాలు వ్యాపించాయి. దేశమంతటా పోలింగ్ కేంద్రాల వద్ద సుదీర్ఘమైన క్యూలు చోటు చేసుకున్నాయి. ఉదయం 6 గం.ల నుంచి పోలింగ్ సాగుతోంది. ప్రచారం చివర్లో ఒక ఎన్నికల అధికారి హత్యతో కొద్ది రోజుల క్రితం ఉద్రిక్తతలు పెరిగాయి. 72 ఏళ్ల ఒడింగా 2007, 2013 లో తన గెలుపుకుండా అడ్డుకున్నట్లు ప్రత్యర్థులపై ఆరోపిస్తున్నారు. నాసా కూటమి సారథి. జుబిలీ పార్టీ సారథి కెన్యెట్టా ప్రస్తుత అధ్యక్షుడు.

'నీట్'లో ఉర్దూను చేరుస్తాం

న్యూఢిల్లీ : 2018–19 విద్యా సంవత్సరంలో వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష 'నీట్'లో ఉర్దూను ఒక భాషగా చేర్చడానికి సుముఖంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున పబ్లిక్ సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్ సమర్పించిన లేఖను న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. 2018 నుంచి 'నీట్'ను ఉర్దూ మాధ్యమంలో నిర్వహించడానికి వ్యతిరేకం కాదని రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష ఇప్పటికే పూర్తయింది, అయిపోయిన దానికి ఏమీ చేయలేం, ఈ విన్నపాన్ని పరిష్కరిస్తున్నామని ధర్మాసనంలో ఉన్న మరో న్యాయమూర్తి ఎఎం ఖన్విల్కర్ పేర్కొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి కోర్టు బ్రేక్

మనతెలంగాణ/ హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ప్రభుత్వ నియామక చర్యలను హైదరాబాద్ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం మంగళవారం రద్దు చేసింది. దీనికి సంబంధించిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం సహా మూడు పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమా దేవితో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్) పెండింగ్‌లో ఉండగానే ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే చర్యలతో ప్రభుత్వం ముందుకు వెళ్లిందని, ఇది చట్టబద్ధమైన సూచనల ఉల్లంఘన అని పిటిషనర్లు తమ రిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు. జిల్లా జడ్జి, జిల్లా మెజిస్ట్రేట్ మధ్య చట్టబద్ధ సంప్రదింపులే జరగలేదని పిటిషనర్లు వాదించారు. నియామకాల మొత్తం ప్రక్రియలో పారదర్శకత అన్నదే లేదని కూడా వారు వాదించారు. నియామకాలు అక్రమమే అయినప్పటికీ, అవి న్యాయమైనదేనని, ఉత్తములను ఎంపిక చేశామని ప్రభుత్వ ప్లీడర్ వేణుగోపాల్ వాదనను విన్న ధర్మాసనం ప్రభుత్వానికి రెండు వారాల సమయాన్ని ఇచ్చింది. అలాంటి నియామక చర్యను తప్పు పట్టరాదని వేణుగోపాల్ తెలుపుతూ కోర్టు పూర్తి స్థాయి ధర్మాసనం ఇచ్చిన తీర్పును తన వాదనకు బలంగా ప్రస్తావించారు.

డార్జిలింగ్‌లో ఉద్రిక్తత, పోలీసు బలగాల మోహరింపు

డార్జిలింగ్ : డార్జిలింగ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం నాటికి బంద్ 55వ రోజుకు చేరుకుంది. అయితే, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిజెఎం కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన పరిరోజుల 'డెడ్‌లైన్' మంగళవారం సాయంత్రంతో ముగిసింది. దీంతో ఇప్పుడు లోయల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం స్థానికుల్లో నెలకొంది. ప్రత్యేక గోర్ఖాలాండ్ ఏర్పాటు విషయంలో కేంద్రం చర్యలు తీసుకోవాలని తాము ఇచ్చిన 10 రోజుల గడువు ముగిసిపోయిందని, అందువల్ల తమ ఉద్యమం ఉధృతం చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. మరోవైపు కొండ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సర్వీసులను పునరుద్ధరించాలని, పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిజెఎం కార్యకర్తలు పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు, భద్రతా బలగాలు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశాయి. జిజెఎం ప్రధాన కార్యాలయం ఉన్న సింగ్‌మరి ప్రాంతంలోనూ, పార్టీ చీఫ్ బిమల్ గురుం గొంగ్ మంచి పట్టున్న పట్లిబాస్‌లో పోలీసు బలగాలు మోహరించాయి. గత రెండు మాసాల్లో ఈ రెండు ప్రాంతాల్లో జిజెఎం ఉద్యమకారులు, పోలీసులు మధ్య పలు సంఘటనలు జరిగాయి. కాగా, ప్రత్యేక గోర్ఖాలాండ్ కోసం జులై 27 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జిజెఎం యువమోర్చా కు చెందిన 12 మంది సభ్యుల్లో ఏడుగురి ఆరోగ్యం క్షీణించింది.

కశ్మీర్ లేదా కాలాపానీలో
కాలు పెడితే ఏం చేస్తారు?

భారత సైన్యం వైదొలగాల్సిందే • యుద్ధానికి ఎప్పుడూ సిద్ధమే : చైనా



బీజింగ్: డోక్లాంలో ప్రతిష్టంభన అంతానికి ఇరుపక్షాలు ఏకకాలంలో తమ సైన్యాలను ఉపసంహరించుకోవాలన్న భారత దేశపు సూచనను చైనా మంగళవారం నాడు తిరస్కరించింది భారతపట్ల వ్యతిరేక ధోరణిని మున్ముందు చేసింది. కశ్మీర్ లేదా ఉత్తరాఖండ్‌లో తాను కాలాపానీ ప్రాంతంలోకి ప్రవేశిస్తే భారతప్రభుత్వం ఏమి చేయగలదని ఆశ్చర్యం కూడా చైనా వ్యక్తం చేసింది. సిక్కిం సెక్టర్‌లోని డోక్లాం ప్రాంతంలో గత 50 రోజులుగా భారత, చైనా మధ్య ప్రతిష్టంభన సాగుతోంది. ఆ ప్రాంతంలో చైనా సైన్యం రోడ్డు నిర్మాణం పనిని భారత సైన్యం అడ్డుకోవడంతో ఇది మొదలయింది. తమ భూభాగంలోనే రోడ్డు నిర్మిస్తున్నామని అంటున్న చైనా భారత దళాలను డోక్లాం నుంచి తక్షణమే వైదొలగాలని డిమాండ్ చేస్తోంది. డోక్లాం తమది అని వాదిస్తున్న భూటాన్ ఆ ప్రాంతంపైనా హక్కులు చాటుకోదన్ని వ్యతిరేకిస్తోంది. డోక్లాంలో ఒక్కరోజుపాటు ఒక్క భారత సైనికుడు ఉన్నా అది చైనా సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమే అని కూడా చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన సరిహద్దుల విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వాంగ్ వెన్లీ ప్రకటించారు. భారత మీడియా ప్రతినిధుల బృందంతో మాట్లాడుతూ ఆమె ఈ ప్రకటన చేశారు. అఖిల చైనా జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో భారత మీడియా ప్రతినిధులు చైనాలో పర్యటిస్తున్నారు. 'ఈ తరుణంలో భారత్‌తో చర్చలు జరపడం సాధ్యం కాదు. మా ప్రజలు ప్రభుత్వాన్ని అసమర్థమైనదని భావించే ప్రమాదం ఉండడంతో చర్చల అవకాశం లేదు' అని వెన్లీ అన్నారు. భారత సైన్యం డోక్లాం నుండి వెనక్కు మళ్లాకే చర్చలు సాధ్యం కాదు అని ఆమె చెప్పారు. అదే ప్రస్తుత సమస్యకు పరిష్కారం అన్న చైనా వాదనను పునరుద్ఘాటించారు. ట్రై జక్షన్ సాకుగా చూపి భారత్ అతిక్రమణ జరపడం భావ్యంకాదని ఆమె పేర్కొన్నారు. భారత్, నేపాల్ మధ్య వివాదాస్పదంగా ఉన్న కాలాపానీ ప్రాంతం పేరును, కశ్మీర్ అంశాన్ని కూడా చైనా తాజా ప్రకటనలో ప్రస్తావించింది. భారత్ సరిహద్దు ప్రాంతంలో కూడా అనేక ట్రై జంక్షన్లు ఉన్నాయని, భారత్ వాదిస్తున్న తీరులో తాము కాలాపానీ ప్రాంతంలోకి ప్రవేశిస్తే భారత్ ఏమి చేయగలదని కూడా చైనా ప్రశ్నించింది. కిందటిసారి అనేక ప్రకటనల్లో కశ్మీర్ ప్రస్తావనను చైనా తెచ్చింది. కానీ తాజా వివాదంలో ఆ ప్రస్తావన తేవడం ఇదే మొదటి సారి. భారత్‌తో యుద్ధానికి సిద్ధమవుతున్నారా అని అడిగ్గా భారత దేశం తప్పటడుగు వేస్తే ఆ హక్కు తమకు ఎప్పుడూ ఉందని, చైనా పీపుల్స్ ఆర్మీ, చైనా ప్రభుత్వం తాము చేయాల్సిన దానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాయని కూడా వెన్లీ తెలిపారు. గతంలో చాలా సార్లు ఇరు దేశాల మధ్య సంక్షోభాలు తలెత్తినా సృష్టమైన వైఖరిని చైనా ఇంతవరకు ప్రకటించలేదని కూడా ఆమె గుర్తు చేశారు. ఈసారి మాత్రం వైఖరి నిర్మయించుకుని సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. భారతీయ సరిహద్దు దళాలు దురాక్రమణ సంకేతాన్ని పంపుతున్నాయన్నారు.

హిమాలయాలపై అధ్యయనం

న్యూఢిల్లీ: హిమాలయాల అధ్యయనం (ఎన్ఎమ్‌హెచ్ఎస్) అమలుకు జిబి పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఇన్విరాన్‌మెంట్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (జిబిపిఎన్ఐహెచ్ఎస్ఐడి) నోడల్ సంస్థను నామినేట్ చేసినట్లు మంగళవారం లోక్‌సభలో ప్రభుత్వం పేర్కొంది. 'ఎన్ఎమ్‌హెచ్ఎస్' అనే సెంట్రల్ సెక్టార్ గ్రాంటెయిడ్ స్కీమ్‌ను భారతీయ హిమాలయ ప్రాంతంలో సహజ వనరుల సంరక్షణ నిర్వహణలో కీలక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్ఎమ్‌హెచ్ అమలు కోసం నోడల్ సంస్థగా పేర్కొంటు 'జిబిఎన్ఐహెచ్ఇఎస్‌డి'ని పర్యావరణ మంత్రిత్వ శాఖ నామినేట్ చేసిందంటూ ఆ శాఖ సంబంధిత మంత్రి హర్షవర్ధన్ పార్లమెంటులోని దిగువ సభకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. హిమాలయ రాష్ట్రాల్లో 'ఎన్ఎమ్‌హెచ్' పథకం కింద 42 పరిశోధన ప్రాజెక్టులకు నిధులు సమకూర్చుతున్నట్లు వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో 17 పరిశోధన ప్రాజెక్టుల కోసం వివిధ ఏజెన్సీల నుంచి నిధులు అందుతున్నాయని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పర్యావరణ పరిశోధన అభివృద్ధి కార్యక్రమం కింద 45 పరిశోధన ప్రాజెక్టులకు నిధులు సమకూర్చుతున్నామన్నారు.

చైనాలో వరద బీభత్సం

బీజింగ్: చైనాలో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. వరద ఉధృతికి సిచువాన్ ప్రావిన్స్‌లో మొత్తం 24 మంది మృత్యువాతపడ్డారు. మరో ప్రాంతంలో వరదల్లో చిక్కుకున్న నలుగురు గాయపడగా, లియాంగ్‌షాన్ ప్రాంతంలో మరొక వ్యక్తి గల్లంతయినట్టు జిన్హువా న్యూస్ ఏజెన్సీ అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో 71 నివాసగృహాలు ధ్వంసమై భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. ఇప్పటివరకూ 577 మంది ప్రజలు వరదల్లో చిక్కుకోగా, 157 గృహాలు నీటమునిగాయి. రహదారులు, బ్రిడ్జీలు కూడా బాగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా వెయ్యికి పైగా వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రంగంలోకి దిగిన సహాయక బృందాలు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. వరద బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు.

చైనాలో భూకంపం

వంద మందికిపైగా మృతి.. భయంతో పరుగులు పెట్టిన జనం



బీజింగ్: నైరుతి చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో భూకంపం సంభవించింది. 100మందికి పైగా మృత్యువాతపడ్డారు. భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.0 గా నమోదైంది. ఈ మేరకు మంగళవారం చైనా భూకంప కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం 9.19 గంటల ప్రాంతంలో 20 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయని జిన్హువా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. భూకంపం ధాటికి పలు భవనాలు ధ్వంసమై కుప్పకూలిపోయాయి. దీంతో రంగంలోకి దిగిన సహాయక బృందాలు, అధికారులు, యువకులు అక్కడి స్థానికులను ఖాళీ చేయిస్తున్నారని జియుజైగౌ పర్యాటక సిబ్బంది ఒకరు ఫోన్ ద్వారా జిన్హువాకు తెలిపారు. కౌంటీలో పెద్దశబ్దంతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయని, దాంతో భయాందోళనకు గురైన ప్రజలంతా భవనాల నుంచి ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారని లి చాంగ్‌యాంగ్, ఫ్యామిలీ ప్లానింగ్ బ్యూరో పేర్కొన్నాయి. మరోవైపు ప్రాంతీయ రాజధాని చెంగ్డూలో కూడా భారీగా భూప్రకంపనలు చోటుచేసుకోగా, దక్షిణాన 300 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు వెల్లడించాయి.

బిసిలకు 50 శాతం రిజర్వేషన్లకు కృషి చేస్తాం

న్యూఢిల్లీ ఎపి భవన్ అంబేద్కర్ ఆడిటోరియం సభలో కేంద్ర మంత్రుల ప్రకటన




మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్: పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు పెట్టేందుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రులు బండారు దత్తాత్రేయ, రాందాసు అతవాలేలు ఢిల్లీలో ప్రకటించారు. మంగళవారం న్యూ ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో గల అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన బిసిల సమావేశం జరిగింది. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ బిసిల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందే ప్రతిపక్షాలు అడ్డు తగులుతున్నాయని విమర్శించారు. ఇటీవల జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పిస్తే రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ అడ్డు తగిలి బిల్లు అమలు కాకుండా బిసిలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని కృష్ణయ్య చేస్తున్న పోరాటానికి దత్తాత్రేయ మద్దతు ప్రకటించారు. కేంద్ర మంత్రి రాందాసు అతవాలే మాట్లాడుతూ బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు పెట్టకపోవడం వలన అన్యాయం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోయిందన్నారు. బిసి జాతులతో 2600 కులాలు ఉండగా అందులో 2550 కులాలు ఇంత వరకు పార్లమెంట్‌లో అడుగుపెట్టలేదన్నారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో రిజర్వేషన్లు సాధించడమే తన అంతిమ లక్ష్యమన్నారు. విజయం సాధించే వరకు వదలిపెట్టన్నారు. త్వరలో బిసిలు జాతీయ స్థాయిలో బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని కృష్ణయ్య స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు పద్మశ్రీ డాక్టర్. వికాస్ మహాత్మా మాట్లాడుతూ మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు పెట్టవలసిన అవసరముందన్నారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, శంకర్‌రావు, గొరిగె మల్లేష్ యాదవ్, వరప్రసాద్ యాదవ్, ఆర్.సత్యనారాయణ, నీల వెంకటేష్, ఏపి యువజన సంఘం అధ్యక్షులు కర్రి వేణుమాధవ్, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, రవీంద్ర చారి, దాసకర్త చారి, శారదాగౌడ్, భిక్షపతి, రాములింగంతో పాటు బిసి ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, బిసి సంఘాలకు చెందిన వందలాది మంది నాయకులు పాల్గొన్నారు.

బిసి కమిషన్ చట్టబద్ధతకు కట్టుబడి ఉన్నాం



మన తెలంగాణ/న్యూఢిల్లీ : జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ప్రస్తుత సమావేశాల్లోనే ఈ బిల్లు ఆమోదం పొందకపోయినా వచ్చే సమావేశాల్లోనైనా తప్పకుండా ఆమోదం చేస్తామని హామీనిచ్చారు. న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి డిమాండ్ల సాధనపై అఖిలపక్ష సభను నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత వహించగా, బండారు దత్తాత్రేయతోపాటు, కాంగ్రెస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, రాపోలు ఆనందభాస్కర్, టిఆర్ఎస్ ఎంపి బూర నర్సయ్యగౌడ్, ఎస్పీవై ఒబిసి మహాసంఘ్ ఛైర్మన్ ప్రొఫెసర్ బబన్‌రావ్ త్రైవాడే, మాజీ ఎంపి, మహాసభ కన్వీనర్ కుశాల సింగ్, కాంగ్రెస్ నాయకులు దాసోజు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ జనాభా ధామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రంగాలలో ఉన్న రిజర్వేషన్లను రాజకీయ రంగంలో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. కేంద్రంలో ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై ప్రభుత్వం సుముఖంగానే ఉందన్నారు. పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా బిసిలు అన్ని ప్రభుత్వాల వద్ద యాచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలు ఆగ్రహిస్తే గుర్తించే దశలో బిసి ముందుకు ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలు లేకుండా ఏ రాజకీయ పార్టీలు మనుగడ సాధించలేవన్నారు. బిసిలను నిర్లక్ష్యం చేస్తే బిసి వ్యతిరేక పార్టీలకు శంకరగిరి మాన్యాలే గతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు నిరంజన్, పి.లక్ష్మి, నారాయణదాస్, దుర్గయ్యగౌడ్, కుల్కర్ణ శ్రీనివాస్, కనకాల శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డిఎస్‌సి ప్రకటన : కడియం




మన తెలంగాణ/ఎన్‌జిఒస్ కాలనీ : టెట్ ఫలితాలు విడుదలైనందున గతంలో ఇచ్చిన హామీ మేరకు డిఎస్సీ ప్రక్రియను సూపీంకోర్టు ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని మంగళవారం విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరిని డిఎస్సీ అభ్యర్థులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డిఎస్సీ విద్యార్థులు గత ఐదు సంవత్సరాలుగా డిఎస్సీ కోసం ఎంతో మంది నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నందున వెంటనే డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కడియం శ్రీహరి డిఎస్సీ అభ్యర్థులు మెమోరాండాన్ని సమర్పించారు. అనంతరం విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి స్పందిస్తూ టెట్ ఫలితాలు రాగానే కొత్త జిల్లాల ప్రకారం డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అనుకున్నామని కాని కొత్త జిల్లాలకు గెజిట్ ఇవ్వనందున కోర్టులో న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున పాత జిల్లాల ప్రకారమే డిఎస్సీ నిర్వహించాలని లేదా అనే అంశంపై 11న జరిగే విద్యాశాఖ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఈనెల చివరి వారంలోగా డిఎస్సీనోటిఫికేషన్ సన్నాహాలు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో డిఎస్సీ అభ్యర్థులు రాపుల రఘునాథ్‌రెడ్డి, ధరావత్ రవి, శ్రీసునాయక్, భాను, నరేశ్, రవిదాసు, నవీన్, కోటేష్, శ్రీకాంత్, ప్రత్యూష, సరస్వతి, తదితరులు ఉన్నారు.

రాథోడ్ -రేఖ మధ్య వాగ్వివాదం



మన తెలంగాణ / ఖానాపూర్: కుర్చీ విషయంలో ఏర్పడిన చిన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారి నేతలు కేసులు బనాయించుకునే స్థితికి చేరుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. ఈ నెల 10వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగసభ ఏర్పాట్ల గురించి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఖానాపూర్ వెళ్లిన సందర్భంగా వివాదం చోటుచేసుకుంది. మంత్రితో సహా ఎంఎల్ఎ రేఖానాయక్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాకరం శ్రీనివాస్ తదితరులు ఐబి అతిథిగృహంలో వెళ్లారు. కాస్త ఆలస్యంగా మాజీ ఎంపి రమేష్ రాథోడ్ అతిథిగృహంలోకి ప్రవేశించారు. ఈసందర్భంగా అతిథి గృహంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ కూర్చొని వున్నాడు. రాథోడ్ లోపలికి ప్రవేశించటంతో ఆయనకు కుర్చీ ఇవ్వాలన్నా ఉద్దేశ్యంతో లేచి నిలబడుతుండగా ఎంఎల్ఎ రేఖానాయక్ వారించి శ్రీనివాస్‌ను తన కుర్చీలో కూర్చోమని సైగ చేసింది. దీన్ని గమనించిన రాథోడ్‌కు, రేఖకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా ఇరువురు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ దూషించుకున్నారు. ఈ లోగా మిగతా నాయకులు కలగ చేసుకొని గొడవను వారించారు. తదుపరి సమావేశం నిర్వహించారు. తదుపరి నేతలంతా వెళ్లిపోయిన అనంతరం రేఖానాయక్ మాజీ ఎంపి రాథోడ్ రమేష్ తనపై అనుచితంగా వ్యాఖ్యలు చేసి చంపుతానని బెదిరించాడని ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు రేఖానాయక్‌ను సముదాయించే ప్రయత్నం చేయగా మాజీ ఎంపిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అనుచరులతో కొద్దిసేపు పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేశారు. ఇదిలా ఉండగా 'మన తెలంగాణ' రాథోడ్ రమేష్‌ను వివరణ కోరగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర నాయకులు రవిందర్ రావులకు ఇందుకు సాక్ష్యమని, తాను ఎంఎల్ఎ పట్ల దురుసుగా ప్రవర్తించలేదని, అనుచిత వ్యాఖ్యలు కూడా చేయలేదని అన్నారు. ఇదిలా ఉంగగా సిఐ పెద్దన్న కుమార్ మన తెలంగాణతో మాట్లాడుతూ మాజీ ఎంపిపై ఎంఎల్ఎ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

రాష్ట్రపతిని కలిసిన దత్తాత్రేయ



మన తెలంగాణ/న్యూఢిల్లీ : నూతన రాష్ట్రపతిగా ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన రామ్ నాథ్ కోవింద్ ని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేసిన దత్తాత్రేయ తన శాఖ కార్యకలాపాలను ఆయనకు వివరించారు. కార్మికులకు అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను, కార్మికుల అభ్యున్నతి దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెడుతున్న పలు చట్టాల గురించి రాష్ట్రపతికి తెలియజేశారు దత్తాత్రేయ. కార్మికులకు సంబంధించిన ఏవిధమైన సహాయం అవసరమైనా చేస్తానని రాష్ట్రపతి అన్నట్లు దత్తాత్రేయ తెలిపారు.

కోహ్లితో పోలికలొద్దు : బాబర్ ఆజమ్



కరాచీ: భారత స్టార్ విరాట్ కోహ్లితో తనను పోల్చకూడదని పాకిస్థాన్ యువ సంచలనం బాబర్ ఆజమ్ అన్నాడు. కోహ్లి ఓ దిగ్గజ ఆటగాడని అతనితో తాను సరితూగనని బాబర్ తేల్చి చెప్పాడు. ఇటీవల కొందరు పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు బాబర్‌ను కోహ్లితో పోల్చుతున్న విషయం తెలిసిందే. దీనిపై బాబర్ స్పందించాడు. కోహ్లి తన అభిమాన ఆటగాడన్నాడు. అతను ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌లలో ఒకడన్నాడు. తాను ఇప్పుడిప్పుడే కెరీర్‌ను ప్రారంభించానన్నాడు. కోహ్లి స్థాయిని అందుకోవడం తనకు సాధ్యమయ్యే పని కాదన్నాడు. కోహ్లి అసాధారణ ఆటగాడని, ఎటువంటి ఫార్మాట్‌లోనైనా చెలరేగే సత్తా అతనికుందన్నాడు. అతనితో తనను పోల్చడం సరికాదన్నాడు. కోహ్లి బ్యాటింగ్ శైలి తనను ఎంతో ఆకట్టుకుంటుందన్నాడు. అతనిని తాను ఎంతో ఆరాధిస్తానని అన్నాడు. కోహ్లితో పాటు డివిలియర్స్ కూడా తన ఆరాధ్య క్రికెటర్ అని ఈ పాక్ క్రికెటర్ అన్నాడు. భవిష్యత్తులో తాను కూడా మెరుగైన బ్యాట్స్‌మన్‌గా పేరు తెచ్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు బాబర్ స్పష్టం చేశాడు.

అజేయ శక్తిగా విరాట్ సేన

• వరుస విజయాలతో దూసుకుపోతున్న టీమిండియా



మన తెలంగాణ / క్రీడా విభాగం : అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌లో టీమిండియాకు ఎదురే లేకుండా పోయింది. వరుసగా ఎనిమిది సిరీస్‌లు నెగ్గిన భారత్ టెస్ట్‌ల్లో నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో విరాట్ కోహ్లి సేన ప్రత్యర్థులకు అందనంత ఎత్తుకు ఎదిగింది. శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలివుండగానే చేజిక్కించుకుంది. ఒకప్పుడూ సొంత గడ్డపైనే విజయాలు సాధించే జట్టుగా పేరొందిన భారత్ ఇప్పుడూ విదేశాల్లోనూ సిరీస్‌లు గెలుస్తూ ప్రకంపనలు సృష్టిస్తోంది. గతంలో వెస్టిండీస్‌ను వారి గడ్డపై ఓడించిన భారత్ ఇప్పుడూ లంకకు కూడా అదే రుచిని చూపించింది. ఒకప్పుడూ ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు ఇలా వరుస విజయాలు సాధిస్తూ ఉండేవి. ప్రస్తుతం భారత్ కూడా వారిలాగే వరుస సిరీస్‌లు గెలుచుకుంటూ ముందుకు పోతోంది. విరాట్ కోహ్లి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌కు టెస్టుల్లో ఎదురు లేకుండా పోయిందనే చెప్పాలి. ఆస్ట్రేలియాతో ఓటమి తర్వాత భారత్ మళ్లీ వెను దిరిగి చూడలేదు. కోహ్లి సారథ్యంలో టీమిండియా వరుసగా ఎనిమిది టెస్టు సిరీస్‌లలో విజయం సాధించింది. 2015లో శ్రీలంక సిరీస్ నుంచి భారత్ తన జైత్రయాత్రకు శ్రీకారం చుట్టింది. సిరీస్‌లో తొలి టెస్టును ఓడి పోయిన భారత్ తర్వాత మళ్లీ వెనుదిరిగి చూడలేదు. వరుసగా రెండు టెస్టులను గెలిచి 2–1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. తర్వాత భారత్ సొంత గడ్డపై కూడా వరుస విజయాలు నమోదు చేసింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌ను భారత్ 3–0తో గెలుచుకుంది. ఒక మ్యాచ్ డ్రాగా ముగియగా మిగిలిన మూడు టెస్టుల్లో భారత్ జయకేతనం ఎగుర వేసింది. తర్వాత వెస్టిండీస్ గడ్డపై జరిగిన సిరీస్‌లో కూడా భారత్ జయభేరి మోగించింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2–0తో దక్కించుకుంది. రెండు మ్యాచుల్లో వరుణుడి వల్ల విండీస్ ఓటమి నుంచి తప్పించుకో గలిగింది. లేకుంటే టీమిండియా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేదే. ఇక, స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3–0తో కైవసం చేసుకుంది. అదే ఏడాది ఇంగ్లాండ్‌తో స్వదేశంలో జరిగిన సిరీస్‌ను కూడా భారత్ 4–0 తేడాతో సొంతం చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక మ్యాచ్ డ్రాగా ముగియగా, మిగిలిన నాలుగింటిలో భారత్ జయభేరి మోగించింది. ఈ ఏడాది ప్రారంభంలో స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్ సిరీస్‌లో కూడా భారత్ గెలుపొందింది. బలమైన ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో కూడా భారత్ విజయం సాధించింది. సొంత గడ్డపై జరిగిన ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2–1 తేడాతో భారత్ దక్కించుకుంది. ఇక, శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలివుండగానే గెలుచుకుని ఎదురు లేదని నిరూపించింది. మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో కోహ్లి సేన ఉంది.

కలిసికట్టుగా..

భారత్ సమష్టి కృషితో విజయాలు సొంతం చేసుకుంటుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా ఉండడం భారత్‌కు కలిసి వస్తోంది. జట్టు విజయాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషిస్తున్నారు. ఓపెనర్లతో మొదలుకుని చివరి వరుస బ్యాట్స్‌మెన్ వరకు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు ఆల్‌రౌండ్ ప్రతిభతో చెలరేగి పోతున్నారు. ఒకవైపు వికెట్లు పడగొడుతూనే బ్యాట్‌తోనూ జట్టుకు అండగా నిలుస్తున్నారు. భారత్ సాధించిన సిరీస్ విజయాల్లో వీరి పాత్ర చాలా కీలకమైంది. ఇద్దరు బ్యాట్‌తో, బంతితో చెలరేగుతున్నారు. కీలక సమయాల్లో అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకుంటున్నారు. ఇక, బంతితో వీరికి ఎదురే లేకుండా పోతోంది. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ భారత్‌ను అజేయ శక్తిగా నిలుపుతున్నారు. ఇక, చతేశ్వర్ పుజారా, కెప్టెన్ విరాట్ కోహ్లిల పాత్ర కూడా వెలకట్టలేనిది. భారత్ సాధించిన విజయాల్లో వీరిద్దరూ చాలా కీలకంగా మారుతున్నారు. ఒకవైపు కెప్టెన్సీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తునే బ్యాట్‌తోనూ సత్తా చాటుతున్నాడు కోహ్లి. పుజారా కూడా నిలకడైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలుస్తున్నాడు. కొంతకాలంగా అతను ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల్లోనూ నిలకడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు.

ఓపెనర్లు కెఎల్.రాహుల్, మురళీ విజయ్‌లు కూడా జట్టు విజయాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఇక, శ్రీలంక సిరీస్‌లో అజింక్య రహానె, శిఖర్ ధావన్‌లు మెరుపులు మెరిపిస్తున్నారు. తొలి టెస్టులో ధావన్ కళ్లు చెదిరే శతకం సాధించాడు. రహానె రెండో టెస్టులో శతకంతో సత్తా చాటాడు. మరోవైపు బౌలింగ్‌లో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు చెలరేగి పోతున్నారు. బంతితోనే కాక బ్యాట్ తోనూ వీరు రాణిస్తున్నారు. మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లు కూడా తమవంతు పాత్ర పోషిస్తున్నారు. అందరూ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ పోతుండడంతో భారత్ టెస్టు క్రికెట్‌లో ఎదురులేని శక్తిగా మారింది. ప్రస్తుతం సాంప్రదాయ క్రికెట్‌లో కోహ్లి సేన నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి బలమైన జట్లను సైతం వెనక్కినట్టి టీమిండియా టెస్టుల్లో నంబర్‌వన్ స్థానంలో విలసిల్లుతున్నది.

ఆసీస్ రికార్డును బద్దలు కొడతాం

భారత ప్రధాన కోచ్ రవిశాస్త్రి



కొలంబో: టెస్టుల్లో అత్యధిక సార్లు 600కు పైగా స్కోర్లు సాధించిన జట్టుగా ఆస్ట్రేలియా పేరిట ఉన్న రికార్డును బద్దలు కొడతామని భారత ప్రధాన కోచ్ రవిశాస్త్రి జోస్యం చెప్పాడు. తన రెండేళ్ల పదవి కాలంలో ఈ రికార్డును బద్దలు కొట్టడం ఖాయమన్నాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ ఇప్పటి వరకు 29 సార్లు 600కు పైగా స్కోర్లను నమోదు చేసింది. అయితే ఆస్ట్రేలియా 32 సార్లు ఈ ఘనత సాధించి అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ రికార్డును టీమిండియా బద్దలు కొట్టడం ఖాయమన్నాడు. తన పదవి కాలం పూర్తయ్యేలోగా భారత్ ఈ రికార్డును తిరగరాస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. శ్రీలంకపై రెండు సార్లు 600కు పైగా పరుగులు సాధించడం చాలా గర్వంగా ఉందన్నాడు. తన పర్యవేక్షణలో ఈ రికార్డు నెలకొల్పడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పాడు. విదేశాల్లో కూడా భారత్ సిరీస్‌లు గెలుస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. కోహ్లి సారథ్యంలో టీమిండియా టెస్టుల్లో అసాధారణ శక్తిగా మారిందని శాస్త్రి అన్నాడు.

విమర్శలు ఆపండి : డిసిల్వా



కొలంబో : వరుస ఓటములతో సతమతమవుతున్న శ్రీలంక జట్టుకు అండగా నిలువాల్సిన బాధ్యత అభిమానులకు ఉందని ఆ జట్టు సలహాదారుడు అరవింద డిసిల్వా సూచించాడు. భారత్‌తో జరిగిన రెండు టెస్టుల్లో ఓటమి పాలైన శ్రీలంక జట్టుపై అభిమానులు, మాజీ క్రికెటర్లు దుమ్మెత్తి పోస్తున్న విషయం తెలిసిందే. దీనిపై శ్రీలంక మాజీ దిగ్గజం డిసిల్వా స్పందించాడు. సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత జట్టు బలహీన పడిన విషయం వాస్తవమేనన్నాడు. ఏ జట్టుకైనా ఏదో ఒక సమయంలో ఇటువంటి పరిస్థితులు ఎదురు కావడం ఖాయమన్నాడు. అంత మాత్రాన జట్టుపై విమర్శలకు దిగడం మంచిది కాదన్నాడు. ప్రస్తుతం శ్రీలంక జట్టు నిర్మాణ దశలో ఉందన్నాడు. ఇప్పుడిప్పుడూ గాడిలో పడుతుందన్నాడు. యువ ఆటగాళ్లు రాటుదేలడానికి కొంత సమయం పడుతుందన్నాడు. అప్పటి వరకు ఓపికతో ఎదురు చూడాల్సిందేనన్నాడు. రెండో టెస్టు ఓటమి తర్వాత సోషల్ మీడియా వేదికగా జట్టుపై నెటిజన్లు పెద్ద ఎత్తున విమర్శలకు దిగడాన్ని డిసిల్వా తప్పు పట్టాడు. ఇటువంటి పరిణామాలు జట్టుకు మరింత చేటు తెస్తాయన్నాడు. ఇప్పటికైనా నెటిజన్లు, మాజీ క్రికెటర్లు, అభిమానులు విమర్శలకు స్వస్తి పలకాలన్నాడు.

కొంత సమయం వేచి చూడాలి

• సనత్ జయసూర్య



కొలంబో: సీనియర్ల రిటైర్మెంట్ తర్వాత శ్రీలంక జట్టు బలహీన పడిందని, జట్టు మళ్లీ కోలుకునేందుకు కాస్త సమయం పడుతుందని శ్రీలంక క్రికెట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ సనత్ జయసూర్య అన్నాడు. జట్టు ప్రస్తుతం నిర్మాణ క్రమంలో ఉందని, పటిష్టమైన జట్టుగా రూపుదిద్దుకునే క్రమంలో ఎత్తు పల్లాలు చవిచూడడం సర్వ సాధారణమన్నాడు. అంత మాత్రాన అదే పనిగా జట్టుపై విమర్శలకు దిగడం మంచి పరిణామం కాదన్నాడు. ప్రస్తుతం లంక జట్టులో చాలా మంది యువ ఆటగాళ్లే ఉన్నారన్నాడు. అనుభవలేమి వారికి ప్రతికూలంగా మారిందన్నాడు. కొంత కాలం తర్వాత వీరంతా మంచి క్రికెటర్లుగా ఎదగడం తథ్యమన్నాడు. అప్పుడూ జట్టు మళ్లీ పూర్వ వైభవం దిశగా సాగడం ఖాయమన్నాడు. అప్పటి వరకు ప్రతి ఒక్కరూ ఓపికతో ఎదురు చూడాల్సిందేనన్నాడు. జట్టులో ప్రతిభకు కొదవలేదని, అయితే అనుభవ లేమి వారికి ప్రతికూలంగా తయారైందని ఈ మాజీ దిగ్గజం అభిప్రాయపడ్డాడు. భారత్ వంటి బలమైన జట్టును ఓడించడం ఏ జట్టుకైన చాలా కష్టమన్నాడు. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి పటిష్ట జట్లే భారత్ చేతిలో ఘోర పరాజయాలు చవిచూసిన నేపథ్యంలో లంక ఓటమిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నాడు. లంక జట్టులో చాలా మంది క్రికెటర్లు ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ కెరీర్‌కు శ్రీకారం చుట్టారని వారంతా రాటుదేలేందుకు కొంత సమయం పడుతుందన్నాడు. అప్పటి వరకు ప్రతి అభిమాని జట్టుకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని సూచించాడు.


టైటాన్స్–బెంగళూరు పోరు టై



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీలో భాగంగా మంగళవారం తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 21–21 పాయింట్లతో టైగా ముగిసింది. నరాలు తెగే ఉత్కంఠత మధ్య సాగిన పోరులో రెండు జట్లు సర్వం ఒడ్డి పోరాడాయి. చివరి రైడ్‌లో టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి ఒక పాయింట్ సాధించడంతో టైటాన్స్ మ్యాచ్‌ను టైగా ముగించడంలో సఫలమైంది. ప్రారంభం నుంచే మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఒక దశలో తెలుగు టైటాన్స్ స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. కానీ, బెంగళూరు కూడా పట్టు వదలకుండా పోరాడింది. దీంతో ప్రథమార్ధంలో బెంగళూరు 9–8 ఆధిక్యాన్ని అందుకుంది. ద్వితీయార్ధంలో కూడా పోరు హోరాహోరీగా సాగింది. రెండు జట్లు కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డాయి. దీంతో మ్యాచ్‌లో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. చివరి వరకు ఈ ఉత్కంఠ కొనసాగింది. చివరి నిమిషంలో రెండు జట్లు చెరో పాయింట్ సాధించడంతో పోరు టైగా ముగిసింది. టైటాన్స్ జట్టులో రాహుల్ చౌదరి 8 పాయింట్లు సాధించాడు. నిలేష్ సలుంకె నాలుగు పాయింట్లతో రాణించాడు. బెంగళూరు జట్టులో రోహిత్ కుమార్ ఐదు పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 32–20 తేడాతో గుజరాత్ ఫర్చ్యూన్స్ జెయింట్స్ జట్టును ఓడించింది. హర్యాన జట్టులో మోహిత్ ఏడు, సురేందర్, వికాస్ ఆరేసి పాయింట్లు సాధించారు. గుజరాత్ జట్టులో సచిన్ 8 పాయింట్లు నమోదు చేశాడు.

ముక్కోణపు టోర్నీ విజేత భారత్-ఎ

ప్రిటోరియా : దక్షిణాఫ్రికాలో జరిగిన ముక్కోణపు టోర్నమెంట్‌లో భారత్–ఎ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్–ఎ జట్టు ఏడు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా–ఎ జట్టును చిత్తు చేసి ట్రోఫీని సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 267 పరుగులు సాధించింది. ఫర్హాన్ బెహార్డియన్ (101 నాటౌట్), డ్వెన్ ప్రెస్టోరియస్ (58) అద్భుత బ్యాటింగ్‌తో సౌతాఫ్రికాను ఆదుకున్నారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్–ఎ జట్టు 46.5 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. శ్రేయస్ అయ్యర్ 140 (నాటౌట్) అజేయ సెంచరీతో భారత్‌ను గెలిపించాడు. అతనికి విజయ్ శంకర్ (72; 86 బంతుల్లో 9x4) అండగా నిలిచాడు. చెలరేగి ఆడిన శ్రేయస్ 131 బంతుల్లోనే పదకొండు ఫోర్లు, మరో నాలుగు భారీ సిక్సర్లతో అజేయంగా 140 పరుగులు చేశాడు. ఒక దశలో 20 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను శ్రేయస్, శంకర్ అద్భుత బ్యాటింగ్‌తో ఆదుకున్నారు.



నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా జడేజా

• ఐసిసి ర్యాంకింగ్స్





దుబాయి: ఐసిసి టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ రవీంద్ర జడేజా టాప్ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి మంగళవారం తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా బంగ్లాదేశ్ స్టార్ సాకిబ్ అల్ హసన్‌ను వెనక్కి నెట్టి నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో జడేజా ఆల్‌రౌండ్ ప్రతిభతో భారత్‌ను గెలిపించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో జడేజా అజేయంగా 70 పరుగులు చేయడమే కాకుండా ఏడు వికెట్లను కూడా పడగొట్టాడు. దీంతో అతనికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు కూడా దక్కింది. లంకపై అద్భుత ప్రదర్శన కనబరిచిన జడేజా ఆల్‌రౌండర్ల విభాగంలో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. జడేజా ఇప్పటికే బౌలింగ్ విభాగంలో కూడా మొదటి ర్యాంక్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. సాకిబ్ అల్ హసన్ రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. మరోవైపు భారత స్టార్ రవిచంద్రన్ అశ్విన్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో నిలిచాడు. శ్రీలంక సిరీస్‌లో అశ్విన్ కూడా ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్న విషయం విదితమే. ఇక, దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ప్రకంపనలు సృష్టించిన ఇంగ్లాండ్ స్టార్ మోయిన్ అలీ ఆల్‌రౌండర్ల విభాగంలో నాలుగో ర్యాంక్‌కు దూసుకెళ్లాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో మోయిన్ బ్యాట్‌తో, బంతితో సత్తా చాటి మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. ఇంగ్లాండ్‌కే చెందిన బెన్ స్టోక్స్ ఐదో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇక, బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ స్పీడ్‌స్టర్ జేమ్స్ అండర్సన్ రెండో ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. ఈ విభాగంలో భారత స్టార్ రవీంద్ర జడేజా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. సౌతాఫ్రికా సిరీస్‌లో అండర్సన్ నిలకడైన బౌలింగ్‌ను కనబరచడంతో అతని ర్యాంక్ మెరుగైంది. కాగా, భారత ఫాస్ట్ బౌలర్లు మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లు కూడా తమ ర్యాంక్‌లను మెరుగు పరుచుకున్నారు. తాజా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో షమి 20వ స్థానంలో నిలిచాడు. ఉమేశ్ యాదవ్ 22వ స్థానాన్ని దక్కించుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఐదో ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. మరోవైపు రెండో టెస్టులో సెంచరీలతో కదం తొక్కిన చతేశ్వర్ పుజారా, అజింక్య రహానెలు తమ ర్యాంక్‌లను మెరుగు పరుచుకున్నారు. పుజారా ఒక ర్యాంక్‌ను మెరుగు పరుచుకుని మూడో స్థానంలో నిలిచాడు. రహానె 11 స్థానాలు మెరుగు పరుచుకుని ఆరో ర్యాంక్‌కు దూసుకెళ్లాడు. మిగతావారిలో కెఎల్. రాహుల్ (11), సాహా (14)వ స్థానంలో నిలిచారు.

ఇంగ్లాండ్ @ 3

ఇక, టీమ్ విభాగంలో ఇంగ్లాండ్ జట్టు మూడో ర్యాంక్‌కు దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికాపై సిరీస్ గెలుచుకున్న ఇంగ్లాండ్ తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి మూడో స్థానానికి చేరుకుంది. ఇంగ్లాండ్ 105 పాయింట్లతో టాప్–3లో నిలిచింది. సిరీస్ కోల్పోయినా దక్షిణాఫ్రికా 110 పాయింట్లతో రెండో ర్యాంక్‌ను కాపాడుకుంది. భారత్ 123 పాయింట్లతో ఎవరికి అందనంత ఎత్తులో ఉంది. రెండో స్థానంలో ఉన్న సౌతాఫ్రికా కంటే భారత్ 13 పాయింట్లు అధికంగా కలిగింది. ఇక, మూడో టెస్టులోనూ గెలిస్తే భారత్ తన రేటింగ్ పాయింట్లను మరింత పెంచుకోవడం ఖాయం. ఆస్ట్రేలియా 100 పాయింట్లతో నాలుగో స్థానంలో, న్యూజిలాండ్ 97 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాయి.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.